శనివారం

09-11-2024

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 48

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ట్రంప్ 'చీఫ్ ఆఫ్ స్టాఫ్'గా సూసీ విల్స్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టబోయే డొనాల్డ్ ట్రంప్ తన సిబ్బంది నియామకాలను చేపట్టారు. శ్వేతసౌధం చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సూసీ విల్స్‌ను నియమించారు. తన ప్రచారాన్ని విజయవంతంగా నిర్వహించిన మేనేజర్‌కు కీలక పగ్గాలు అప్పగించారు. ఈ పదవీ బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా విల్స్‌ను నిలిపారు. చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న వారు అధ్యక్షుడికి నమ్మకస్తులుగా ఉంటారు. అధ్యక్షుడి అజెండా అమలు, రాజకీయ పోటీలో సమతుల్యత, విధానాల ప్రాధాన్యతలు వంటివన్నీ వీరు చూసుకుంటారు. అధ్యక్షుడు ఎవరిని కలవాలి, ఎవరిని కలవరాదు... ఎవరితో సమయం గడపాలని, ఎవరితో మాట్లాడాలి వంటి నిర్ణయాలు కూడా చీఫ్ ఆఫ్ స్టాఫ్ తీసుకుంటారు. ఓ విధంగా అధ్యక్షుడికి ద్వారపాలకులుగా వ్యవహరిస్తారు.

స్టేరింగ్ అమరిక పనుల ప్రారంభం

విశాలాంధ్ర-పోలవరం: జలవిద్యుత్ కేంద్రంలో టర్బైన్‌ల ఏర్పాటులో కీలకమైన స్టేరింగ్ అమరిక పనులు శుక్రవారం జెన్‌కో ఎంఈఐఎల్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పూజకు ఏపీ జెన్‌కో ఎస్ఈ రామ భద్రరాజు, ఈఈ వై. భీమాధనరావు, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ అధికారి సతీశ్‌బాబు అంగర, ఎలక్ట్రో మెకానికల్ విభాగం సీనియర్ మేనేజర్ మణికంఠ హాజరయ్యారు. ప్రాజెక్ట్‌లో ఈ స్టేరింగ్‌లు కీలక పాత్ర పోషిస్తాయి ఒక్కో స్టేరింగ్ నాలుగు విభాగాలుగా ఉంటాయని, దీని

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ దాడుల్లో 100 మంది మృతి

గాజా: పలస్తీనాపై ఇజ్రాయిల్ సైన్యం ఏడాదికి పైగా దాడులు కొనసాగిస్తూనే ఉంది. తాజాగా ఇజ్రాయిల్ సైన్యం గాజా, లెబనాన్‌లో జరిపిన దాడుల్లో వందమందికిపైగా మృతి చెందారు. గడచిన 24 గంటల్లో గాజా అంతటా ఇజ్రాయిల్ సైన్యం జరిపిన వైమానిక దాడుల వల్ల 50 మందికి పైగా పలస్తీనియన్లు మృతి చెందారని వైద్యవర్గాలు మీడియాకు వెల్లడించాయి. మరోవైపు ఇజ్రాయిల్ దళాలు లెబనాన్‌పై జరిపిన దాడుల్లో 52 మంది చనిపోగా, 161 మంది గాయపడినట్లు తాజాగా లెబనాన్

- మిగతా 2 లో



20 మంది డీఎస్పీల బదిలీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డీఎస్పీల బదిలీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 20 మంది డీఎస్పీలను కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో జి.సీతారామారావు, వీవీ అప్పారావు, ఎన్.కాళిదాస్ చిట్టిబాబు, బి.రామకృష్ణ, సురేశ్‌కుమార్ రెడ్డి, ఏటీజీ తిలక్, రవికిరణ్,

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అచ్చిచ్చీ... అక్రమణలు లేకపోతే ఇక మనం అధికారంలో ఉండి ఏం ప్రయోజనం!? నేనొప్పుకోను.

సీ ప్లేన్ ట్రయల్ విజయవంతం

నేడు శ్రీశైలం వెళ్లనున్న సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ-శ్రీశైలం 'సీ ప్లేన్' ట్రయల్ రన్ విజయవంతమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని శనివారం ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. మొదట విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి సీ ప్లేన్' శ్రీశైలానికి వెళ్లింది. అక్కడి జలాశయం నీటిలో సురక్షితంగా ల్యాండ్ అయింది. అనంతరం శ్రీశైలం టూరిజం బోటింగ్ జట్టీ వద్దకు సీ ప్లేన్ చేరుకుంది. ఎస్డీఆర్ఎఫ్, పోలీసు, టూరిజం, వైమానిక దళ అధికారుల సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ నెల 9న విజయవాడ పున్నమిఘాట్ నుంచి శ్రీశైలానికి 'సీ ప్లేన్' ప్రయోగానికి శ్రీకారం చుట్టనున్నారు. డీ హవిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ రూపొందించిన 14 సీట్ల సీ ప్లేన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారు. అనంతరం ఆయన నేరుగా సీప్లేన్‌లో శ్రీశైలం వెళ్లి తిరిగి విజయవాడ చేరుకుంటారు. ఆయనతోపాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సీ ప్లేన్‌లో ప్రయాణం చేయనున్నారు. విజయవాడ-శ్రీశైలం మధ్య ఈ సీప్లేన్‌ప్లే నడిపేందుకు అనుకూలతలపై నిర్వహించే ఈ ప్రయోగం విజయవంతమైతే రెగ్యులర్ సర్వీసుగా ప్రారంభించాలని డీహవిల్లాండ్ ఎయిర్‌క్రాఫ్ట్ సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. దీనిపై విజయవాడ సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని పున్నమిఘాట్‌లో 1000 మంది ప్రజలు వీక్షించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. చంద్రబాబు రాకకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అన్ని శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు ఇక్కడకు రానున్నట్లు తెలిపారు. పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని సీపీ రాజశేఖర బాబు వెల్లడించారు..

మూసీ ప్రక్షాళనకు దుర్మార్గులే అడ్డు

- ముందువరుసలో బీఆర్ఎస్
- కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు దోపిడీ
- బుల్డోజర్‌కు ఎవరు అడ్డొచ్చినా లెక్కచేయం
- పాదయాత్రలో రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: మూసీ ప్రక్షాళనకు కొందరు దుర్మార్గులు అడ్డొస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. అడ్డుపడే వారిలో బీఆర్ఎస్ ముందువరుసలో ఉందని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఉత్పత్తులను ఎవరూ కొనడంలేదని, కల్లు అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం సంగెం నుంచి మూసీ పునరుజ్జీవ యాత్రకు ముఖ్యమంత్రి శుక్రవారం శ్రీకారం చుట్టారు. సంగెం నుంచి నాగిరెడ్డి పల్లె వరకు ధర్మారెడ్డి కాల్వ వెంబడి సుమారు 2.5 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడుతూ... 'మూసీ నదిలో చేపలు బతుకుతున్నాయా... ఈ నది ఒడ్డున పెంచిన గొర్రెలను ఎవరూ కొనడం లేదు. మూసీ నది కలుషితం కావడంతో వ్యవసాయం చేయడం లేదు. మూసీ కాలుష్యం కారణంగా పట్టణాలు, గ్రామాలు నాశనం అవుతున్నాయి. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ నేతలు రూ.లక్ష కోట్లు దోచుకున్నారు. ఆ పార్టీ నేతలవలే గారడీ చేయడం మాకు చేతకాదు. మూసీ ప్రక్షాళన, బుల్డోజర్‌కు ఎవరు అడ్డొచ్చినా లెక్కచేయం. ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిశ్చయించుకున్నాం. మరో 30 రోజుల్లో తుదిరూపం తీసుకొస్తాం' అని పేర్కొన్నారు. జనవరి తొలివారంలో వాడపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభిస్తానని రేవంత్ ప్రకటించారు. మూసీ పునరుజ్జీవ సంకల్పయాత్రలో భారీగా కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు. సంగెం గ్రామస్థులు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు. మూసీ వల్ల కలిగే సమస్యలను సీఎంకు వివరించారు.

టీటీడీ తరహా ఆలయ బోర్డు

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో యాదగిరిగుట్ట ఆలయ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బోర్డు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామిని సీఎం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అభివృద్ధిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ టీటీడీ స్థాయిలో బోర్డుకు ప్రాధాన్యత ఉండేలా పూర్తి అధ్యయనం చేయాలని సూచించారు. గోశాలలో

- మిగతా 2 లో

అది మైనారిటీ విద్యాసంస్థ

అలీగఢ్ ముస్లిం వర్సిటీపై 4-3 మెజారిటీతో సుప్రీంకోర్టు అభిప్రాయం



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ) మైనారిటీ హోదాపై కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏఎంయూకు మైనార్టీ హోదా వర్తిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఎస్‌సీ శర్మ, సంజీవ్ ఖన్నా, జేబీ పార్దివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం శుక్రవారం 4-3 మెజారిటీతో ఉత్తర్వులు జారీచేసింది. రాజ్యాంగంలోని అధికరణ 30 కింద మతపరమైన, భాషాపరమైన మైనారిటీల సాధికారత కోసం విద్యాసంస్థల ఏర్పాటుకు అనుమతి ఉన్నట్లు కోర్టు తెలిపింది. దీని ప్రకారమే ఏఎంయూకు మైనారిటీ హోదా వర్తిస్తుందని తేల్చింది. ఇదే వ్యవహారంలో

- మిగతా 2 లో

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం: భట్టి

రూ.22.10 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-ఖమ్మం: ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో సీఆర్ఆర్ నిధులు రూ.22.10 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అమలు చేస్తున్నామన్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచినట్టు చెప్పారు. కాగా, పీఏసీఎస్ గోదాం, కార్యాలయం, స్టోర్ రూం భవనాన్ని ప్రారంభించారు. నాగిలిగొండ నుంచి కొండవనమాల వరకు నాలుగు కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు, నాగిలిగొండ నుంచి గొల్లెనపాడు వరకు ఏడు కోట్ల 10 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు , జగన్నాథపురం వేంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి రేపల్లేవాడ వరకు కోటి రూపాయలతో చేపట్టిన బీటీ రోడ్డు, ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి జగన్నాథపురం వరకు రూ.కోటతో, పందిళ్లపల్లి నుంచి మత్కే పల్లి వరకు ఎనిమిది కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారికి అన్నప్రాసన

జగన్నాథపురం వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కామేపల్లి మండలం అడవిమద్దులపల్లి గ్రామానికి చెందిన మల్లెబోయిన ఉపేందర్- పద్మ దంపతుల కుమార్తె లాత్వికకు డిప్యూటీ సీఎం అన్నప్రాసన చేశారు. ఆ దంపతులు అభ్యర్థించగా వారి కోరికను నెరవేర్చారు. తొలుత పూర్ణకుంభంతో పండితులు స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

సీపీఐలో 500 మంది చేరిక

కష్టజీవులు, కార్మికుల అండతో వందేళ్ల మనుగడ: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీగా సీపీఐకి దశాబ్దాలుగా గుర్తింపు కొనసాగుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. రాజీలేని పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్రజెండా పార్టీ కాబట్టే వందేళ్లుగా మనుగడలో ఉందన్నారు. ఇలాగే కొనసాగితే మరో వందేళ్లైనా చెక్కు చెదరదన్నారు. పార్టీ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో శుక్రవారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం పట్టణ పరిధిలోని గ్రామాలు, బస్తీల నుంచి వివిధ పార్టీలు... ప్రజా సంఘాల్లో క్రియాశీలక పాత్రా పోషించిన నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మంది కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరారు. ఎర్ర కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ... నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సీపీఐ ఒక ప్రాంతానికో, వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గ బహుముఖ అభివృద్ధే అంతిమ లక్ష్యంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు. చల్లా శకుంతల, భాస్కర్, మోహనరావు, ఇమ్రాన్, జమాల్,

- మిగతా 2 లో

జగన్ పిటిషన్‌పై డిసెంబరు 13న విచారణ

కౌంటర్ దాఖలు చేయాలని విజయమ్మ, షర్మిలకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: షేర్ల బదిలీ అంశంపై తల్లి, చెల్లిపై ఎన్‌సీఎల్‌సీ కోర్టును ఆశ్రయించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పిటిషన్‌పై విచారణ డిసెంబరు 13వ తేదీకి వాయిదా పడింది. హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో సరస్వతీ పవర్ కేసుకు సంబంధించి జగన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. తనకు తెలియకుండా తల్లి, సోదరి అక్రమంగా షేర్లు బదిలీ చేసుకున్నారని అందులో పేర్కొన్నారు. విజయమ్మ, షర్మిల, జనార్దన్‌రెడ్డిని ప్రతివాదులుగా చేర్చారు. షేర్ల బదిలీ ఫారాలు, ఇతర డాక్యుమెంట్లు ఏమీ సమర్పించకుండానే

- మిగతా 2 లో

కాంగ్రెస్‌కు అవకాశం లేదు

బీజేపీది నామమాత్రపు పోటీ

నా గెలుపు తథ్యం: ఎల్‌డీఎఫ్ అభ్యర్థి సత్యన్ మొకేరి

వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరగబోయే ఉపఎన్నిక ప్రచారం వేడెక్కింది. అధికార ఎల్‌డీఎఫ్, ప్రతిపక్ష యూడీఎఫ్ మధ్య రసవత్తర పోరు సాగబోతోంది. యూడీఎఫ్ తరపున కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా బరిలో నిలవగా ఎల్‌డీఎఫ్ తరపున సీపీఐ సీనియర్‌నేత సత్యన్ మొకేరి పోటీ చేస్తున్నారు. బీజేపీ టికెట్‌పై నవ్య హరిదాస్ రంగంలోకి దిగారు. వయనాడ్‌లో కాంగ్రెస్‌కు గెలుపు అవకాశాలు సన్నగిల్లాయని, బీజేపీది నామమాత్రపు పోటీ అని మొకేరి అన్నారు. తన గెలుపుపై దీమా వ్యక్తంచేశారు. ప్రజాదరణ, తన రాజకీయ అనుభవమే గెలిపిస్తాయని ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. కాంగ్రెస్ హామీల ఉచ్చులో చిక్కుకునే పరిస్థితుల్లో వయనాడ్ ప్రజలు లేరన్నారు. వయనాడ్ తన కుటుంబమని చెప్పుకొని రాయ్‌బరేలికి వెళ్లిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఓటర్లు మళ్లీ నమ్మి మోసపోబోరని చెప్పారు. భావి ప్రధాన మంత్రిగా ప్రచారం జరిగినందునే 2019 ఎన్నికల్లో రాహుల్‌కు ఓట్లు పడ్డాయని, తాజా సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆయనకు మరో అవకాశాన్ని వయనాడ్ ప్రజలు ఇచ్చారని, కాంగ్రెస్ నేత

- మిగతా 2 లో

సంతృప్తిగా ఉంది...

సీజేఐ చంద్రచూడ్ భావోద్వేగం

న్యూఢిల్లీ: రేపటి నుంచి తాను సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్నది వాస్తవం... అయితే తాను వృత్తిపరంగా మాత్రం చాలా సంతృప్తి చెందానని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ అన్నారు. ఆయనకు సుప్రీం కోర్టు ధర్మాసనం శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. నవంబరు 09, 2002న భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రచూడ్... నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు. శని, ఆదివారాలు కోర్టుకు సెలవు కావడంతో శుక్రవారమే ఆయనకు చివరి పని దినం అయింది. దీంతో సుప్రీం ధర్మాసనం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తిగా చివరి సందేశం ఇచ్చారు. వృత్తి పరంగా తాను పూర్తి సంతృప్తిగా ఉన్నానన్నారు. 'రేపటి నుంచి సర్వోన్నత న్యాయస్థానం నుంచి తీర్పులు ఇవ్వలేనన్న మాట వాస్తవం.. అయినప్పటికీ నేను వృత్తిపరంగా పూర్తి సంతృప్తిగా ఉన్నాను' అని తెలిపారు. మొన్న సాయంత్రం తన రిజిస్ట్రార్

- మిగతా 2 లో

తెలంగాణ రాకుంటే రేవంత్ సీఎం అయ్యేవారా?

2లో

ప్రజా తీర్పు గౌరవిస్తాం

2లో

జనవరిలో ప్రశాంతంగా అధికార బదిలీ: బైడెన్

బాల్యం ఛిద్రం

8లో

- ప్రపంచవ్యాప్తంగా హింసకు గురైన 100 కోట్ల మంది పిల్లలు
- ప్రతి 10 మందిలో తొమ్మిది మందికి వేధింపులు
- 13 నిమిషాలకో హత్య: ప్రపంచ ఆరోగ్య సంస్థ

ప్రజా తీర్పు గౌరవిస్తాం

జనవరిలో ప్రశాంతంగా అధికార బదిలీ: బైడెన్

వాషింగ్టన్: ప్రజా తీర్పును గౌరవిస్తామని, వచ్చే ఏడాది జనవరిలో అధికార బదిలీ ప్రక్రియను ప్రశాంతంగా చేపడతామని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత ఆయన తొలిసారి జాతినుద్దేశించి మాట్లాడారు. 'ప్రజల నిర్ణయాన్ని అంగీకరిస్తున్నాం. వారు తమ అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రజాస్వామ్యంలో ప్రజలదే నిర్ణయం' అని అన్నారు. 'ప్రజలు వారి పనిని వారు చేశారు. ఇక అధ్యక్షుడిగా నేను చేయాల్సింది చేస్తా. నేను చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడతా, రాజ్యాంగాన్ని గౌరవిస్తా. 2025, జనవరి 20న అమెరికా బాధ్యతలను కొత్త ప్రభుత్వానికి అప్పగిస్తా' అని బైడెన్ తెలిపారు. ట్రంప్‌తో మాట్లాడి ఆయనకు శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. అధికార బదిలీ ప్రశాంతంగా జరుగుతుందని ఆయనకు హామీనిచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌తోనూ మాట్లాడానన్నారు. ఆమె సాహసోపేత ధోరణి, విశ్వాసం, కష్టపడే స్వభావం, నిజాయితీని కొనియాడారు. అసాధారణ రీతిలో ఎన్నికల ప్రచారాన్ని నడిపించినందుకు ఆమె బృందం గర్వపడాలని బైడెన్ అన్నారు. 'దేశంలో కొందరికి ఇది విజయోత్సవం, సంబరాలు జరుపుకునే

సమయం... మరికొందరికి ఓటమి, నిరాశమిగిల్చిన సమయం. ఎన్నికల ప్రచారమంటే భవిష్యత్ ప్రణాళికలు/దృక్పథాల మధ్య పోటీ. వీటిలో ఒక దానికి మాత్రమే ప్రజామోదం లభిస్తుంది. ప్రజల ఎంపికను మనం గౌరవించాలి. కేవలం గెలిస్తేనో... ఏకాభిప్రాయం కుదిరితేనో దేశాన్ని ప్రేమించడం కాదు... అన్ని వేళలా దేశాన్ని ప్రేమిస్తారు. మీరు ఎవరికి ఓటు వేసినా తోటి అమెరికన్లుగా ఒకరికొకరు తోడు నీడగా నిలుస్తారని కోరుకుంటున్నా' అని బైడెన్ అన్నారు. డొనాల్డ్ ట్రంప్‌కు పరోక్షంగా ఓ సలహా ఇచ్చారు. అమెరికా ఎన్నికల వ్యవస్థ సమగ్రతపై ప్రశ్నలను విడనాడాలని సూచించారు. ఈ వ్యవస్థ నిజాయితీగా, పారదర్శకంగా, న్యాయంగా, నమ్మకంగా పనిచేస్తుందని... ఎవరు గెలిచినా... ఎవరు ఓడినా... ఈ వ్యవస్థ విశ్వసనీయత కోల్పోరాదన్నారు. ఎన్నికల సిబ్బందిని ప్రశంసించారు. తనతో కలిసి పనిచేసిన సిబ్బంది, కేబినెట్ సభ్యులు, మద్దతుదారులతో పాటు 40ఏళ్ల రాజకీయ జీవితంలో వెంట నడిచిన ప్రతి ఒక్కరికి బైడెన్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. 'నాలుగేళ్లలో మీరు ఎంతో శ్రమించారు. ఇది కష్టకాలమని.. మీకు బాధ కలిగిందని అర్థం చేసుకోగలను కానీ మనం సాధించిన విజయాలను మరచిపోవద్దు. మీరంటే నాకెంతో అభిమానం' అని అన్నారు. 'మీ సహకారంతో ఈ పదవీ కాలం చరిత్రాత్మకమైంది. ఇది ప్రజా ప్రభుత్వం' అని బైడెన్ తన ప్రసంగాన్ని ముగించారు. ఓటమితో నిరాశ చెందవద్దంటూ పార్టీ శ్రేణులకు ఆయన హితవు పలికారు. ఇదిలావుంటే చెరగని చిరునవ్వుతో బైడెన్ ప్రసంగించడంపై కొందరు విమర్శలు గుప్పించారు. బైడెన్ కూడా ట్రంప్‌కు ఓటేశారని, అందుకే అంత సంతోషంగా ఉన్నారంటూ సామాజిక మాధ్యమాల్లో కొంతమంది ఎద్దేవా చేశారు.

అమెరికాతో చర్చలకు రష్యా సిద్ధం: పుతిన్

సోచి: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. హత్యాయత్నాన్ని ధైర్యంగా ఎదుర్కొన్నారని ఆయనను ప్రశంసించారు. ట్రంప్ ప్రభుత్వం చర్చలకు మాస్కో సిద్ధమన్నారు. ట్రంప్ గెలుపు తర్వాత పుతిన్ తొలిసారి స్పందించారు. రష్యా బ్లాక్ సీ రిసార్ట్ ఆఫ్ సోచిలోని వల్దాయి డిస్కషన్ క్లబ్ వద్ద మాట్లాడుతూ 'ఎన్నికల్లో ఘన విజయం సాధించనందుకు శుభాకాంక్షలు తెలుపున్నా. తుపాకీ ఎక్కుపెట్టినప్పుడు ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారు. తగిన విధంగా వ్యవహరించారు' అని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని ముగించేందుకు రష్యాతో సంబంధాలను చక్కబెట్టుకోవాలనే ఆలోచన మంచిదే అని చెప్పారు. జరగబోయేది ఏమిటో తనకు తెలియదన్న పుతిన్... అమెరికాతో చర్చలకు తాము సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. అధికారంలోకి వస్తే 24 గంటల్లో ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పుతానంటూ ఎన్నికల ప్రచారంలో ట్రంప్ హామీనివ్వడం తెలిసిందే.

అరిజోనా, నెవడాలో తేలని ఫలితాలు

నత్తనడకన ఓట్ల లెక్కింపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడలేదు. మెజారిటీ స్థానాలను కైవసం చేసుకొని రిపబ్లికన్ పార్టీ విజయ కేతనం ఎగురవేసినప్పటికీ ఇంకా రెండు రాష్ట్రాలు ఫలితాలు వెలువడాల్సి ఉంది. అవే అరిజోనా, నెవడా. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ట్రంప్ గాలి వీచింది కానీ ఆయనకు స్పష్టమైన మెజారిటీపై స్పష్టత రాలేదు. నెవడాలో ఆరు ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రిపబ్లికన్లకు ఇక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నాయి. వీస్తోంది. అరిజోనాలో 11 ఎలక్టోరల్ ఓట్లు ఉండగా గత రెండు ఎన్నికల్లో విభిన్న ఫలితాలు వెలువడ్డాయి. నెవడాలో 94శాతం ఓట్ల లెక్కింపు జరిగింది. 51శాతం ఓట్లు రిపబ్లికన్లకు వచ్చాయి. ఇక డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్‌కు 47.2 శాతం ఓట్లు లభించాయి. అరిజోనాలో 70శాతం ఓట్లు లెక్కించగా ట్రంప్‌కు 52.3శాతం, హారిస్‌కు 46.8శాతం చొప్పున ఓట్లు వచ్చాయి. ఇదిలావుంటే, ఫలితాలు వెలువడేందుకు మరికొన్ని రోజులు పట్టొచ్చని అమెరికా మీడియా చెబుతోంది. అరిజోనాలో మెయిల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ జరగడంతో, వాటి లెక్కింపుకు 10-13 సమయం పడుతుందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. 2020లో అరిజోనా 90శాతం ఓటింగ్ మెయిల్ బ్యాలెట్ ద్వారానే జరిగింది.

దీంతో ఓట్లు అందిన వెంటనే అధికారులు వాటిని లెక్కించినాగానీ ఫలితాలు రావడానికి కాస్త జాప్యం జరిగింది. పోలింగ్ ముగిసిన గంట తర్వాత వరకు ముందస్తు ఓటింగ్ శాతాన్ని వెల్లడించలేదు. ఇక పోలింగ్ రోజు నమోదైన ఓట్లను లెక్కించడానికి సమయం పట్టింది. అదే విధంగా నెవడాలో పోస్టల్ బ్యాలెట్లు... కౌంటింగ్ కేంద్రాలకు చేరడానికి కనీసం ఇంకో రోజు పడుతుంది. పోస్టల్ బ్యాలెట్ల సమస్యల పరిష్కరించుకోవడానికి ఈనెల 12వ తేదీ వరకు గడువు ఉంది. ఓట్ల లెక్కింపు నత్తనడకన సాగుతోంది. 2020లో ఎన్నికలు పూర్తయిన ఐదు రోజులకు ఫలితాలు వెలువడ్డాయి. మెయిల్ బ్యాలెట్లు 12వ తేదీ కంటే ముందు లెక్కించడానికి కౌంటీలకు అనుమతి ఉంది. అమెరికా ఎన్నికల్లో విజయం సాధించడానికి 270 ఓట్లు అవసరం. ట్రంప్ ఇప్పటికే 295 సాధించారు. కమల హారిస్‌కు 226 ఓట్లు వచ్చాయి. ట్రంప్ విజేతగా నిలిచారు. అరిజోనా, నెవడా ఫలితాలు కేవలం అధిక్యతను మార్చగలవు తప్ప తుది ఫలితాన్ని ప్రభావితం చేయలేవన్నది విదితమే.

అది మైనారిటీ విద్యాసంస్థ

(మొదటిపేజీ తరువాయి)

1967 నాటి తీర్పును కొట్టివేసింది. ఎనిమిది రోజుల పాటు సాగిన వాదనల అనంతరం ఈ కేసులో తీర్పును ఫిబ్రవరి 1న సుప్రీంకోర్టు రిజర్వు చేసింది. సీజేఐ డీవై చంద్రచూడ్ చివరి పనిదినాన దీనిపై తీర్పు ఇచ్చింది. '1875లో మహమ్మదన్ ఆంగ్లో-ఓరియంటల్ కాలేజీగా ఏర్పాటైన విద్యాసంస్థ... 1920లో బ్రిటిష్ పాలనలో అలీగఢ్ యూనివర్సిటీ అయింది. దానిని మైనారిటీలు ఏర్పాటు చేయలేదని చెప్పలేమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఏఎంయూ సవరణ చట్టం-1981 మైనారిటీ హోదాను కల్పించిందని పేర్కొంది. మైనారిటీ విద్యాసంస్థల్లో లౌకిక విద్యకు అవకాశమున్నట్లు తెలిపింది. ఇలాంటి వ్యవస్థల లక్షణాలను ఉల్లంఘించనంత వరకు మైనారిటీ విద్యావ్యవస్థలను ప్రభుత్వం నియంత్రించవచ్చని కోర్టు అభిప్రాయపడింది.

తాజా తీర్పు 4-3 మెజారిటీతో వెలువడగా విభేదించిన న్యాయమూర్తుల్లో జస్టిస్ దత్తా ఉన్నారు. ఏఎంయూ మైనారిటీ విద్యావ్యవస్థ కాదన్నారు. కాగా, మైనారిటీలకు సేవ చేసే సంస్థల నియంత్రణ మైనారిటీ వర్గమే చూసుకోవాలని జస్టిస్ శర్మ అన్నారు. లౌకిక విద్యకూ విద్యార్థులకు అవకాశం ఉండాలని చెప్పారు.

పూర్వాపరాలు

మతపరమైన, భాషాపరమైన మైనారిటీ సాధికారత కోసం విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు మైనారిటీలకు అధికారాన్ని రాజ్యాంగంలోని అధికరణ 30 ఇస్తుంది. దీని ఆధారంగానే ఏఎంయూకు మైనారిటీ హోదా వర్తిస్తుంది. 1875లో అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీని ఆంగ్లో-ఓరియంటల్ కాలేజీగా స్థాపించారు. ఇంపీరియల్ (సామ్రాజ్యవాద) చట్టం ద్వారా 1920లో విశ్వవిద్యాలయం చేశారు. అయితే ఈ చట్టాన్ని 1951లో సవరించారు. తద్వారా ముస్లిం విద్యార్థులకు తప్పనిసరి చేసిన మతపరమైన సూచనలు రద్దు అయ్యాయి. 1981లో రెండవ సవరణను ప్రతిపాదించారు. 1951కు ముందున్న స్థితిని పునరుద్ధరించాలని ఆ సవరణ ప్రతిపాదించగా, ఆ పని మనస్ఫూర్తిగా జరగలేదని సీజేఐ అన్నారు. ఈ సవరణ సగం పని మాత్రమే చేసిందని చెప్పారు. కాగా, కేంద్ర వర్సిటీగా ఉన్న ఏఎంయూ... మైనారిటీ విద్యావ్యవస్థ కాదని 1967లో ఎస్ అజీజ్ పాషా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. ఇదిలావుంటే ఫిబ్రవరిలో వాదనలు జరిగినప్పుడు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తదితరులు ఏఎంయూకు వచ్చే నిధుల గురించి ప్రస్తావించారు.

2019-2023 మధ్య కాలంలో రూ.5వేల కోట్లకుపైగా నిధులను కేంద్రప్రభుత్వం నుంచి పొందినందునే మైనారిటీ స్వభావాన్ని ఏఎంయూ విడనాడిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఏఎంయూ మైనారిటీ విద్యాసంస్థ కాదంటూ 1981లో జరిగిన సవరణను 2006లో అహ్మదాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం 2006లో ఇచ్చిన హైకోర్టు తీర్పును సవాల్ చేసింది. ఇదే తీర్పుపై వేరుగా యూనివర్సిటీ పిటిషన్ వేసింది. నాటి సీజేఐ రంజన్ గొగోయ్ నేతృత్వ త్రిసభ్య ధర్మాసనం దీనిని విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేసింది. తాజా విచారణ క్రమంలో ఏఎంయూకు మైనారిటీ హోదా వర్తిస్తుందంటూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది.

కాంగ్రెస్‌కు అవకాశం లేదు

(మొదటిపేజీ తరువాయి)

వయనాడ్‌ను కాదని రాయ్‌బరేలిని ఎంచుకున్నారని మొకేరి అన్నారు. ఈ పరిస్థితుల్లో మూడోసారి రాహుల్ మాటలను వయనాడ్ ప్రజలు నమ్మరన్నారు. ఈ కారణంగా ప్రియాంక గాంధీకి ఓటు వేయరని, ముఖ్యంగా యువత మార్పు కోరుకుంటున్నారని ఆయన చెప్పారు. ఎంపీగా వయనాడ్‌లో రాహుల్ పదవీ కాలం ఎలా సాగిందన్న ప్రశ్నకు మొకేరి స్పందిస్తూ స్థానిక సమస్యలు పట్టించుకోని వ్యక్తి ఏం ప్రాతినిధ్యం వహిస్తారని ప్రశ్నించారు. 'బందీపూర్‌లో రాత్రి ట్రాఫిక్‌పై నిషేధం వంటి కీలకాంశాలను రాహుల్ లేవనెత్తలేదు. కర్నాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నాగానీ ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపలేదు. కర్నాటక ప్రభుత్వ వైఖరిని మార్చలేదు. జంతు-మానవ ఘర్షణ పరిష్కారానికి ఏమీ చేయలేదు. అభివృద్ధికి దోహదం కాగల నీలాంబుర్-నంజన్‌గుడ్ రైల్వేలైన్ విషయంలోనూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు' అని మొకేరి వ్యాఖ్యానించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ఏమైన చర్యలు తీసుకొని ఉంటే కాంగ్రెస్ వాటిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. వయనాడ్‌లో వైద్యపరంగా మౌలిక వసతులు లేకపోవడం గురించి ప్రియాంక గాంధీ ఇప్పుడు మాట్లాడుతున్నారు కానీ ఇక్కడ వైద్య కళాశాలను మొదలు పెట్టినది, అందుకోసం మౌలిక వసతులు కల్పిస్తున్నది ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమని నొక్కి చెప్పారు. 'రాహుల్ రాజీనామాతో వయనాడ్‌కు పార్లమెంటులో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. కొండచరియలు విరిగిపడినప్పుడు బాధితులకు పునరావాసం, కేంద్ర సాయం కోసం డిమాండ్‌కు తగిన ప్రాధాన్యత లభించలేదు' అని సత్యన్ మొకేరి అన్నారు.

ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై అసంతృప్తి వల్ల మీ గెలుపు అవకాశాలు సన్నగిల్లవా అని విలేకరి ప్రశ్నించగా అలాంటిదేమీ లేదన్నారు. పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికైనప్పటికీ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగుతున్న కాంగ్రెస్ ప్రచారాన్ని తమ విజయాలతో రాజకీయంగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తిప్పికొడుతుందని బదులిచ్చారు.

బీజేపీ నుంచి పోటీ ఉందా అని అడిగితే... అసలు ఆ పార్టీకి వయనాడ్ విషయంలో చిత్తశుద్ధి ఉందా అని మొకేరి ప్రశ్నించారు. 'సార్వత్రిక ఎన్నికలప్పుడు రాహుల్ గాంధీకి గట్టి పోటీ ఇస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేంద్రన్ చెప్పుకున్నారు. ఇప్పుడు నవ్య హరిదాస్‌ను నిలబెట్టారు. ఆమె సీనియర్ నేత కాదు... ఆమె ఎవరో కూడా వయనాడ్ ప్రజలకు తెలియదు. దీనిని బట్టి ఇక్కడ నుంచి పోటీపై బీజేపీకి చిత్తశుద్ధి ఉందనిపించడంలేదు' అని మొకేరి అన్నారు.

'మీ ప్రత్యర్థులు మహిళలు, మీకన్నా వయస్సులో అనుభవంలో చిన్నవాళ్లు. మీకు ఇది సమస్యగా అనిపించడం లేదా' అని విలేకరి ప్రశ్నిస్తే... ఇక్కడ లింగం, వయస్సు కాదు సామర్థ్యం ముఖ్యమని మొకేరి సమాధానం ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండటం, వారికి సమర్థ సేవలు అందించడం ప్రధానమన్నారు. ప్రియాంక, నవ్యతో పోలిస్తే తన రాజకీయ అనుభవం ఎక్కువన్నారు. గతంలో రాహుల్ వయనాడ్‌కు గడిపినంత సమయం కూడా ప్రియాంక ఉండగలరని తాను అనుకోవడంలేదని మొకేరి చెప్పారు. ఇండియా ఐక్య సంఘటనలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ భాగమేనని బీజేపీ చేస్తున్న ప్రచారానికి ఎలా తిప్పికొడతారన్న ప్రశ్నకు ఇలాంటి విమర్శలు, వ్యాఖ్యలు కేరళలో పనిచేయవని సత్యన్ మొకేరి బదులిచ్చారు. 'ఉత్తరాదిన ఫాసిస్టు శక్తుల కట్టడికి ఇండియా ఐక్య సంఘటన ఏర్పాటైంది. ఇలాంటి విమర్శలు కేరళలో పనిచేయవు. ఇక్కడ ఫాసిస్టు శక్తుల ప్రభావం లేదు' అని అన్నారు. ప్రజాదరణ కలిగిన వామపక్ష నాయకుడిగా వయనాడ్ నుంచి గెలుపుపై తనకు నమ్మకం ఉందని సత్యన్ మొకేరి తెలిపారు.

జగన్ పిటిషన్‌పై డిసెంబరు 13న విచారణ

(మొదటిపేజీ తరువాయి)

తమ పేర్ల మీదకు మార్చుకున్నారని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జగన్, భారతి, క్లాసిక్ రియాల్టీ పేరిట షేర్లు కొనసాగేలా ఆదేశించాలని జగన్ కోరారు. 51.01 శాతం షేర్లను యథావిధిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ప్రతివాదులను ఆదేశించగా... విజయమ్మ, షర్మిల తరపు న్యాయవాది తమకు కొంత సమయం కావాలని కోరారు. దీంతో విచారణను ఎన్‌సీఎల్‌టీ డిసెంబర్ 13వ తేదీకి వాయిదా వేసింది. ఇక ప్రతివాదులుగా ఉన్న వైఎస్ విజయమ్మ, వైఎస్ షర్మిల వాదనలను కూడా కోర్టు వినాల్సి ఉంటుంది. ఎంఓయూ రాసుకున్న తర్వాత ఎలాంటి సమాచారం లేకుండా షేర్లు ఎలా వెనక్కి తీసుకుంటారంటూ విజయమ్మ, షర్మిల ప్రశ్నిస్తున్నారు. 'తన సోదరిపై ఉన్న ప్రేమతో 2019లో ఎంఓయూ రాసుకున్నాం. అయితే ఇటీవల కాలంలో మా మధ్య రాజకీయ విభేదాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా నన్ను, నా భార్యను టార్గెట్ చేస్తూ షర్మిల వ్యాఖ్యలు చేశారు. అందుకే ప్రస్తుతం 51 శాతంగా ఉన్న ఆమె షేర్లను వెనక్కి తీసుకోవాలనుకుంటున్నాను. అందుకు నాకు అనుమతి ఇవ్వాలి' అని జగన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

సంతృప్తిగా ఉంది...

(మొదటిపేజీ తరువాయి)

జ్యుడిషియల్‌తో జరిగిన ఓ సంభాషణను గుర్తు చేసుకుంటూ... "నా రిజిస్ట్రార్ వీడ్కోలు ఉత్సవాన్ని ఎప్పుడు ప్రారంభించాలి అని నన్ను అడిగినప్పుడు... మిగిలి ఉన్న చాలా వస్తువులను మూటగట్టుకోడానికి వీలు కలుగుతుందని భావించి మధ్యాహ్నం 2 గంటలు అని చెప్పాను. కానీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎవరైనా ఇక్కడకు వస్తారా? లేక తెరపై నన్ను నేను చూసుకుని వదిలేస్తానా? అని ఆశ్చర్యపోయాను" అన్నారు. న్యాయమూర్తుల పాత్ర యాత్రికుల మాదిరిగానే ఉంటుందని, ప్రతిరోజూ కోర్టుకు సేవ చేయాలనే నిబద్ధతతో వస్తారన్నారు. 'మనం చేసే పని కేసులను సృష్టించవచ్చు లేదా విచ్ఛిన్నం చేయవచ్చు' అని చంద్రచూడ్ అన్నారు. సమర్థుడైన న్యాయమూర్తిగా పేరొందిన జస్టిస్ సంజీవ్ ఖన్నా చేతుల్లో ఈ ధర్మాసనాన్ని పెట్టడం తనకు భరోసాగా ఉందని ఆయన అన్నారు. 'నేను ఎప్పుడైనా కోర్టులో ఎవరినైనా బాధపెట్టినట్లయితే...దయచేసి నన్ను క్షమించండి' అని చంద్రచూడ్ అన్నారు. పదవీ విరమణ చేసిన ప్రధాన న్యాయమూర్తికి గౌరవ వీడ్కోలు పలికిన న్యాయవాదులు, బార్ సభ్యులు ఆయనను న్యాయవ్యవస్థలో "రాక్ స్టార్"గా అభివర్ణించారు. చంద్రచూడ్ స్థానంలో నవంబర్ 11న భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయనున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా మాట్లాడుతూ... సమోసాల పట్ల జస్టిస్ చంద్రచూడ్‌కు ఉన్న అభిమానం గురించి ఆయన వ్యక్తిగత వృత్తాంతం జోడించారు. ప్రధాన న్యాయమూర్తి స్వయంగా వాటిని తినకుండా ఉన్నప్పటికీ దాదాపు ప్రతి సమావేశంలోనూ వాటిని వడ్డించారని వ్యాఖ్యానించారు. జస్టిస్ చంద్రచూడ్ పదవీకాలంలో సుప్రీంకోర్టు ప్రాంగణ సుందరీకరణ ప్రాజెక్టులతో పాటు వికలాంగులకు సాధికారత కల్పించే సదుపాయం మిట్టి కేఫ్ స్థాపన నుండి మహిళా న్యాయవాదుల కోసం ప్రత్యేక బార్ రూమ్ వరకు కోర్టులో అనేక మార్పులు వచ్చాయన్నారు.

మూసీ ప్రక్షాళనకు దుర్మార్గులే అడ్డు

(మొదటిపేజీ తరువాయి)

గోసంరక్షణకు ఒక ప్రత్యేక పాలసీని తీసుకురావాలని పేర్కొన్నారు. గతంలో కొండపై నిద్రించేందుకు భక్తులకు అవకాశం లేదని, ఇకపై కొండపై నిద్ర చేసి మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులను వేగవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి పెండింగ్ లో ఉన్న భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను మంజూరు చేయాలని ఆదేశించారు. వారంరోజుల్లో పూర్తి వివరాలతో రావాలని అన్నారు. ఇకపై అన్ని రికార్డుల్లో యాదాద్రి బదులు యాదగిరిగుట్టగా వ్యవహారంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

దళితులను విస్మరిస్తే పుట్టగతులుండవ్

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి 'కరవది' హెచ్చరిక

విశాలాంధ్ర- చిత్తూరు: దళితులను విస్మరిస్తే పాలకులకు పుట్టగతులు ఉండవని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు హెచ్చరించారు. డీహెచపీఎస్ జిల్లా సభ స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో వి.దామోదరం అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సుబ్బారావు మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తి కావస్తున్న దళితులు, మహిళలపై అత్యాచారాలు, పరువు హత్యలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గత జగన్ ప్రభుత్వం 27 సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో లక్షలాది మంది దళితులకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆయా పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో హక్కుల సాధనకై జరిగే ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని దళిత సంఘాలకు పిలుపునిచ్చారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ .నాగరాజు మాట్లాడుతూ దళితుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షుడు జోరేపల్లి రామచంద్రయ్య, అధ్యక్ష కార్యదర్శులు బీ నాగభూషణం, చిన్నం కాలయ్య, చిత్తూరు నగర అధ్యక్షుడు దాసరి చంద్ర, టీసీ మహేశ్ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలుండాలి

డీటీసీపీ ఆర్జే విద్యుల్లత

విశాలాంధ్ర-విజయవాడకార్పొరేషన్ : ప్రణాళికాబద్ధంగా నిర్మాణాలుంటే భవిష్యత్తు తరాలకు బంగారు బాటేనని... అందుకు పట్టణ ప్రణాళికా విభాగం ఉద్యోగుల కృషి ఎనలేనిదని డీటీసీపీ ఆర్జే విద్యుల్లత అన్నారు. ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంగళగిరిలోని టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ... దేశ, రాష్ట్ర అభివృద్ధిలో పట్టణ ప్రణాళిక శాఖ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. చిన్న చిన్న నగరాలు మెట్రో నగరాలుగా రూపాంతరం చెంది... మహానగరాలుగా మారడంలో పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పట్టణ ప్రణాళిక ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకు వెళ్ళి ప్రణాళిక బద్ధంగా గృహనిర్మాణాలు చేపట్టేలా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో, మహానగరాల్లో పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తు న్నారని అరకొర సిబ్బందితో తీవ్రమైన పని భారంతో భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న పట్టణ ప్రణాళిక ఉద్యోగులను ఆమె

అభినందించారు. పట్టణ ప్రణాళిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ... పట్టణాలు, నగరాల అభివృద్ధికి రహదారుల విస్తరణతో పాటు పట్టణ ప్రణాళిక అధికారుల కృషి దోహదం చేస్తుందన్నారు. సిబ్బంది కొరతను ప్రభుత్వం తీర్చా లని, అర్హులైన వారందరికీ పదోన్నతులు కల్పించి పట్టణ ప్రణాళిక విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని కోరారు. తొలుత రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు అబ్దుల్ సత్తార్, కార్యదర్శి మోహన్‌బాబు అధ్వర్యంలో రాష్ట్ర పట్టణ ప్రణాళిక అదనపు సంచాలకులు శ్రీనివా సులు, జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ప్రభాకర్‌రావు, రాష్ట్ర పట్టణ, గ్రామ సంచాలకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు బేగ్, ట్రెజరర్ కృష్ణ, రాజ్యలక్ష్మి, ఏపీఓ పి.నాయుడు, సీఆర్డీఏ టీపీఓ శైలజ, సంజీవ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడుల్లో 100 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఆరోగ్యమంత్రిత్వశాఖ తెలిపింది. కాగా, ఈ దాడికి ప్రతిదాడిగా హెజ్బుల్లా గ్రూపు హైఫా నగరానికి వాయువ్యంగా ఉన్న ఇజ్రాయిల్‌కు చెందిన రామత్ డేవిడ్ వైమానిక స్థావరంపై దాడి చేసింది. ఈ విమానాశ్రయం వద్ద హెజ్బుల్లా గ్రూపు క్షిపణులు ప్రయోగించింది. గాజాలోని బీట్ లాహియా, జబాలియా ప్రాంతాల్లోని నివాసితులను అక్కడి నుంచి వెళ్లిపొమ్మని ఇజ్రాయిల్ సైన్యం ఆదేశాలిస్తూనే ఉంది.

తెలంగాణ రాకుంటే రేవంత్ సీఎం అయ్యేవారా? :హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చెరిపేస్తానని గతంలో వ్యాఖ్యానించిన సీఎం రేవంత్‌రెడ్డి ... ఇప్పుడు ఆయన కట్టిన ఆలయంలోనే పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. సీఎం యాదగిరిగుట్ట పర్యటనపై శుక్రవారం హరీశ్‌రావు స్పందించారు. మూసీకి మంచినీళ్లు కాళేశ్వరం నుంచే తరలిస్తామని సీఎం రేవంత్ చెప్పారని అన్నారు. తెలంగాణకు స్వాతంత్ర్యం తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని, భూమి ఉన్నంతకాలం కేసీఆర్ రాష్ట్ర ప్రజల గుండెల్లో ఉంటారని చెప్పారు. 'కేసీఆర్ లేకుండా తెలంగాణ వచ్చేదా... ప్రత్యేక రాష్ట్రం రాకపోయి ఉంటే మీరు సీఎం అయ్యేవారా' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.

స్టేరింగ్ అమరిక పనుల ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

బరువు 136 మెట్రిక్ టన్నులు. విద్యుత్ ఉత్పత్తికి వినియోగించే కప్లాన్ టర్బైన్‌లు సమర్థవంతంగా పనిచేయటంలో ఈ స్టేరింగ్‌లు కీలక పాత్ర వహిస్తాయి. ప్రాజెక్ట్ లో కీలకమైన నిర్మాణ పనులు దీని అమరిక తరువాత ఉంటాయి. రామభద్ర రాజు మాట్లాడుతూ జల విద్యుత్ కేంద్రంలో స్టేరింగ్‌ల ఏర్పాటు తరువాతే టర్బైన్ ల అమరిక చేపడతారని తెలిపారు. ప్రాజెక్ట్ పనుల్లో జాప్యం కాకుండా ఉండేందుకు అన్ని పనులు సమాంతరంగా చేస్తున్నట్లు వివరించారు. సతీశ్ బాబు మాట్లాడుతూ నిర్దేశించిన సమయానికి ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంతో పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్టేరింగ్‌ల అమరికకు 320 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రాలర్ క్రేన్‌ను వినియోగిస్తారు.

20 మంది డీఎస్పీల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

మల్లికార్జునరావు, శ్రీనివాసరెడ్డి, ఎండీ మోయిన్, కేసీహెచ్ రామారావు, విజయశేఖర్, కొంపల్లి వేంకటేశ్వరరావు, రసూల్ సాహెబ్, సీహెచ్‌వీ రామారావు, షణ్ను షేక్, ఎన్.సురేశ్‌బాబు, వాసుదేవన్, డి.లక్ష్మణరావు ఉన్నారు. ఇప్పటికే ఐపీఎస్, ఐఏఎస్‌లను బదిలీ చేసిన విషయం తెలిసిందే.

ఏపీలో బెల్టు షాపుల వేలం

విశాలాంధ్ర-దొరవారిసత్రం: గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. మంచినీరైనా దొరకదేమోగానీ 24గంటలూ నిరంతరాయంగా మద్యం అందుబాటులో ఉంటోంది. ప్రభుత్వం నుంచి లైసెన్సులు తీసుకుని నెలకొల్పిన మద్యం దుకాణాలతకు తోడు విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లో గత నెల రోజుల నుండి మద్యం సెలయేరులా పారుతోంది. మద్యం దొరకని గ్రామం లేదని స్థానికులు చెబుతున్నారు. మద్యం అధికంగా తీసుకుని మత్తు నెత్తికెక్కడంతో మాటా మాటా పెరిగి గ్రామాల్లో వివాదాలు మొదలయ్యాయి. ప్రభుత్వం బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీ చేసినా...అధికార పార్టీ నాయకుల అండదండలతో పోటా పోటీగా గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని వేణుంబాక, తొగరమూడి, మీజూరు, ఉచ్చూరు, వేలకాడు, కల్లూరు, పూలతోట, సింగనాలత్తూరు తదితర గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టులు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరిస్తున్నారు. గురువారం రాత్రి శ్రీధనమల్లి పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ అధ్వర్యంలో బహిరంగంగానే గ్రామంలో బెల్టు షాపు నిర్వహించేందుకు వేలం పాట ఏర్పాటు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన కొంతమంది గ్రామంలో బెల్టు షాపు పెట్టడానికి వీలు లేదని హెచ్చరించినా... మాజీ సర్పంచ్ అనుచరులు గొడవకు దిగారు. పోలీసులు కాదు ఎవరు వచ్చినా బెల్టు షాపు గ్రామంలో ఏర్పాటు చేయాల్సిందేనని వేలం పాట బహిరంగంగా పెట్టి నగదు తీసుకున్నారు. శ్రీధనమల్లిల్లో రూ. 1.60లక్షలు, వేణుంబాకలో రూ.2.30 లక్షలు, మీజూరు రూ.1.10 లక్షలు, పూలతోటలో రూ.1 లక్షకు పైగానే వేలంపాట ద్వారా వసూలు చేశారు. అదే విధంగా మండలంలో సుమారు 40 గ్రామాల్లో వేలంపాటలను బహిరంగంగానే నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

వీధికో బెల్టు షాపు...:

దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లో ఎక్కువమంది కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గతంలో ఎక్కడో

పట్టణం, మండల కేంద్రంలో మద్యం షాపులు ఉండేవి. దీంతో ఒక్కసారి కూలి పని చేసుకుని ఇంటికి వచ్చాక మళ్లీ మద్యం కోసం వెళ్లేవారు కాదు. ఇప్పుడు 24 గంటలూ గ్రామాల్లోని వీధుల్లోనే బెల్టు షాపులు పెట్టి... అన్ని రకాల బ్రాండ్‌లను అమ్ముతుండటంతో మత్తు కోసం పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులు పెట్టనీయకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సీపీఐలో 500 మంది చేరిక

(మొదటిపేజీ తరువాయి)

తేజా, శశి, యాకూబ్ పాషా, జమీల్, బానోత్ పద్మ, వడ్లూరి రాజారామ్, రమాదేవి, వీరన్న, సురేష్, భావ్ సింగ్, బోడ శ్రీను, జబ్బర్ సింగ్, కొత్తూరు నారాయణ, కట్ట నాగయ్య, పులిచెర్ల విశ్వనాథం,, సడియం వెంకన్న నేతృత్వంలో పెద్ద సంఖ్యలో కుటుంబాలు పార్టీలో చేరడం రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు.

పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, భూక్యా దస్రు, జీ వీరాస్వామి, వంగ వెంకట్, గెద్దాడు నగేష్, జక్కుల రాములు, ధనలక్ష్మి, కౌన్సిలర్లు యూసఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ములుగు జిల్లాలోని తాడ్వాయి మండల పరిధిలో గల బంధాల రిజర్వు అటవీ ప్రాంతంలోని వోద్దుగూడెం గ్రామ సమీపంలో వెట్టే వాగు వద్ద సిపిఐ మావోయిస్టు ఆయుధాల డంప్‌ను, స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ములుగు ఎస్పీ డాక్టర్ శబరిష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉందన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం 11 గంటలకు ములుగు జిల్లా పోలీసులు, బిడి టీమ్ బృందాలు అనుమానస్పద ప్రాంతానికి చేరుకొని, సోదాలు నిర్వహించగా, ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టులు అమర్చిన టువంటి ఆయుధాల డంప్‌ను గుర్తించి, వాటిని స్వాధీనపరచుకోవడం జరిగినదన్నారు. మొత్తం మూడు తుపాకులు, 165 లైవ్ రౌండ్స్‌ని, డంప్ నుండి స్వాదినం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు పోలీసుల ఎదుట, స్వచ్ఛందంగా లొంగిపోవాలని, వారికి ప్రభుత్వం తరపున, పునరావసం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పీ రవీందర్, పస్రా సిఐ, రవీందర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

అక్రమ ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన ఎస్సై

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఇటీవలే సుజాతనగర్ పోలీస్టేషన్ బదిలీపై వచ్చిన యుఎస్ఐ జుబేదా బేగం అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. సుజాతనగర్ సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తోలుతున్న రెండు ట్రాక్టర్లను ఆమె పట్టుకొని సీజ్ చేసారు. అక్రమార్కులు ఎవరికి అనుమానం రాకుండా అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని ఆమె శుక్రవారం వీడియోకు వెల్లడించారు. అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా ఇసుకను తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఎస్ఐ గత వారం క్రితం అక్రమంగా తరలిస్తున్న 84 కేజీల గంజాయిని కార్‌తో పాటు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దీంతో ఎస్సై పనితీరు పట్ల జిల్లా అధికారులు ప్రశంసించారు. గంజాయి, ఇసుక, నిషేధిత గుట్కా, చట్ట వ్యతిరేక పనులు చేస్తున్న అక్రమార్కులను చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు.

నిషేధిత మత్తు పదార్థాలను నిర్మూలించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి సహా నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయిని సాగుచేసినా, విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మత్తు పదార్థాలను వినియోగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాల వినియోగం గురించి తెలిస్తే వెంటనే జిల్లా పోలీస్ నెంబర్ 8712671111కు తెలియజేయాలనీ, అలాగే టోల్ ఫ్రీ 1908 నంబరును సంప్రదించాలని, తద్వారా మత్తు పదార్థాలకు బారి నుంచి రక్షించవచ్చునన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాల్లో గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్, డీఎస్పీ గంగారెడ్డి, డీఎంహెచ్వో రాజేందర్, ఎస్సీ అధికారి రాజేశ్వర్ గౌడ్, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి బర్త్ డే వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, తెలంగాణ రాష్ట్ర రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్, ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో 50 అడుగుల పొడవు వెడల్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగోలి చిత్రం ముందు భారీ కేక్ కట్ ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు కేక్ కట్ చేశారు. రా రైస్ మిల్లర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వుట్కూరు వీరేశం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నర్సాపూర్ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ చౌదరి, సుప్రభాతరావు, అరునార్తి వెంకట్ రమణ, దొంతి లక్ష్మి ముత్యంగౌడ్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్, పంచాయతీ కార్మికులు, మహిళలకు చీరల పంపిణీ చేశారు.

కొత్త రేషన్ కార్డులు, ఆసరా పింఛన్లు అందజేయాలి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి



విశాలాంధ్ర జిల్లా - బ్యూరో మహబూబాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డ్స్,ఆసరా పెన్షన్లు మంజూరి చేయకపోవడం శోచనీయమని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ మరిపెడ మండల కౌన్సిల్ చలమల రవి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డ్స్ ఆసరా పెన్షన్లు సంవత్సరాల తరబడి ఇవ్వకుండా తాత్సర్యం చేయడంతో అనేకమంది పేదలు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు చెబుతుందే తప్ప ఆచరణలో తెల్ల రేషన్ కార్డ్స్ ఆసరా పెన్షన్లు మంజూరు చేయకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామ సభల ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని చేపట్టాలని, రైతాంగానికి రైతు భరోసా, రెండు లక్షల రుణమాఫీని సంపూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ శత జయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమాలను సభ్యత్వ నమోదును పూర్తి చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, బుర్ర సమ్మయ్య, సోమనబోయిన కృష్ణ, గంట వెంకన్న, రాసాల వీరేందర్, తొట్ల లింగయ్య, అక్కినపల్లి రాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - నేలకొండపల్లి : విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తూ, అన్ని రకాల మౌళిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు మెరుగైన సేవాలందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మంత్రి, నేలకొండపల్లి మండలం ఆనంతనగర్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసి, విద్యార్థినులతో మధ్యాహ్న భోజనం చేశారు. గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ తరగతులను మంత్రి పరిశీలించారు. విద్యార్థినులతో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, భోజనం ఎలా ఉంది, వసతి, త్రాగునీరు, బోధన ఉపాధ్యాయులు సరిపోను ఉన్నది, తదితరాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, భోజనం బాగున్నట్లు, మంత్రి ట్రస్ట్ ద్వారా ఆర్వో ప్లాంట్ ఏర్పాటుచేసి, శుద్ధమైన త్రాగునీరు అందిస్తున్నారని విద్యార్థినులు తెలిపి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి పాఠశాల, కళాశాల కలియతిరిగి, ఇంకనూ చేపట్టాల్సిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్ వద్దకు వెళ్లి, అన్నం, కూరలు పరిశీలించారు. ప్రభుత్వం డైట్ చార్జీలు పెంచి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేట్లు చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. విద్యార్థులు కడుపునిండా భోజనం చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. భోజనం మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని మంత్రి అన్నారు. విద్యార్థినులతో మమేకమై, వారితో ముచ్చటిస్తూ, మంత్రి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. క్రీడల కొరకు మైదానం చదును చేసి చర్యలు చేపట్టాలన్నారు. ప్రహరి గోడ ఎత్తు పెంచుటకు, బోర్ వేయుటకు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి అన్నారు. ఇంకనూ కావాల్సిన ఏ సౌకర్యాలయినా దృష్టికి తెస్తే, వెంటనే చర్యలు తీసుకుంటానని మంత్రి అన్నారు. చదువు సమాజంలో ఉన్నత స్థానం కల్పిస్తుందని, ఉన్నత లక్ష్యం పెట్టుకొని, లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతి, సౌకర్యాలు సద్వినియోగం చేసుకొని, చదువుపై దృష్టి పెట్టి ఉన్నతంగా ఎదగాలని మంత్రి ఉద్బోదించారు. ఈ సందర్భంగా మంత్రి వెంట ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ముస్లిం మైనార్టీలకు కుట్టు మిషన్లు పంపిణీ చేయండి

ఎమ్మెల్యే జారేకు జాలాల్ వినతి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : అశ్వరావుపేట నియోజకవర్గంతో పాటు జిల్లాలో మంజూరైనా కుట్టుమిషన్లను పంపిణీ చేయ్యాలని సేవ్ కొత్తగూడెం, మున్సిపాలిటీ కన్వీనర్ జాలాల్ ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసి అభ్యర్థించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఈ నెల చివరి వరకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల పెండింగ్ పడిందని లబ్ధిదారులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ నెల చివరిలోపు అందించేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జలాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తక్షణమే కుట్టు మిషన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు.

పేదలైనా... సంపన్నులైనా...

నిత్యం సృష్టికర్తకు కృతజ్ఞులై జీవించాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం: దైవ విశ్వాసులు ఎవరైనా పేదరికంలో ఉన్నా లేక సంపన్నులైనప్పటికీ నిత్యం సృష్టికర్తకు కృతజ్ఞులై ఉండాలని జీవితంలో ప్రశాంతత ఉంటుందని జమాతే ఇస్లామి హింద్ రుద్రం పూర్, రామవరం శాఖ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు. మనిషి ఏ స్థితిలో ఉన్నప్పటికీ దేవుని పట్ల నిజమైన భయభక్తులు ఉంటేనే జీవితం సుఖమయం, ఆనందదాయకం అవుతుందన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవిపల్లి పంచాయతీలోని మస్జిద్ అక్సాలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కృతజ్ఞత అనేది మానవ సహజమైన గుణమన్నారు. మనిషి పంచే ప్రేమకు పశుపక్షాదులు సైతం జీవితాంతం రుణపడి మనతొ వుంటూ కృతజ్ఞత చాటుతాయన్నారు. కాని మనిషి మాత్రం దీనికి భిన్నంగా వ్యవహరించటమే దురదృష్ట కరమన్నారు. దేవుడు మనిషికి ఆలోచన శక్తి, ఆరోగ్యం, కళ్ళు, చెవులు, మాట్లాడే నాలుక అన్ని ప్రసాదించినప్పటికీ మంచి కన్నా చెడు వైపే మొగ్గు చూపుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ధార్మికులంతా మంచి వ్యక్తులుగా జీవిస్తూ సమాజంలో శాంతి, ప్రేమానురాగాలను వ్యాపింపజేయాలని అభ్యర్థించారు. దైవం మనకు ప్రసాదించిన వాటిని సమాజ హితం కోసం వినియోగించడమే నిజమైన ఆరాధన అని ఖురాన్‌లో అల్లాహ్ చెప్పిన విషయాన్నీ ప్రవక్త ముహమ్మద్ (సఅస) ప్రపంచానికి బోధించారని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఆ మస్జిద్ మౌలానా అన్వర్, అధ్యక్షుడు మౌలానా, రియాజ్, తస్విన్ అలీ మరికొందరు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుక్రవారం మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగాయి. యూత్ కాంగ్రెస్ నాయకులు చీకటి కార్తీక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, తూము చౌదరి, కోనేరు చిన్ని తో కలిసి కేక్ కట్ చేశారు. సీతారాములు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్న తమ నాయకుడు రేవంత్ రెడ్డి నూరేళ్ల ఆరోగ్యంతో క్షేమంగా ఉండాలని కోరారు. గత పదేళ్ల కాలం తుగ్లక్ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంత్ రావు, నాయకులు పెదబాబు, భాగం మోహన్ రావు, కౌన్సిలర్లు వై శ్రీనివాస్ రెడ్డి, తలుగు అనిల్, మాజీ ఏఎంసి చైర్మన్ భూక్య రాంబాబు, సుందర్ లాల్ కోరి, బాల పాసి, మహిళా నాయకులు వాణిరెడ్డి, హైమావతి, పద్మ, శాంతి, మహమ్మద్ గౌస్, రియాజ్, అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎమ్‌లపై పెరుగుతున్న వేధింపులు...

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఏఎన్ఎంలతో వెట్టి చాకిరి చేయించటమే కాకుండా రోజురోజుకు వేధింపులు పెరుగుతున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. జిల్లాలో గల అన్ని మండలాల్లోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్మెంట్‌లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్‌యంలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, ఎండీ యూసుఫ్‌ల సారథ్యంలో ఈ ఆందోళన నిర్వహించారు. తక్కువ వేతనాలతో వెట్టి చాకిరీ చేపిస్తున్నారని ఆరోపించారు. ప్రతి నెల ఎన్‌హెచ్‌ఎమ్ స్కీం లో పని చేస్తున్న రెండవ ఎఎన్ ఎమ్ల ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టిఏలు ఇవ్వటం లేదని అదనపు పనులు, ఓపి డ్యూటీ లు చేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం సి ఎల్స్ ఇవ్వాలని, 7 నెలల పెండింగ్ పిఆర్సి తక్షణమే ఇవ్వాలని, 8 నెలల పెండింగ్ యాక్సినేషన్ డబ్బులు కూడా ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నా వద్ద కు జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ వచ్చి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు సమస్యల వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘం నేతలు, బానోత్ ప్రియాంక, పార్వతి, బాల నాగమ్మ, పద్మజ,ఇందిర, అరుణ, సుమలత, రాములమ్మ, జ్యోతి, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

ఇల్లందు - విశాలాంధ్ర : అన్ని వర్గాల ప్రజలతో పాటు పేదల కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, హరిప్రియలకు ఏమాత్రం లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు ఘాటుగా విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి పేరుతో ప్రజానిధులను, ఇసుక అక్రమ రీచులు, రవాణాతో కోట్లాది రూపాయలు దోచుకున్న రేగా కాంతారావు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ లకు ప్రజల్లో వచ్చి మాట్లాడే అర్హత ఎక్కడ ఉందని ప్రశ్నించారు. అందుకే వీరిపై ఆగ్రహంతో ఉన్న ఇల్లందు, పినపాక నియోజకవర్గాల ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో భారీ తేడాతో ఓడించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజా వ్యతిరేకత పెరిగిందని వీరు మాట్లాడటం అపహస్యంగా ఉందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తుంటే, రాష్ట్ర ప్రజలు వాటిని అనుభవిస్తుంటే వీరి కళ్ళకు కనిపించకపోవడం బాధాకరమన్నారు. మిగులు బడ్జెట్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బిఆర్ఎస్ పార్టీ 10 ఏళ్లు రాక్షస పాలనతొ లక్షల కోట్ల అప్పుల్లో నెట్టేసి దివాళా తీయించిందన్నారు. బిఆర్ఎస్ హయంలో చేసిన విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చేస్తే ఆ పార్టీ నాయకులు కనమరుగవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్ఎం కిరణ్, జాఫర్, ఎట్టి హరికృష్ణ, సుదర్శన్ కోరి, భూక్య శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి పుట్టినరోజు వేడుక

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : దేశ చరిత్రలో ఏకకాలంలోనే రెండు లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని, కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల కమిటీ అధ్యక్షులు సి హెచ్. రఘు అన్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణభివృద్ది, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిధనసరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, సూచనమేరకు ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి కేక్ కటింగ్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి, కీలక పాత్ర పోషించిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని, కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో దోచుకొన లక్షల అవినీతి చూసి చలించి, ఆయన పై కొట్లాడిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎండి రియాజ్, మాజీ పిఎస్ సిఎస్ చైర్మన్ దేవులపల్లి విజయ్ కుమార్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కర్ని సత్యం, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఎం డి గౌస్ పాషా, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు చేల వినయ్ కుమార్ పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా పత్తి కొనుగోళ్ళు

విశాలాంధ్ర - కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని అప్పాయగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీప్రియ కోటక్ జిన్నింగ్ మిల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోలు ముమ్మరంగా జరుగుతున్నట్టు ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి నాణ్యత ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేసినట్లు తెలిపారు. అమ్మకానికి మొత్తం 45 వాహనాల రాగా 29 వాహనాల పత్తి కొనుగోలు చేశామని, మిగిలిన వాహనాల పత్తి సైతం నిబంధన ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. రైతుల సౌకర్యార్థం ఈ కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా పత్తి కొనుగోలు జరుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ సిబ్బంది రంజిత్, మున్నీర్, రవి సిసిఐ సిబ్బంది పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపైన్ డేస్ : కలెక్టర్

విశాలాంధ్ర - వనపర్తి : 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్ళు నిండే యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం - 2025లో భాగంగా, కొత్త ఓటర్లుగా నమోదు చేసుకునే వారికోసం, మార్పులు, అభ్యంతరాల కోసం నవంబర్ 9, 10 తేదీల్లో ప్రత్యేక క్యాంపైన్ డేస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపైన్ లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు తమ బూత్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటారని, కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునే వారు స్థానిక బూత్ లెవెల్ అధికారిని సంప్రదించి ఫారం-6 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబర్ 29న విడుదల చేసిన ఓటర్ ముసాయిదాలో అభ్యంతరాల కోసం ఫారం - 7, సవరణలకు ఫారం - 8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 28వ తేదీ వరకు దరఖాస్తూ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భారత్‌లో సేల్స్ ఫోర్స్ విస్తరణ

బెంగుళూరు: సేల్స్ ఫోర్స్ దాని మొదటి సిఆర్ఎంని ఏఐ టెక్నాలజీ సామర్థ్యాలతో సృష్టించింది. శుక్రవారంనాడు సేల్స్ ఫోర్స్ టవర్ బెంగుళూరుని ప్రకటించింది. అది ఇండియాలో దేశంలో దాని మొదట టవర్‌తో సంస్థ ఉనికిని విస్తరించింది. భారతదేశంలో మొట్టమొదటి సేల్స్‌ఫోర్స్ టవర్‌ను ప్రారంభించేందుకు బెంగళూరులోని బాగ్‌మనే టెక్‌పార్క్‌తో లీజు ఒప్పందంపై సంతకాలు చేసింది. సేల్స్ ఫోర్స్ ఇండియా కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌తో దాని రెగ్యులేటరీ ఫైలింగ్ ప్రకారం ఒక సంవత్సరంలో అనగా గత సంవత్సరం 31 మార్చ్ నుంచి ఇప్పటికీ 36శాతం నుంచి రూ.9116.3 కోట్ల ఎదుగుదలని చూసింది.సెటీస్ ఫోర్స్ ఇండియాలో దాని భౌతిక ఉనికిని పెట్టుబడిగా పెట్టడం బెంగుళూరులో ఒక కొత్త సేల్స్ ఫోర్స్ టవర్‌తో కొనసాగిస్తుంది. శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, చికాగో, లండన్, డబ్లిన్, సిడ్నీ, టోక్యో, అట్లాంటా, ఇండియానా పోలిస్‌తో సహా కీలకమార్కెట్లలో సేల్స్‌ఫోర్స్ చేసిన పది టవర్ పెట్టుబడులలో ఇది ఒకటి. బెంగుళూరులో సేల్స్ ఫోర్స్ టవర్ బగ్మనే రాజధాని అయిన మగదేవపూరలో ఉంటుంది.

అల్లు అర్జున్‌తో థమ్స్ అప్ ఉత్తేజకరమైన భాగస్వామ్యం

న్యూఢిల్లీ: థమ్స్ అప్, బోల్డ్ టూఫానీ స్పిరిట్‌కి పర్యాయపదంగా ఉన్న భారతదేశంలోని ప్రసిద్ధ స్వదేశీ బ్రాండ్ ఇటీవలే అల్లు అర్జున్ యొక్క విలక్షణమైన సిల్హౌట్‌ను కలిగి ఉన్న ఉత్తేజకరమైన టీజర్‌ను విడుదల చేసింది. ఈ సాహసోపేతమైన చర్యతో కంపెనీ చాలా ఉత్సాహాన్ని సృష్టించింది మరియు అభిమానులు తదుపరి ఏమి జరుగుతుందో చూడడానికి ఉత్సాహంగా ఉన్నారు. ఈ టీజర్ విడుదల పుష్ప 2 కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్‌ను ప్రదర్శించిన తర్వాత,, థమ్స్ అప్ చిత్రం హై-ఎనర్జీ మొమెంటంతో పాటు పోషించబోయే పాత్ర చుట్టూ ఉత్సుకతను రేకెత్తిస్తుంది. అల్లు అర్జున్ యొక్క అపారమైన అభిమానుల ఫాలోయింగ్‌ను ఆకర్షించడంతో పాటు, సాహసం, నిర్భయతను పంచుకునే కస్టమర్‌లతో థమ్స్ అప్ కనెక్ట్ అవ్వడానికి టీజర్ సహాయపడుతుంది. థమ్స్ అప్ ప్రచారాలు ఖచ్చితంగా సమయానుకూలమైన థ్రిల్‌ను అందిస్తాయని కోకా-కోలా ఇండియా, నైరుతి ఆసియా స్పార్క్లింగ్ ఫ్లేవర్స్ కేటగిరీ హెడ్ సుమేలీ ఛటర్జీ అన్నారు.

హల్దీరామ్ భుజియావాలాలో పాంటోమత్ భారత్ వాల్యూ ఫండ్ పెట్టుబడి

ముంబై: కోల్‌కతాకు చెందిన హల్దీరామ్ భుజివాలా లిమిటెడ్ తన ప్రైవేట్ ప్లేస్‌మెంట్ రౌండ్‌ను విజయవంతంగా ముగించినట్లు ప్రకటించింది, పాంటోమత్ భారత్ వాల్యూ ఫండ్ (బివిఎఫ్) మైనారిటీ వాటా కోసం కంపెనీలో రూ.2350 మిలియన్ పెట్టుబడి పెట్టింది. హల్దీరామ్ భుజివాలా లిమిటెడ్ తన ఉత్పత్తులను 'ప్రభుజీ' బ్రాండ్ క్రింద విక్రయిస్తోంది. హల్దీరామ్ భుజియావాలా లిమిటెడ్ స్నాక్స్ మరియు రుచికరమైన పదార్థాల పరిశ్రమలో 6 దశాబ్దాలకు పైగా శక్తివంతమైన వారసత్వాన్ని కలిగి ఉంది. కంపెనీ తన ఉత్పత్తులను 'ప్రభుజీ' బ్రాండ్ పేరుతో 100కిపైగా ఎస్‌కెయులతో అందిస్తోంది. బ్రాండ్ అంబాసిడర్లుగా బాలీవుడ్ దిగ్గజ నటులు షారుక్ ఖాన్, రష్మికమందన్న ఉన్నారు. హల్దీరామ్ భుజియావాలా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, గత 60కిపైగా సంవత్సరాలలో, రుచికరమైన స్నాక్స్, స్వీట్‌లను అందించడం ద్వారా నమ్మకమైన కస్టమర్ బేస్‌ను పెంచుకున్నామని అన్నారు.

స్టాండర్డ్ క్యాపిటల్ మార్కెట్స్ ఎన్డీసీల కేటాయింపు

విశాలాంధ్ర-హైదరాబాద్: స్టాండర్డ్ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ రూ. ముఖ విలువ కలిగిన 7000 అన్‌రేటెడ్, అన్‌లిస్టెడ్, సెక్యూర్డ్ ఎన్‌సిడిల కేటాయింపును ఆమోదించినట్లు ప్రకటించిందని సంస్థ ప్రతినిధుల ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల, ప్రైవేట్ ప్లేస్‌మెంట్ ప్రాతిపదికన ఒకటి లేదా అంతకంటే ఎక్కువ విడతల్లో 50,000 సెక్యూర్డ్, అన్‌లిస్టెడ్, అన్‌రేటెడ్, రీడీమబుల్ ఎన్‌సిడిలను జారీ చేయడానికి బోర్డు ఆమోదించిందన్నారు. ఇటీవల, కంపెనీ పాఠశాలలు, విద్యాసంస్థలు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్‌లను పొందేందుకు జీరో-కాస్ట్ ఈఎంఐ పథకాన్ని ప్రకటించిందన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు సుసంపన్నమైన, సాంకేతికతతో నడిచే అభ్యాస అనుభవాన్ని అందిస్తూ, బోధన నిర్వహించే విధానాన్ని విప్లవాత్మకంగా మార్చేందుకు ఈ చొరవ సెట్ చేయబడిందన్నారు. అదనంగా, సాంప్రదాయ చాక్‌బోర్డ్‌లకు దూరంగా మారడం వల్ల సుద్ద ధూళి వల్ల కలిగే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయనీ, విద్యార్థులు ఉపాధ్యాయులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టిస్తుందన్నారు.

సెల్లెకార్ గాడ్జెట్స్ స్మార్ట్ టీవీల బ్రాండ్ అంబాసిడర్‌గా కరీనా కపూర్

విశాలాంధ్ర-హైదరాబాద్: సెల్లెకార్ గాడ్జెట్స్ లిమిటెడ్, తన స్మార్ట్ టీవీకి బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ సూపర్ స్టార్ కరీనా కపూర్ ఖాన్‌ను ప్రకటించడం ఆనందంగా ఉందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సహకారం సెల్లెకోర్ విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తుందన్నారు. కరీనా ఐకానిక్ అప్పీల్, స్టైలిష్ పర్సనాలిటీని ఉపయోగించడం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులతో బ్రాండ్ అనుబంధాన్ని టీవీ మార్కెట్లో దాని ఉనికిని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆమె డైనమిక్ ఉనికి, సాపేక్ష ఆకర్షణ ఆమెను సెల్లెకోర్ స్మార్ట్ టీవీ లైనప్‌కు ప్రాతినిధ్యం వహించడానికి ఆదర్శవంతమైన ఎంపికగా చేసిందన్నారు. అధిక-నాణ్యత గృహ వినోదం కోసం కంపెనీని గో-టు బ్రాండ్‌గా ఉంచిందన్నారు. కరీనా కపూర్ ఖాన్ అసోసియేషన్‌తో, సెల్లెకోర్ తన స్మార్ట్ టీవీ శ్రేణిని నాణ్యమైన గృహ వినోదం కోసం అగ్ర ఎంపికగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

10 నుంచి జీ తెలుగు సింగింగ్ షో సరిగమప సీజన్ 16

విశాలాంధ్ర-వరంగల్: తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందనీ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్‌కు సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్‌తో ఈ సీజన్ ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రియులకు మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ తమ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్‌గా మారుతున్నారన్నారు. ఔత్సాహిక గాయకులు తదుపరి సింగింగ్ సెన్సేషన్ టైటిల్ కోసం పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వీకెండ్‌ను మరింత స్పెషల్ చేస్తోందన్నారు. ఆదివారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని మరింత పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు, తప్పక చూడాలన్నారు.

బయో బ్లెండెడ్ డీజిల్ పై అవగాహన సదస్సు

ఇల్లందు - విశాలాంధ్ర : కాలుష్య నివారణకు ఇండియన్ ఆయిల్ కొత్తగా రూపొందించిన బయో బ్లెండెడ్ డీజిల్ పై అవగాహన సదస్సు జరిగింది. ఆ కంపెనీ వరంగల్ డివిజన్ మేనేజర్ సురేష్, కొత్తగూడెం సేల్స్ మేనేజర్ ప్రసాద్ లు శుక్రవారం పట్టణంలోని స్థానిక ఇండియన్ ఆయిల్ బంకు ప్రాంగణంలో యజమాని సతీష్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ ఆయిల్ ప్రయోజనాలను వాహనదారులకు, ఆటో డ్రైవర్లకు వివరించారు. మొట్టమొదటిసారిగా ప్రభుత్వ, సంబంధిత శాఖ అధికారుల అనుమతితో కాలుష్యాన్ని నివారించేందుకు కేవలం ఇండియన్ ఆయిల్ మాత్రమే 7 శాతం బయోతో డీజిల్ ను తయారు చేసిందన్నారు. కలర్‌లో స్వల్ప మార్పు ఉంటుందని వివరించారు. దీనికి మైలేజ్ రాదని దుష్ప్రచారం చేస్తున్నారని, ఆ ఆరోపణలు ఎంత మాత్రం వాస్తవం కాదన్నారు. నూటికి నూరు శాతం ఇండియన్ ఆయిల్ వాహనదారుల ప్రయోజనాల కోసం డీజిల్, పెట్రోల్ తయారు చేస్తుందని వారు వివరించారు.

సంపాదకీయం

ఎ.ఎం.యు. మైనారిటీ సంస్థే అయినా...

అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం (ఎ.ఎం.యు.)మైనారిటీ సంస్థ కాదు అన్న ముద్ర ఏడుగురు సభ్యులుగల శుక్రవారం నాటి సుప్రీం కోర్టు బెంచి నిర్ణయంతో చెరిగిపోయింది. 1967 నుంచి అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థ కాదు అన్న అభిప్రాయం ఇప్పటిదాకా కొనసాగుతూ ఉండింది. అప్పుడు అయిదుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచి అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థ కాదు అని తీర్పు చెప్పింది. 57 ఏళ్ల కిందటి ఈ తీర్పును ఏడుగురు సభ్యులుగల సుప్రీంకోర్టు బెంచి తిరగతోడింది. 1967 నాటి కేసును అజీజ్ బాషా కేసుగా వ్యవహరిస్తారు. ఒక విద్యా సంస్థకు మైనారిటీ స్వరూపం ఉందో లేదో తేల్చడానికి మన న్యాయవ్యవస్థకు 57 ఏళ్లు పట్టింది. శుక్రవారం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైంది అనుకోవచ్చు. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచి అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థేనని అభిప్రాయపడినప్పటికి వాస్తవాలను పరిశీలించి నికరమైన నిర్ధారణకు రావడానికి ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన మరో బెంచి ఏర్పాటుచేసింది. ఒక రాజ్యాంగ పీఠం వాస్తవాలను నిర్ధారించవలసి వచ్చినప్పుడు చిన్న బెంచికి ఆ బాధ్యత అప్పగించడం రివాజే. రాజ్యాంగ పీఠం సాధారణంగా సైద్ధాంతిక అంశాలపై సలహా ఇస్తుంది. శుక్రవారం నాటి తీర్పు తరవాత అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, విశ్వవిద్యాలయ యాజమాన్యంవారు అమితానందం వ్యక్తం చేశారు. అయితే ఈ ఆనందం సంపూర్ణమైంది కాదు. ఎందుకంటే ఏడుగురు న్యాయమూర్తుల అభిప్రాయాన్ని ముగ్గురు న్యాయమూర్తుల బెంచి వాస్తవాలను పరిశీలించి వెలువరించాల్సి ఉంది. ఏడుగురు న్యాయమూర్తులు అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థే అని అభిప్రాయపడింది తప్ప అంతిమ నిర్ణయం ఇంకా తెలియజేయలేదు. ఆ బాధ్యతను ముగ్గురు న్యాయమూర్తుల బెంచికి అప్పగించారు. ఏయే ప్రమాణాల ఆధారంగా ఒక సంస్థను మైనారిటీ సంస్థగా పరిగణించాలో రాజ్యాంగ పీఠం ముగ్గురు న్యాయమూర్తుల బెంచికి కొన్ని మార్గదర్శక సూత్రాలు కూడా నిర్దేశించింది. ఈ మార్గదర్శక సూత్రాల ఆధారంగానే ఎ.ఎం.యు. మైనారిటీ సంస్థ అవునో కాదో తేలుతుంది. 1967 నాటి తీర్పు సారాంశం ఏమిటంటే చట్టం ప్రకారం ఏ సంస్థా మైనారిటీ సంస్థ పరిగణనలోకి రాదు. ఈ విశ్వవిద్యాలయం ఆనవాళ్లు 1875 నుంచి కనిపిస్తాయి. ఎ.ఎం.యు. 2019 నుంచి 2023 మధ్య ప్రభుత్వం నుంచి రూ.5,000 కోట్ల నిధులు స్వీకరించింది లేదు కనక ఆ సంస్థకు మైనారిటీ సంస్థగా చెప్పుకునే అర్హత లేదు అని ఈ కేసులో ఫిబ్రవరిలో వాదనలు జరిగినప్పుడు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. అంటే కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం ప్రకారం ఎ. ఎం.యు. మైనార్టీ సంస్థ కాదనే. ఏడుగురు న్యాయమూర్తులు వ్యక్తం చేసిన అభిప్రాయం ప్రకారం చట్టరీత్యా ఏర్పడినందువల్ల ఏ సంస్థ అయినా మైనార్టీ సంస్థ అన్న స్థాయి కోల్పోదు. ఈ విశ్వవిద్యాలయాన్ని ఎవరు స్థాపించారు. వారి ఆశయం ఏమిటి అన్న విషయాలను ముగ్గురు న్యాయమూర్తులు పరిశీలించాలని కూడా ఏడుగురు న్యాయమూర్తులు పీఠం పేర్కొంది. ఎ.ఎం.యు. నెలకొల్పడానికి భూమి ఎవరు ఇచ్చారు, విరాళాలు ఎవరిచ్చారు అన్న వాస్తవాలను కూడా ముగ్గురు న్యాయమూర్తుల బెంచి అన్వేషించవలసి ఉంటుంది. ఈ పరిశీలనలో మైనారిటీ వర్గాలవారు ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేశారు అని తేలితే అప్పుడు అది రాజ్యాంగంలోని 30వ అధికరణం ప్రకారం నికరంగా మైనారిటీ సంస్థే అవుతుంది. ఎ.ఎం.యు. నెలకొల్పాలన్న ఆలోచన మౌలికంగా సర్ సయ్యద్ అహ్మద్ మదిలో మెదిలిందే. అనేక మంది ముస్లింలు దీన్ని నెలకొల్పడానికి కృషి చేశారు. మొట్టమొదట మహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల అనేవారు. బ్రిటిష్ పాలనలో 1920లో ఇది అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయంగా మారింది. బ్రిటిష్ చట్టం ద్వారా ఈ వ్యవస్థ ఏర్పడినంత మాత్రాన దీనిని మైనారిటీ సంస్థ కాదని చెప్పడానికి వీలులేదు. ప్రభుత్వం ఒక విశ్వవిద్యాలయాన్ని నియంత్రించినా, నిధులు సమకూర్చినా దాని మైనారిటీ స్వరూపం మారదు. కేవలం మైనారిటీ మతాలకు చెందిన వారికోసం నెలకొల్పితేనే అది మైనార్టీ సంస్థ అవుతుందని కూడా లేదు అని న్యాయమూర్తులు ప్రకటించారు.

ఎ.ఎం.యు. మైనారిటీ సంస్థేనని శుక్రవారం సుప్రీంకోర్టు ప్రకటించినప్పటికీ అది ముక్త కంఠంతో చెప్పిన అభిప్రాయం ఏమీ కాదు. నలుగురు న్యాయమూర్తులు ఒక అభిప్రాయం వ్యక్తంచేస్తే మరో ముగ్గురు న్యాయమూర్తులు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌తో పాటు కాబోయే ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, జె.బి.పార్దీవాలా, మనోజ్ మిశ్రా ఒకే అభిప్రాయం వెల్లడించారు. న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపాంకర్ దత్తా, ఎస్.సి.శర్మ భిన్నాభిప్రాయం తెలియజేశారు. ప్రసిద్ధి చెందిన ఈ విశ్వవిద్యాలయం మైనారిటీ సంస్థ అవునా కాదా అన్న విషయంలో అనేక ఎగుడుదిగుళ్లు చూసింది. 1920 నాటి చట్టానికి 1951లో ఒక సవరణ తీసుకొచ్చి ఈ విశ్వవిద్యాలయంలో తప్పనిసరిగా మతపరమైన అంశాలు మాత్రమే చేర్చనక్కర్లేదు అని మార్చారు. 1981లో రెండవ సవరణ ప్రకారం 1951 నాటి సవరణకు ముందున్న పరిస్థితికి వెళ్లవలసిన అగత్యం కలిగింది. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన బెంచి శుక్రవారం ఎ.ఎం.యు. మైనారిటీ సంస్థే అని అభిప్రాయపడిందే తప్ప నికరంగా తేల్చే బాధ్యతను ముగ్గురు న్యాయమూర్తుల బెంచికి అప్పగించి సగం న్యాయమే చేసింది. ముస్లింలే ఎ.ఎం.యు. ఏర్పాటు చేశారనడానికి అనేక దాఖలాలు, పత్రాలు ఉన్నాయి. ఎ.ఎం.యు.లో ఇంగ్లీషు కూడా బోధిస్తారు. అక్కడ చదువుకున్న వారు ఉన్నతాధికారులయ్యారు. విద్యావేత్తలయ్యారు. మొదటి నుంచి అది సెక్యులర్ భావజాలాన్నే ప్రోది చేసింది. ఎ.ఎం.యు. దగ్గర అది మైనారిటీ సంస్థేనని, దాన్ని ముస్లింలే ఏర్పాటు చేశారని చెప్పడానికి మొదటి సమావేశం నుంచి మొదలుకుని, వివిధ ఉపన్యాసాల దాకా అనేక రుజువులు, పత్రాలు ఉన్నాయి. ఏడుగురు న్యాయమూర్తులు శుక్రవారం వ్యక్తం చేసిన అభిప్రాయం కేవలం ఎ.ఎం.యు.కే కాదు దేశంలోని అనేక సంస్థలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇది కేంద్రియ విశ్వవిద్యాలయం కనక అది మైనారిటీ సంస్థ కావడానికి వీలు లేదని మోదీ ప్రభుత్వం వాదిస్తోంది. అయితే జాతీయ సంస్థ అయినంత మాత్రాన అది మైనారిటీ సంస్థ కాకుండా పోదని ఏడుగురు న్యాయమూర్తుల పీఠం శుక్రవారం తేల్చి చెప్పింది. 1981 నాటి చట్ట సవరణను ప్రభుత్వం అంగీకరించదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అనడం విచిత్రం. 30వ అధికరణం ప్రకారం మైనారిటీ వర్గాల వారు తమ సంస్థలను ఏర్పాటు చేసుకునే అవకాశమే కాదు హక్కు ఉంది. ఏడుగురు న్యాయమూర్తుల పీఠం జారీ చేసిన మార్గనిర్దేశకాలు ఏది మైనారిటీ సంస్థ అనే విషయంలో చాలా స్పష్టమైన భావాలు వ్యక్తం చేస్తున్నాయి. అందువల్ల ముగ్గురు న్యాయమూర్తుల బెంచికి ఈ మార్గదర్శకాల నుంచి పక్కకు తొలిగే అవకాశం కానీ దశాబ్దాల పాటు తీర్పు వెలువరించకుండా ఉండే అవకాశం కానీ లేదు.

అబద్ధాల ప్రచారానికి మొనగాళ్లు

రవీంద్రనాథ్ సిన్హా

గత దశాబ్ద కాలంగా కాషాయ పాలకులు మోసపు ప్రచారానికి మొనగాళ్లు. జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రంలో గిరిజనులు గణనీయ సంఖ్యలో ఉన్నారు. వీరికి బీజేపీ పట్ల విశ్వాసం లేకపోవడంతో గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలో బీజేపీకి దూరమయ్యారు. జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తున్నది. అయితే ఈ ఎన్నికల్లో ఎలాగైనా జార్ఖండ్‌లో విజయంసాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని బీజేపీ మోసపు ప్రచారానికి పూనుకున్నది. 81 స్థానాలున్న అసెంబ్లీకి ఇండియాబ్లాక్‌లో భాగస్వాములుగాఉన్న పార్టీల సీట్ల పంపిణీలో జాప్యం జరిగింది. ఈలోపే బీజేపీ నాయకులు, ప్రధాని నరేంద్ర మోదీ తప్పుడు విషయాలను ప్రచారంచేస్తూ, ఓట్ల కోసం ప్రజలను ఇండియా బ్లాక్ మోసపుచ్చుతోందని ప్రచారం చేస్తోంది. రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటిదశ నవంబరు13న పోలింగ్ జరగనుంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా జార్ఖండ్‌లో చొరబడుతున్నారని, అందువల్లనే సంతాల్ పరగణా జోన్‌లో ప్రజలు, ఓటర్లు ఎక్కువగా ఉన్నారని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. జార్ఖండ్‌కు అంతర్జాతీయ సరిహద్దులేకపోయినా ఉందని, సరిహద్దు మీదుగా రాష్ట్రంలోకి వలసదారులు చొరబడుతున్నారని మోదీతో సహా కాషాయదళాలు ప్రచారం సాగిస్తున్నాయి. ఏదోవిధంగా గిరిజనులను ఆకట్టుకునేందుకు వారికి తప్పుడు అంశాలను వివరిస్తున్నారు. బీజేపీ విచ్ఛిన్నకర విధానాలు అనుసరించడం మొదటినుంచి ఉంది. బీజేపీ తప్పుదారి పట్టించే ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు సామాజిక కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. బీజేపీ ముస్లింలను లక్ష్యంగా ప్రచారం చేస్తోందని రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు. జార్ఖండ్ జనాభాలో 15శాతం ముస్లింలు ఉన్నారని పరోక్షంగా ప్రచారం సాగిస్తున్నారు.

జార్ఖండ్‌కు అంతర్జాతీయ సరిహద్దులేకపో యిందని కుట్రపన్ని గిరిజనులను తప్పుదారి పట్టించడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోంది. అక్రమ చొరబాట్లున్నాయని అమిత్ షా, శివరాజ్‌సింగ్ చౌహాన్, హిమంత్ బిశ్వశర్మ, నిశికాంత్ దూబే, తాము అస్సాం, పశ్చిమబెంగాల్ కాదు, జార్ఖండ్‌లో ప్రచారం చేస్తున్నానని మరిచిపోయి కొంతమంది రాజకీయ నాయకులను, పరిశీలకులను ఆశ్చర్య చకితులను చేస్తున్నారు. సోషల్ కార్యకర్తలతో కూడిన దాదాపు 30సంఘాలు లోక్‌తంత్ర బచావ్ అభియాన్(ఎల్‌బిఎ)లాంటి పేర్లతో పనిచేస్తున్నాయి. కొంతకాలం క్రితం ఈ కార్యకర్తలు అధ్యయనంచేసి బీజేపీ తప్పుడు ప్రచారానికి ఆధారమేలేదని వాస్తవ పరిస్థితిని నిర్ధారించారు.

ముఖ్యంగా గిరిజనులను ఆకట్టుకునేందుకే బీజేపీ నేతలు మోసపు ఎత్తుగడలను పన్నుతున్నారు. 29 అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుపునకు గిరిజనులు దోహదం చేస్తారు. 2019 అసెంబ్లీ ఎన్నికలు, ఈ సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అతి తక్కువగా ఓట్లు, సీట్లు పొందింది. యుసిసి ఉమ్మడి పౌరస్మృతిని గిరిజనులకు వర్తింపచేయబోమని హోం మంత్రి అమిత్ షా ప్రచారం సాగిస్తున్నారు. గిరిజనుల ఓట్లకోసం ఈ ప్రచారం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉమ్మడి చట్టాలను రూపొందించి అమలు చేస్తామని చెప్పిన మాటలను గిరిజనులు మభ్యపెడుతున్నారు. ఈ విషయాలను గిరిజనులు కూడా తెలుసుకోగలుగుతున్నారు. యుసిసి ఇప్పటికే కోర్టులో ఉండగానే జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుదారి పట్టించేందుకు వెనుకాడటంలేదు.

గిరిజనులను ఆకట్టుకునేందుకే బీజేపీ నేతలు మోసపు ఎత్తుగడలను పన్నుతున్నారు. 29 అసెంబ్లీ నియోజకవర్గాలలో గెలుపునకు గిరిజనులు దోహదం చేస్తారు. 2019 అసెంబ్లీ ఎన్నికలు, ఈ సంవత్సరం లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అతి తక్కువగా ఓట్లు, సీట్లు పొందింది. యుసిసి ఉమ్మడి పౌరస్మృతిని గిరిజనులకు వర్తింపచేయబోమని హోం మంత్రి అమిత్ షా ప్రచారం సాగిస్తున్నారు. గిరిజనుల ఓట్లకోసం ఈ ప్రచారం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉమ్మడి చట్టాలను రూపొందించి అమలు చేస్తామని చెప్పిన మాటలను గిరిజనులు మభ్యపెడుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి అధ్యయనం చేస్తున్నారు. జార్ఖండ్ ప్రభుత్వం కూడా కోర్టులో ఈ విషయాన్ని సవాలు చేసింది. మరో ముఖ్యమైన అంశం ఉంది. జార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. సంతాల్‌జోన్‌లో అక్రమ వలసలు జరుగుతున్నాయని నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సమాచారం సుప్రీంకోర్టుకు అందించలేదు.

కొద్ది వారాలక్రితం 'ప్రజా ప్రణాళికను' ఎల్‌బీఏ విడుదల చేసింది. ఇతర ప్రాంతాలకు తరలించడం, పునరావాసం కమిషన్ ఏర్పాటు చేయాలని ఎల్‌బిఏ డిమాండ్ చేసింది. కేంద్ర కొన్ని ప్రాజెక్టుల నిర్మాణానికి, పునరావాసాల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ ఇవ్వలేదు. 2019లో జార్ఖండ్ భూసేకరణ చట్టం చేసింది. ఎల్‌బీఏ ప్రణాళికలో నూతన ప్రభుత్వం రాష్ట్రంలో బలహీనంగా ఉన్న విద్యను ఒక సమయంలో మెరుగుపరచాలని కోరింది. 1966 పంచాయతీల చట్టం ప్రకారం నియమనిబంధనలు రూపొందించాలని ఎల్‌బిఏ కోరింది. గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ఉదాహరణకు కొల్హాన్, దామిని ఏరియాల్లో ఆరవ షెడ్యూలు ఏర్పాటు చేయాలని ఎల్‌బిఏకోరింది. అక్రమ వలసల సమస్యపై బీజేపీ ఒత్తిడి చేసినప్పుడు, సీపీఐఎంఎల్(లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర భట్టాచార్య మాట్లాడుతూ, ఇప్పటికే చత్తీస్‌ఘర్, ఒడిశా నియంత్రణలో ఉందని అన్నారు. ఇప్పుడు బీజేపీ కన్ను జార్ఖండ్‌పై ఉందన్నారు. ఈ మూడు రాష్ట్రాలలో సంపద్వంతమైన ఖనిజ వనరులున్నాయని భట్టాచార్య వెల్లడించారు. కార్పొరేట్లకు ఖనిజవనరుల గనులను అప్పగించేందుకు మార్గాలకోసం కేంద్ర ప్రభుత్వం తంటాలు పడుతుందని చెప్పారు. బీజేపీ మతోన్మాద విషయాలను ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తోందని భట్టాచార్య అన్నారు. ఇదే జరిగితే మణిపూర్‌లో జరిగిన పరిస్థితి తలెత్తవచ్చునన్నారు. వెనకబడిన రాష్ట్రంలో జెఎంఎం నాయకత్వంలోని సంఘటన తప్పనిసరిగా గెలవవలసిఉందని భట్టాచార్య అన్నారు. ఐపీఏఎల్‌బిఏలు ఫాసిస్టు వ్యతిరేక, సంఘ్‌పరివార్ వ్యతిరేక సంస్థలని సోషల్ పాలసీ పరిశోధకులు సిరాజ్ దత్తా అన్నారు. అసెంబ్లీలో 81 సీట్లుండగా, 44సీట్లు జనరల్ కేటగిరికి చెందినవి. కాగా 28 ఎస్‌టీలకు రిజర్వు చేశారు. రాష్ట్రంలో 2.66కోట్లు ఓటర్లుండగా, మొదటిసారి ఓటు వేసేవారు 11.84 లక్షలమంది ఉన్నారు.

ఖనిజాలు కాదు... బతుకుల్ని తవ్వేస్తున్నారు

అవును... తవ్వేస్తున్నారు.... బతుకుల్ని తవ్వేస్తున్నారు... కుటుంబాలని.. పిల్లా పాపా, ముసలి ముతక అందరిని తరిమేసి ఎవర్నీ లేకుండా చేసి గ్రామాలని తవ్వేస్తున్నారు. ఎవరిని అడగాలి. ఏమని అడగాలి. శ్రీ రాముడి ధనస్సు కప్పపై పడి నలిగిపోతూంటే చివరి క్షణంలో చూసిన ఆ శ్రీరాముడు "అయ్యో... చెప్పవే. నే నలిగిపోతున్నానని" అన్నాట్ట కప్పతో. దానికి ఆ కప్ప "ఏలిన వాడా... నన్నేలువాడా. నన్ను కాపాడేవాడా... నాకు ఏ కష్టం వచ్చినా నీకే చెప్పుకునే దాన్ని. అలాంటి నువ్వే నా జీవితం మీద ధనస్సు పెట్టి కష్ట పెడితే.. ఇంకెవరికి చెప్పుకోనయ్యా " అందట. చిత్రం ఏమిటంటే ఏలికలు శ్రీ రామభక్తులు... వారి అధికార ధనస్సు పడింది రాయలసీమలోని కప్పట్రాళ్ల గ్రామం. త్రేతాయుగంలోనే కాదు కలియుగంలోనూ కప్పల్లాంటి బతుకులు సామాన్యులవే కావడం విషాదం. ఈ కప్పట్రాళ్లే కాదు... కర్నూలు జిల్లాలోని కోటకొండ, జిల్లెడుబుడకల, చల్లెలుచెలిమి, బేతపల్లె, ఓబులాపురం, మదాపురానికి మరికొన్ని కలిపిన ఆ గ్రామాలకు చెందిన వారి పరిస్థితి ఇప్పుడు కప్పల్లాగే ఉంది. కాకపోతే ఇది విధ్వంసానికి బహువచనంలా ఉంది. కొందరిని నమ్ముకుని... వారినే ఎన్నుకుని.. ఏలికలుగా చేసి సింహాసనం మీద కూర్చో పెడితే వాళ్లే బతుకుల్ని కూల్చేస్తూంటే ఇక ఎవరికీ చెప్పుకుంటాం. ఏమని వాపోతాం.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

కొన్నాళ్ల క్రితం వరకూ నిరసన ఓ ప్రజాస్వామ్య హక్కు...
కొన్నాళ్ల క్రితం వరకూ ధర్నా ఓ ప్రజాస్వామ్య ఆయుధం...
కొన్నాళ్ల క్రితం వరకూ ధర్మం కోసం నిలబడడం ఓ ప్రజాస్వామ్య ఆలంబన...
ఇప్పుడవన్నీ ఏమైపోతున్నాయి...
ఇప్పుడవన్నీ ఏ కానరాని కారడవులకు పోయాయి.
ఇప్పుడవన్నీ ఎవరి సొత్తుగా మారిపోతున్నాయి...

యురేనియం... నిరుపేదల భూముల్లో దాక్కునే భూతం. యురేనియం... ప్రజల ధన, మాన, ప్రాణాలను హరించే రక్కసి. తవ్వకాలంటే భూమి మీద గునపం వేయడమే కాదు... తవ్వకాలంటే బుల్‌డోజర్లతో భూతల్లి గర్భాన్ని చీల్చడమే కాదు.

తవ్వకాలంటే పసి పాపల నవ్వుల్ని చిదిమేయడం. తవ్వకాలంటే యువతరానికి భవిష్యత్ లేకుండా చేయడం. తవ్వకాలంటే వృద్ధాప్యానికి అంతిమ గీతం పాడడం.

యురేనియం అంటే రష్యాలో చెర్నోబిల్‌లో జరిగిన మారణహోమం గుర్తు రావడం లేదా.. యురేనియం అంటే కాళ్లు, చేతులు వంకర్లు పోయిన శరీరాలు గుర్తుకు రావడం లేదా... తెలుగు రాష్ట్రాల్లోనే ఫ్లోరైడ్‌తో కళ్ల ముందే నేలపై పాకుతున్న యువతరపు వృద్ధాప్యాన్ని చూడడం లేదా... అక్కడ కనిపిస్తున్న విషాదాన్ని రోజుకింత అనుభవిస్తూనే ఉన్నాం కదా... మళ్లీ సరికొత్త వినాశాలని తలకెత్తుకోవడం ఎందుకు. అణు విద్యుత్ కోసమో... అణ్వాయుధాల కోసమో.. అంతరిక్ష పరిశోధనల కోసమో... భూమిని కుళ్లబొడిచి, బతుకులని ఆగం చేసి మనుషులు లేని లోకాన్ని ఎలా పాలించుకుంటారు.

పువ్వులు, చేలు, చెలకలు, నదులు, చెరువులు, కాలువలు, మొలకలు, మానులు, మనుషులు ఇది కదా లోకమంటే.

పర్యావరణ కాలుష్యం, గాలి, నీరు, నేల కలుషితం, క్యాన్సర్ వంటి ప్రమాదకర రోగాలు... ఇది కాదు కదా జీవించడమంటే. ఇలాంటి దేశాన్ని వాంఛించడం, ఇదే అభివృద్ధి అంటూ చిలుక పలుకులు పలకడం ఎంత వినాశనమో గ్రహించాలి కదా... అంబానీ, ఆదానీలు మాత్రమే కాదు కదా దేశమంటే. ఆ పెట్టుబడిదారులే కాదు కదా దేశ జనాభా అంటే. గ్రామాలే కదా దేశానికి పట్టుకొమ్మలని చదివాం. విన్నాం. మరి అలాంటి గ్రామాలు లేకుండా చేయడం, దాన్ని దేశాభివృద్ధిగా చూపించాలనుకోవడం అన్యాయం కదా.

తెలతెలవారుతుండగా భుజాన నాగలితో ఓ రెండు జొన్న రొట్టెలతో చెనక్కాయ పప్పు ఊరిబిండి నంజుకు తిని పొలాలకు వెళ్లే సీమ రైతులకు ఆ జొన్నరొట్టె ముక్కల్లో చిటికెడు యురేనియం కలుపుతామనడం భావ్యమేనా...!? ఆ యురేనియం వెండి రంగులో మెరిసిపోతుంది కదా అని బంగారంలాంటి పొలాలను వదులుకోమనడం ఏలికలకు వాంఛనీయమైనా...!?

మహాప్రభో... సీమ బతుకులకు సరికొత్త మెరుగులు వద్దు..

సీమ జీవితాలకు విసిరేసిన పలావు ప్యాకెట్లు వద్దు. వారికి వారి ఉగ్గాని లేకుండా చేయకండి. వారి వాటా నీళ్లు వారికివ్వండి. శతాబ్దాలుగా ఆకాశం మోసం చేస్తున్నా ఎండ తగలకుండా కుడిచేతిని ముఖానికి అడ్డం పెట్టుకుని నాలుగు చినుకుల కోసం ఆకాశంవైపు ఆశగా చూస్తూనే ఉన్నారు...ఇప్పుడు కొత్తగా ఈ యురేనియం ఖనిజం కోసం ఆ బతుకుల్ని ఖండఖండాలుగా చేయద్దు. వారికి సరికొత్త రోగాలనిచ్చి మందు డబ్బాలతో దండలు అల్లకండి. రతనాల సీమను రాళ్లసీమగా మిగిల్చిన కొందరి అత్యాశ ఇంకా వెంటాడుతోంది. ఇప్పుడు కొత్తగా మా బతుకులు బాగు చేస్తామంటూ అసలు బతుకులే లేకుండా చేయకండి. మా జొన్న రొట్టెని లాక్కోకండి. మా ఉగ్గానిని మాకు దూరం చేయకండి. మహాప్రభో... మమ్మల్ని మాలా బతకనీయండి.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

గుదిబండగా మారిన ఆర్థిక పరిస్థితి

గుర్రం రాంమోహన్ రెడ్డి

ఆర్థిక ఇక్కట్లల్లో తెలంగాణ ప్రభుత్వం కొట్టు మిట్టాడుతుంది. అంతంత మాత్రమే ఆదాయం వస్తుండటంతో ఆర్థిక పరిస్థితి గుదిబండగా మారింది. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ, నిర్వాహణ భారాన్ని, ఖర్చులను తగ్గించుకొని రూపాయి రూపాయి పోగేసి పట్టుకొని ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి మాత్రం మెరుగుపడే పరిస్థితి కనిపించడంలేదు. నెల నెలకు కనీసంగా 25 వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తే ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించే అవకాశముంది. ప్రస్తుతం నెల నెల సమకూరుతున్న ఆదాయానికి, ఖర్చుకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఆదాయంకోసం ప్రభుత్వం ఎన్ని మార్గాలను అన్వేషించినప్పటికీ ఫలితాలు కనిపించని పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం నెల నెల 18 వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. ఆదాయం మాట ఎలా వున్న ఖర్చులు, జీత భత్యాలు, సంక్షేమ పథకాల కోసం వచ్చిన ఆదాయాలు ఖర్చు అవుతుంది. ఆర్థిక క్రమశిక్షణ పాటించినప్పటికి ఎప్పటికి ఖజానా ఖాళీకుండలా కనిపిస్తుంది. గత ప్రభుత్వం చేసిన అప్పులవల్ల ప్రస్తుత ఆర్థికంగా చితికిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రస్తుతం ప్రభుత్వానికి నెలకు వివిధరకాల రూపాల 18 వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 3.50 లక్షల మంది ఉద్యోగులకు, 2.50 లక్షల మంది పైగా పెన్షనర్లకు నెలకు 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు 6 వేల కోట్ల అప్పులకు వడ్డీ చెల్లిస్తుండగా, మరో 3 వేల కోట్లు సంక్షేమ పథకాల అమలుకోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. మరో 3 వేల కోట్లు ప్రభుత్వ నిర్వహణ,వివిధ నిర్మాణ పనులకు బిల్లు చెల్లించడం, కొత్తగా రోడ్ల నిర్మాణానికి సాగు, తాగు నీరు పథకాలకు ఖర్చు చేయడంతో ఖజాన పెట్టె ఖాళీ అవుతుంది. ఆదాయం మిగులు మాట ఏమోకాని వచ్చిన ఆదాయం కంటే ప్రభుత్వంపై అదనంగా ఆర్థిక భారం పడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాదాపు 10 నెలల కాలంలో వివిధ బ్యాంకుల్లో వివిధ ఆర్థిక సంస్థల నుంచి దాదాపు 49 వేల కోట్ల రూపా రుణాలు తీసుకొని ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీ క్రింద 10 నెలల కాలంలో 60 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ప్రభుత్వం వడ్డీ క్రింద చెల్లించింది. గత ప్రభుత్వం రమారమి రూపాయలు 7 లక్షల కోట్లు అప్పు చేయగా రోజుకు రూపాయలు 200 కోట్ల వడ్డీ రూపేణ చెల్లిస్తే నెలకు అక్షరాల 6 వేల కోట్లు చెల్లించాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి నాలుగు శాఖల నుంచి మాత్రమే అధికంగా ఆదాయం సమకూరుతుంది. మిగత శాఖల నుంచి పెద్దగా ఆదాయం సమకూరే పరిస్థితి లేదని చెప్పాలి.

అబ్కారి శాఖ, రవాణ శాఖ, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ నుంచి మాత్రమే ఆదాయం వస్తుంది. అబ్కారి శాఖకు నెలకు 3 వేల నుంచి 3500 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుంది. వాణిజ్య పన్నుల శాఖ నుంచి అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికి రాజకీయ జోక్యంతో పూర్తిస్థాయి పన్నులు వసూలు కావడంలేదు. ప్రభుత్వం నాలుగు శాఖల పై ఆధారపడి వచ్చే ఆదాయంతో ఖర్చు చేస్తున్నప్పటికి, రుణాలు తీసుకోవడం అనివార్యమైంది. అన్ని రకాలుగా అన్వేషణ చేస్తున్నా ఆదాయ మార్గాలు కనిపించడంలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అంతంత మాత్రమే అని చెప్పాలి. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సహకారం అందిస్తూ, బీజేపీ యేతర ప్రభుత్వాలకు ఆర్థిక సహకారం పూర్తి స్థాయిలో అందించడం లేదని చెప్పాలి. కేంద్రానికి మద్దతు ఇస్తున్న ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రభుత్వాలకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రభుత్వానికి 7500 కోట్ల రూపాయలు ఆర్థిక సహకారం అందించగా తెలంగాణ ప్రభుత్వంకు 3,800 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది.

16 ఎంపీ సీట్లున్న టీడీపీ కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన మద్దతుగా నిలవడంతో ఏపీకి అదనంగా కేంద్రం ఆర్థికంగా సహకారం అందిస్తుంది. గూడ్స్ సర్వీస్ ట్యాక్స్, జి.యస్.టి పన్ను క్రింద రావల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో తెలంగాణకు చెల్లించకపోవడంవల్ల సంకటంగా మారింది. గత ప్రభుత్వం ప్రభుత్వ భూములు విక్రయించి ఆదాయం సమకూర్చుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసేందుకు సుముఖంగా లేనట్లే కన్పిస్తుంది. 6 వేల కోట్లు జీతాలు, పెన్షన్లు, 6 వేల కోట్ల రూపాయలు వడ్డీలకు చెల్లిస్తుండగానే రైతులకు రైతు భరోసా క్రింద రెండు విడుతలు చెల్లించాలంటే రమారమి 15 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల క్రింద మరో 7 వేల 700 కోట్ల రూపాయలు చెల్లించాల్సి వుంది. రైతు భరోసాకు 15 వేల కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ 7,700 కోట్లు అంటే దాదాపు 23 వేల కోట్ల రూపాయలు. ప్రస్తుతం ప్రభుత్వం అవసరం అవుతుంది. ఇప్పటికే రుణాలు తెచ్చి రైతు రుణమాఫీ పథకం క్రింద 2 లక్షల రుణాలున్న రైతులకు 20 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసింది. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా చేరుతున్న వారికి అదనంగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఖర్చులు ఎక్కువ, ఆదాయం తక్కువగా వస్తుండటంతో ప్రభుత్వానికి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. వచ్చే ఆదాయం జీతాలకు, పెన్షన్లకు వడ్డీ చెల్లింపులకు, సంక్షేమ పథకాలకు ఖర్చు అవుతుండటంతో పెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేయడం కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలకు రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ మహిళలకు రూ.2500 వంటి పథకం, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ప్రభుత్వానికి రుణాలు తీసుకోవడం అనివార్యమని చెప్పాలి.

సెల్: 7981018644

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే... కఠిన చర్యలు

సీఈసీ రాజీవ్ కుమార్

ముంబై : ఎన్నికల ప్రచారంలో మహిళల్ని అగౌరవపర్చే వ్యాఖ్యలు చేసిన అభ్యర్థులపై సకాలంలో కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయ వర్గాలు శుక్రవారం ఈ సంగతి వెల్లడించాయి. జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహిళల గౌరవానికి భంగం కలిగించేలా కించపరిచే పదజాలం వాడడంపై సీఈసీ ఆందోళన వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు స్త్రీల గౌరవానికి భంగం కలిగించే పనులు, చర్యలు లేదా వ్యాఖ్యలకు దూరంగా ఉండాలి. ఇతర పార్టీల నాయకులు లేదా కార్యకర్తల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన, ప్రజా కార్యకలాపాలతో సంబంధం లేని ఏ అంశాన్ని విమర్శించరాదని రాజీవ్‌కుమార్ పేర్కొన్నట్లు వర్గాలు తెలిపాయి. ప్రత్యర్థులను అవమానించేలా వ్యక్తిగత విమర్శలు చేయరాదని అన్నారు. అటువంటి వారిపై సకాలంలో కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు, పార్టీ నాయకులందరూ ఓటర్లను ఆకట్టుకునేందుకు తమ వాక్చాతుర్యాన్ని పెంపొందించుకోవాలని, వారి ప్రసంగాలు, ఇతరత్రా చర్యల్లో మహిళల పట్ల గౌరవాన్ని ప్రతిబింబించే విధంగా నడుచుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై కేసు

బెంగళూరు: బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్యపై పోలీసు కేసు నమోదైంది. వక్ఫ్ భూముల సమస్యతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడంటూ ఆయన తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తుండటం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటకలోని హావేరి జిల్లాకు చెందిన రైతు రుద్రప్ప చన్నప్ప బాలికై తన భూమిని వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడని, కర్నాటక సీఎం సిద్దరామయ్య, మంత్రి జమీర్ అహ్మద్ చర్యల వల్ల రైతులు కుంగిపోతున్నారని ఎంపీ సూర్య ఇటీవల సోషల్‌మీడియా వేదికగా ఆరోపించారు. అయితే 2022 జనవరిలో రైతు రుద్రప్ప పంట నష్టం, రుణ భారం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని, భూ సమస్య వల్ల కాదని హావేరి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్పష్టంచేశారు. రైతు ఆత్మహత్యను వక్ఫ్ భూములకు ముడిపెడుతూ పోస్టు పెట్టి... తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారనే ఆరోపణలతో ఎంపీతో పాటు రెండు కన్నడ పత్రికల ఎడిటర్లపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వక్ఫ్ నోటీసులకు వ్యతిరేకంగా హావేరిలో రైతులు నిరసన తెలియజేస్తున్నారని, ఈ ఘటనలోనే రైతు రుద్రప్ప మానసిక క్షోభకు గురై ఆత్మహత్య చేసుకున్నారని వార్తాపత్రికలు పేర్కొన్నాయి. ఆ పోస్టును ప్రస్తుతం సూర్య డిలీట్ చేశారు.

'370' పునరుద్ధరణ దుర్లభం

ప్రధాని మోదీ

ధూలే: కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన జమ్మూకశ్మీర్ నుండి రాజ్యాంగాన్ని తొలగించాలని కోరుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అలాగే ప్రపంచంలోని ఏ శక్తి కూడా ఆర్టికల్ 370ని అక్కడ పునరుద్ధరించలేదని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ధూలేలో నిర్వహించిన ప్రచార సభలో మోదీ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. కాంగ్రెస్ ఒక కులాన్ని మరో కులానికి వ్యతిరేకంగా ఇరకాటంలో పెడుతున్నదని, ప్రజలు ఐక్యంగా ఉండాలని కోరారు. దేశంపై ఇంతకంటే పెద్ద కుట్ర మరొకటి ఉండదన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు 'పాకిస్తాన్ ఎజెండా'ను ప్రోత్సహించరాదని, వేర్పాటువాదుల భాష మాట్లాడకూడదని ప్రధాని అన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో జరుగుతున్న గందరగోళాన్ని మోదీ ప్రస్తావిస్తూ ఇండియా ఐక్య సంఘటన అక్కడ అధికారంలోకి వచ్చిన వెంటనే కశ్మీర్‌పై వారి కుట్రను ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టికల్ 370ని పునరుద్ధరించడానికి శాసనసభలో తీర్మానాన్ని ఆమోదించారని... అది ఎప్పటికీ జరగని పని అని మోదీ పునరుద్ఘాటించారు. 'జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం ఎలా జరిగిందో మీరు టీవీలో చూసి ఉంటారు బీజేపీ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేస్తుండగా... సభనుంచి గెంటివేయబడ్డారు. ఈ విషయాన్ని దేశం, మహారాష్ట్ర అర్థం చేసుకోవాలి' అని మోదీ అన్నారు. కులాలు, వర్గాలను విభజించే ప్రమాదకరమైన ఆటను కాంగ్రెస్ ఆడుతోందని మోదీ ఆరోపించారు. మహారాష్ట్రలో మహాయుతి అధికారంలో కొనసాగితేనే వేగవంతమైన అభివృద్ధి

సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అయితే.. దానికి విరుద్ధంగా కొందరు మాత్రం ప్రజలు లూటీ చేసేందుకే రాజకీయాల్లో ఉంటారని... రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు సృష్టిస్తారని విమర్శించారు. ప్రజల్లో విష బీజాలు నాటి దేశంలో ఉన్న గిరిజన వర్గాలను విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. వారంతా ఐక్యంగా ఉన్నంతకాలం బలంగా ఉంటారని.. ఏ శక్తీ వారిని అడ్డుకోలేదని అన్నారు. కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్పీ)లతో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) చక్రాలు లేదా బ్రేకులు లేని వాహనం అని... డ్రైవర్ సీట్లో కూర్చోవడానికి అక్కడ గొడవ జరుగుతోందని మోదీ ఎద్దేవా చేశారు. ధూలే, మహారాష్ట్రతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మోదీ... రాష్ట్ర ప్రజల నుంచి ఏదైనా అడిగినప్పుడల్లా దయతో ఉన్నారని అన్నారు. "గత ప్రభుత్వ 15 ఏళ్ల దుష్పరిపాలనకు ముగింపు పలికేందుకు 2014లో మీ ఆశీస్సులు కోరాను. మీరు దయతో బీజేపీకి అపూర్వ విజయాన్ని అందించారు. ఈ రోజు, నేను మహారాష్ట్రలో ధూలే నుండి నా ప్రచారాన్ని ప్రారంభిస్తున్నాను. మహాయుతి అభ్యర్థులు ప్రతి ఒక్కరూ మీ ఆశీస్సులు కోరుతున్నారు" అని అన్నారు.

నీళ్లు, అడవులు, భూములపై బీజేపీ కన్ను

జార్ఖండ్ ఎన్నికల సభలో రాహుల్ గాంధీ

సిండేగా: జార్ఖండ్‌లోని గిరిజనుల నుంచి నీళ్లు, అడవులు, భూములు లాక్కునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అన్నారు. రాష్ట్రంలోని సిండేగా నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ... గిరిజనులను వనవాసీలుగా ప్రధానమంత్రి మోదీ పిలుస్తుంటారని, వారు నివసించే భూములు, అడవులు, నీళ్లు అన్నీ తమవేనని బీజేపీ, ఆరెస్సెస్, పెట్టుబడిదారులు నమ్ముతుంటారని అన్నారు. కొత్తగా అభివృద్ధి అనే పేరు తెరపైకి తెచ్చి గిరిజనుల భూములు, అడవులు, నీళ్లు వారికి దక్కకుండా ఉడాయించాలనే ఆలోచన చేస్తున్నారని మండిపడ్డారు. ఓ పక్క రాజ్యాంగంపై బీజేపీ నిరంతరం దాడి చేస్తుండగా... మరో పక్క ఇండియా ఐక్యసంఘటన నిరంతరం రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తోందని చెప్పారు. రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని తొలగించేందుకు తాము కట్టుబడి ఉంటామని రాహుల్ చెప్పారు. షెడ్యూల్డ్ తెగల రిజర్వేషన్లను 26 నుండి 28 శాతానికి, ఎస్సీల రిజర్వేషన్లను 10 నుంచి 12 శాతానికి, ఓబీసీల రిజర్వేషన్లను 14 నుంచి 27 శాతానికి

పెంచుతామని భరోసా ఇచ్చారు. వివిధ సంస్థల్లో, దేశ సంపదలో గిరిజనులు, దళితులు, ఓబీసీల భాగస్వామ్యాన్ని గుర్తించేందుకు కులగణన తప్పనిసరని రాహుల్ అన్నారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రకటించిన తర్వాత రాహుల్ గాంధీ ఇక్కడ ప్రచారానికి రావడం ఇది రెండోసారి. రెండు విడతలుగా నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో ఇక్కడ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. నవంబర్ 23న ఫలితాలను ప్రకటిస్తారు.

పెద్ద నోట్ల రద్దుతో గుత్తాధిపత్యం: రాహుల్

మోదీ సర్కారు పెద్దనోట్లు రద్దు చేయడం వల్ల దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇలు), అసంఘటిత రంగం విధ్వంసం జరిగిందని... వ్యాపార గుత్తాధిపత్యానికి దారి తీసిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మోదీ సర్కారు పెద్ద నోట్లు రద్దు చేసిన ఎనిమిదేళ్ల క్రితం కంటే ఈ రోజు దేశంలో ఎక్కువ నగదు లావాదేవీలు జరుగుతున్నాయని 'ఎక్స్' వేదికగా రాహుల్ పేర్కొన్నారు. నవంబర్ 8, 2016న, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రూ. 500, రూ. 1,000 నోట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అవినీతి, నల్లధనాన్ని అరికట్టడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడం, నగదు లావాదేవీలను తగ్గించడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అప్పట్లో మోదీ సర్కారు ప్రకటించింది. ఇది ఎనిమిదేళ్లయిన సందర్భంగా రాహుల్ స్పందిస్తూ... ఆనాటి నిర్ణయం 'ఎంఎస్ఎంఇ లు, అసంఘటిత రంగాన్ని నాశనం చేయడం ద్వారా గుత్తాధిపత్యానికి మార్గం సుగమం చేసింది' అని రాహుల్ పేర్కొన్నారు. వ్యాపారాలు చేయడానికి భయపడే వాతావరణాన్ని సృష్టించే అసమర్థ, అనాలోచిత విధానాలు భారతదేశ ఆర్థిక సామర్థ్యాన్ని అణిచివేస్తాయని రాహుల్ అన్నారు.

మహిళల వీరంగం

కర్రలతో విచక్షణారహితంగా దాడి

లక్నో: ఉత్తరప్రదేశ్ వీధుల్లో సాటి మహిళలని కూడా చూడకుండా ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. నడి రోడ్డుపై పదేసి కాళ్లతో తంతూ కర్రలతో వారిపై విచక్షణారహితంగా దాడికి దిగారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యాక్షన్ సన్నివేశాన్ని తలపించే విధంగా ఒకరినొకరు తన్నుకున్నారు. దీన్నంతా ఓ బాల్కనీలోని వ్యక్తి వీడియో తీయడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. ఫుటేజీలో ఇద్దరు మహిళలు మరోక మహిళను కర్రలతో నిర్దాక్షిణ్యంగా కొట్టడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇంతలో మరికొంత మంది అక్కడ గుమిగూడి దొరికిన వారిని దొరికినట్టు చితకబాదారు. కొందరైతే యుద్ధానికి సిద్ధమైన యోధుల్లా తమ చున్నీలను నడుముకి కట్టుకున్నారు. మధ్యలో వచ్చిన ఓ చిన్న బాలుడిని కూడా గాయపరిచినట్టు తెలుస్తోంది. దారిన పోయేవారు నచ్చచెబుతున్నా వారిని బెదిరించి అక్కడినుంచి పంపించేస్తున్నట్టు వీడియోలో స్పష్టమైంది. అసలు ఇంతలా దాడి చేసుకోడానికి గల కారణాలు స్పష్టంగా తెలియనప్పటికీ... ఎరుపు, గులాబీ రంగు బట్టలు వేసుకున్న మహిళల మధ్య గొడవ మొదలైనట్టు తెలుస్తోంది.

కేఏ పాల్ పిటిషన్ కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ: తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. కేఏ పాల్ వేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. తిరుమలను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలని కేఏ పాల్ ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తిరుమల దేవాలయాల నిర్వహణ పాలకమండలి చేతిలో కాకుండా పూజారుల చేతుల్లో ఉండాలని ఆ పిటిషన్‌లో కేఏ పాల్ కోరారు. కేవలం 744 మంది కేథలిక్‌లు ఉన్న వాటికన్ సిటీని ప్రత్యేక ప్రాంతంగా గుర్తించారని, అలాగే లక్షలాది మంది భక్తులకు ప్రాధాన్యత ఉన్న తిరుపతిని కూడా అదేవిధంగా ప్రత్యేక ప్రాంతంగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. తిరుమల దేవాలయాలకు వచ్చే వేల కోట్ల ఆదాయం దుర్వినియోగమవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ, సీబీఐ, డీజీపీలను కేఏ పాల్ ప్రతివాదులుగా చేరుస్తూ పిటిషన్ దాఖలు చేశారు.

విశ్రాంత న్యాయమూర్తులకు రూ.15 వేల పింఛనా?

సుప్రీం కోర్టు దిగ్భ్రాంతి

న్యూఢిల్లీ: కొంతమంది హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులకు నెలకు రూ.ఆరు వేల నుంచి రూ.15 వేల వరకే పింఛను లభిస్తుండటంపై సుప్రీం కోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. తక్కువ పింఛను విషయంలో ఓ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ కేవీ విశ్వ నాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. 13 ఏళ్ల పాటు జిల్లా కోర్టుల్లో జ్యుడీషియల్ అధికారిగా పనిచేసిన అనంతరం అలహాబాద్ హైకోర్టు న్యాయ మూర్తిగా పదోన్నతి పొందిన తనకు రూ.15 వేలే పెన్షన్ వస్తున్నట్లు ఆ

పిటిషనర్ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. పింఛన్ లెక్కగట్టే సమయంలో జ్యుడీషియల్ సేవలను పరిగణనలోకి తీసుకునేం దుకు అధికారులు నిరాకరించారని పేర్కొన్నారు. 'రూ.ఆరు వేలు, రూ.15 వేల పింఛను పొందుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు మనముందు ఉన్నారంటే... దిగ్భ్రాంతికరం. అలా ఎలా సాధ్యం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. న్యాయమూర్తుల పదవీ విరమణ అనంతర ప్రయోజనాలు ఒక్కో హైకోర్టులో ఒక్కోలా ఉంటాయని, కొన్ని రాష్ట్రాలు మెరుగైనవి అందించవచ్చని జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. అనంతరం ఈ కేసును ధర్మాసనం నవంబర్ 27కి వాయిదా వేసింది. మార్చిలో ఒక ప్రత్యేక పిటిషన్ విచారణ సమయంలోనూ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తుల పింఛను ప్రయోజనాల విషయంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 'హైకోర్టు రిటైర్డ్ జడ్జీల పెన్షన్ ప్రయోజనాలను లెక్కగట్టే విషయంలో... వారు బార్ నుంచి పదోన్నతి పొందారా? లేదా జిల్లా న్యాయవ్యవస్థ నుంచి పొందారా? అనే దాని ఆధారంగా వివక్ష ఉండొద్దని పేర్కొంది.

విద్వేషాలు రెచ్చగొట్టేవాళ్లకు గుణపాఠం తప్పదు

తేజస్వీ యాదవ్

పాట్నా: దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టే వాళ్లకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అగ్ర నాయకుడు, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ అన్నారు. విద్వేష రాజకీయాలు ఎంతో కాలం మనలేవని, జనం మధ్య విద్వేషాలను ప్రేరేపించే వారికి ప్రజలే బుద్ధిచెబుతారని ఆయన వ్యాఖ్యానించారు. బీహార్‌లో నాలుగు నియోజకవర్గాలకు జరుగుతున్న ఉప ఎన్నికలు, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై మీడియా అడిగిన ప్రశ్నలకు తేజస్వీ యాదవ్ పై విధంగా స్పందించారు. బీహార్‌లో ఉప ఎన్నికలు జరుగుతున్న నాలుగు స్థానాలను తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా తమ కూటమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. కాగా, జార్ఖండ్ అసెంబ్లీకి ఈ నెల 13, 20 తేదీల్లో రెండు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటే బీహార్ సహా పలు రాష్ట్రాల్లో ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. మహారాష్ట్రలో ఈ నెల 20న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగనుంది. ఈ నెల 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రపంచానికి మేలు చేశాం

రష్యా చమురు కొనుగోలుపై కేంద్రమంత్రి పురి

న్యూఢిల్లీ: పశ్చిమ దేశాల ఆంక్షల వేళ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలుకు సంబంధించిన అభ్యంతరాలపై తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం వల్ల తాము ప్రపంచానికి మేలు చేశామని చెప్పారు. అలా చేయకపోయి ఉంటే అంతర్జాతీయంగా చమురు ధర మరింత పెరిగేదన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'రష్యా చమురు కొని భారత్ యావత్ ప్రపంచానికి మేలు చేసింది. ఒకవేళ మేం అలా చేయకపోయి ఉంటే అంతర్జాతీయంగా ఇంధన ధరలు ఆకాశాన్నంటేవి. బ్యారెల్ చమురు ధర 200 డాలర్లు (రూ.16 వేలకు పైమాటే) చేరేది. రష్యా నుంచి చమురు దిగుమతులపై ఎలాంటి ఆంక్షలు లేవు. కేవలం ధరల పరిమితి మాత్రమే ఉంది. దాన్ని భారతీయ సంస్థలు కూడా అనుసరిస్తున్నాయి. ఈ కొనుగోళ్ల కారణంగా భారత్‌పై ఆంక్షలు పడే అవకాశముందని కొందరు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేశారు. కానీ, ఇదే

సమయంలో ఐరోపా, ఆసియాకు చెందిన చాలా దేశాలు రష్యా నుంచి బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురు, డీజిల్, ఎల్ఎన్‌జీ, అరుదైన ఖనిజాలను కొనుగోలు చేశాయన్న విషయాన్ని మర్చిపోకూడదు' అని కేంద్రమంత్రి రాసుకొచ్చారు. ధరల పరంగా మన చమురు సంస్థలకు ఎక్కడ లాభం చేకూరుతుందో అక్కడి నుంచి ఇంధన కొనుగోళ్లు కొనసాగిస్తామని హర్దీప్ సింగ్ పురి మరోసారి స్పష్టం చేశారు. మన దేశ పౌరులకు అందుబాటు ధరల్లో స్థిరమైన ఇంధన వనరులు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ మూడేళ్లుగా ఇంధన ధరలు తగ్గుతున్న ఏకైక దేశం మనదేనన్నారు.

స్త్రీల దుస్తుల కొలతలు పురుషులు తీసుకోవద్దు

యూపీ మహిళా కమిషన్

లక్నో: పురుషుల దురుద్దేశాలను నిరోధించడంతో పాటు 'బ్యాడ్ టచ్' నుంచి మహిళలను రక్షించేందుకుగాను ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ కీలక ప్రతిపాదనలు చేసింది. మహిళల దుస్తుల కొలతలను పురుష దర్జీలు తీసుకోకూడదని పేర్కొంది. అమ్మాయిల శిరోజాలను కత్తిరించే పనులు కూడా చేయకూడదని ప్రతిపాదించింది. ఈ మేరకు మహిళా కమిషన్ సభ్యురాలు హిమానీ అగర్వాల్ వెల్లడించారు. ఇటీవల జరిగిన సమావేశంలో కమిషన్ ఈ ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. 'ఇలాంటి వృత్తుల్లో ఉన్న పురుషుల అమ్మాయిలను అసభ్యంగా తాకుతూ వేధించడంకు ప్రయత్నించే అవకాశాలున్నాయి. అలాంటి వాటి నుంచి మహిళలను రక్షించడమే ఈ ప్రతిపాదనల లక్ష్యం' అని హిమానీ అగర్వాల్ వెల్లడించారు. మహిళా కమిషన్ ఇంకా కొన్ని ప్రతిపాదనలు చేసింది. అమ్మాయిల దుస్తుల కొలతలు మహిళలు మాత్రమే తీసుకోవాలని, ఈ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని తెలిపింది. సెలూన్‌లలో మహిళా కస్టమర్లకు అమ్మాయిలే సేవలందించాలని, జిమ్, యోగా సెంటర్లలో అమ్మాయిలకు మహిళా శిక్షకులే ఉండాలని, అలాంటి జిమ్‌లను తప్పనిసరిగా తనిఖీలు చేయాలని పేర్కొంది. స్కూల్ బస్సుల్లో తప్పనిసరిగా మహిళా ఆయా లేదా ఉపాధ్యాయిని ఉండాలని, డ్రామా ఆర్ట్ సెంటర్లలో అమ్మాయిలకు మహిళా డ్యాన్స్ టీచర్లను ఏర్పాటు చేయాలని, మహిళల వస్తువుల విక్రయించే దుకాణాల్లో తప్పనిసరిగా మహిళా సిబ్బంది ఉండాలని, కోచింగ్ సెంటర్లలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. తాము ప్రతిపాదనలు మాత్రమే చేశామని, త్వరలోనే వీటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు హిమానీ అగర్వాల్ తెలిపారు. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు చట్టం తీసుకొచ్చేలా యూపీ ప్రభుత్వాన్ని కోరనున్నట్లు పేర్కొన్నారు.

సుపారీ సొమ్ము ఇవ్వలేదు

పోలీసులకు హంతకుడు ఫిర్యాదు

మీరట్: ఉత్తరప్రదేశ్‌లో ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. సుపారీ సొమ్ము అందలేదని హంతకుడే పోలీసుస్టేషన్‌కు వచ్చి కేసు పెట్టాడు. అతడు చెప్పిన వివరాలను పోలీసులు దిగ్భ్రాంతి చెందారు. గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన అంజలి అనే న్యాయవాదిని ఇద్దరు దుండగులు కాల్చిచంపారు. ఆమె ఇంటికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆస్తి వివాదంలో భాగంగా అత్తింటివారే ఆమెను హత్య చేయించారనే కోణంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అయితే... వారి ప్రమేయానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వదిలేశారు. నేరం జరిగిన కొన్ని రోజులకు పోలీసులు ఇద్దరు షూటర్లు నీరజ్ శర్మ, యశ్‌పాల్‌ను అరెస్టు చేశారు. ఇటీవల నీరజ్ బెయిల్‌పై విడుదలైన అనంతరం పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టాడు. మృతురాలి భర్త, అత్తింటివారే ఈ హత్య చేయించినట్లు చెప్పాడు. ఇందుకోసం తమ మధ్య రూ.20 లక్షలకు ఒప్పందం కుదిరిందని వెల్లడించారు. మీరట్, టీపీ నగర్‌లో ఉన్న ఐదు షాపులు ఇస్తామని ఆ ఒప్పందంలో రాసుకున్నట్లు చెప్పాడు. ఇంతవరకు ఆ సొమ్ము అందలేదన్నాడు. 'పోలీసులు అరెస్టు చేసినప్పుడు మేం వారి పేర్లు వెల్లడించలేదు. మా మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఎలాంటి వివరాలు మేం బయటపెట్టలేదు. ఇప్పుడు మేం చేసినదానికి చింతిస్తున్నాం. అందుకే అన్ని వివరాలు చెప్తున్నాం' అని తెలిపాడు. అంజలికి సంబంధించిన పూర్తి వివరాలు ఆమె భర్తే ఇచ్చాడని, వాటి ఆధారంగానే కాల్పులు జరిపినట్లు నీరజ్ చెప్పాడు. 'అత్తింటివారు ఎన్నో ఏళ్లుగా అంజలిని వేధిస్తున్నారు. ఆ విషయాలు నాకు తెలుసు. వారందరిని కఠినంగా శిక్షించాలి' అని కోరాడు. ఈ కేసులో విచారణ జరుపుతున్నామని మీరట్ సిటీ పోలీస్ అధికారి ఆయుష్ విక్రమ్ వెల్లడించారు.

దౌత్యవేత్తలకు రహస్య మెమో అవాస్తవం

విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ: ఖలిస్తానీ సానుభూతిపరుడు నిజ్జర్ హత్య అంశంలో భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల వేళ సామాజిక మాధ్యమాల్లో ఓ వార్త హడావుడి చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారత దౌత్యవేత్తలకు కేంద్ర ప్రభుత్వం రహస్యంగా ఓ మెమో పంపినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. వైరల్ అవుతున్న ఆ మెమో నకిలీదని వెల్లడించింది. భారత విదేశాంగ పేరుతో ఇటీవల నెట్టింట ఓ మెమో చక్కర్లు కొడుతోంది. 2023 ఏప్రిల్ తేదీతో ఉన్న ఆ మెమోను మాజీ విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వత్రా జారీ చేసినట్లుగా ఉంది. కెనడాలోని ఖలిస్తానీ వేర్పాటువాదులను అడ్డుకునేందుకు భారతీయ మూలాలున్న గ్రూప్‌లతో ఓ బలమైన దళాన్ని ఏర్పాటు చేయాలని భారత దౌత్యవేత్తలను ఆదేశించినట్లు అందులో ఉంది. దీంతో ఇది కాస్త వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. 'అది నకిలీది. అలాంటి మెమో ఏదీ కేంద్ర ప్రభుత్వం జారీ చేయలేదు' అని విదేశీ వ్యవహారాలకు చెందిన ఎక్స్‌టర్నల్ పబ్లిసిటీ అండ్ పబ్లిక్ డిప్లొమసీ విభాగం వెల్లడించింది. భారత దౌత్యవేత్తలను హింసాత్మక నేరాలు అంటగడుతూ తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలిపింది. అయితే, భారత్-కెనడా మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంభన కొనసాగుతున్న వేళ ఈ మెమో వార్తలు చర్చనీయాంశమయ్యాయి.

ట్రంప్, హారిస్‌కు రాహుల్ లేఖ

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ అభినందనలు తెలిపారు. ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్, డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కు ఆయన లేఖ రాశారు. ట్రంప్ నాయకత్వంలో రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. 'అమెరికాకు 47వ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌కు అభినందనలు. భవిష్యత్తు కోసం ప్రజలు మీ విజన్‌పై విశ్వాసం ఉంచారు. ప్రజాస్వామ్య విలువలపై మన దేశాలు మాపుతున్న నిబద్ధత రెండు దేశాల మధ్య చారిత్రాత్మక స్నేహాన్ని పంచుకుంటున్నాయి. మీ నాయకత్వంలో పరస్పర ప్రయోజనాల కోసం రెండు దేశాల సంబంధాలు మరింత బలపడతాయని విశ్వసిస్తున్నాం' అని రాహుల్ రాసుకొచ్చారు. అదేసమయంలో ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్ష ఎన్నికల కోసం చేసిన కృషిని అభినందిస్తూ రాహుల్ గాంధీ లేఖ రాశారు. 'అధ్యక్ష ఎన్నికల్లో మీ ఉత్సాహవంతమైన ప్రచారానికి నా అభినందనలు. అందరినీ ఏకం చేయాలనే మీ సందేశం అందరికీ స్ఫూర్తినిస్తుంది. బైడెన్ పరిపాలనలో ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాల్లో భారత్- అమెరికా సహకారాన్ని మరింత పెంచాయి. ప్రజాస్వామ్య విలువలపై మన భాగస్వామ్య నిబద్ధత రెండు దేశాలకు మార్గదర్శకంగా కొనసాగుతుంది' అని పేర్కొన్నారు.

ఆరోగ్యం బాగోలేదు : శివరాజ్‌కుమార్

బెంగళూరు: తాను అనారోగ్యానికి గురయ్యానని, అందుకు సంబంధించిన చికిత్స తీసుకుంటున్నట్లు కన్నడ హీరో శివరాజ్ కుమార్ తెలిపారు. తాజాగా ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ఆయన వెల్లడించారు. కన్నడతో పాటు ఇతర భాషా చిత్రాల్లోనూ ఆయన నటిస్తున్నారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'భైరతి రణగల్' ప్రమోషన్‌లో బిజీగా ఉన్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ నవంబరు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్య సమస్య గురించి తెలిసాక తెలిసి ఎంతో భయపడ్డాను. అభిమానులు, ప్రజలు కలవరపడటం నాకు ఇష్టం లేదు. దాన్ని ధైర్యంగా ఎదుర్కొనేలా ఆత్మవిశ్వాసాన్ని పొందాను. ఇప్పుడంతా బాగానే ఉంది. అభిమానులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నేను అబద్ధం చెప్పను. నేను కూడా మనిషినే కదా. నాకు సమస్యలు వస్తుంటాయి. నాకు వచ్చిన అనారోగ్యానికి సంబంధించిన చికిత్స తీసుకుంటున్నాను. ఇప్పటికే నాలుగు సెషన్ల ట్రీట్‌మెంట్ పూర్తయింది' అని శివ రాజ్‌కుమార్ అన్నారు. అనారోగ్య సమస్యల కారణంగా ముందుగా అంగీకరించిన సినిమాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భావిస్తున్నట్లు చెప్పారు. కొత్త సినిమాల షూటింగ్స్‌తో పాటు విడుదలకు సిద్ధమైన వాటి ప్రచార కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొంటున్నట్లు తెలిపారు. శస్త్రచికిత్స నిమిత్తం అమెరికా వెళ్లనున్నట్లు చెప్పిన రాజ్‌కుమార్... ఆ తర్వాత నెల రోజులపాటు విశ్రాంతి తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

10 నుంచి జీ తెలుగు 'సరిగమప'

విశాలాంధ్ర-కడప: తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మ్యూజికల్ రియాలిటీ షో సరిగమప సీజన్ 16 నవంబర్ 10 నుండి ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటల నుంచి 10 గంటల వరకు జీ తెలుగులో ప్రసారం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న ఈ సీజన్‌కు సంగీత దిగ్గజాలు కోటి, ఎస్పీ శైలజ, కాసర్ల శ్యామ్ జడ్జీలుగా ఉన్నారని, ఉత్తేజకరమైన ప్రదర్శనలు, మనసును హత్తుకునే పాటలతో సంగీత ప్రేక్షకులకు ఇది మరింత వినోదం పంచబోతోందన్నారు. ప్రతి కంటెస్టెంట్ ఆకట్టుకునే ప్రదర్శనలతో తెలుగు ప్రేక్షకులకు ఫేవరెట్‌గా మారుతున్నారన్నారు. ప్రతిష్టాత్మక సరిగమప టైటిల్ కోసం సింగింగ్ సెన్సేషన్స్ పోటీ పడుతుండటంతో థ్రిల్లింగ్ కాంపిటీషన్లు, మరచిపోలేని క్షణాలను అందిస్తూ ప్రతి వారాంతం మరింత స్పెషల్‌గా నిలుస్తోందన్నారు. అపారం అంతులేని వినోదం అందించే ఉద్దేశంతో జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రసార సమయాన్ని పెంచిందన్నారు. శ్రోతల మనసును తాకే సంగీతంతోపాటు చక్కని వినోదం అందించే లక్ష్యంతో వస్తున్న జీ తెలుగు సరిగమప సీజన్ 16 ప్రతి ఆదివారం రాత్రి 8:30 గంటలకు తప్పక చూడాలన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బేగంపేట్ టూరిజం ప్లాజాలో అభివృద్ధి కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. దిశ కమిటీ చైర్మన్ హెూదాలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశం సుధీర్ఘంగా కొనసాగుతోంది. ఈ సమావేశంలో ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివిధ శాఖల అధికారులు, దిశ కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఎల్‌ఎండీ (లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్) అన్ని బ్యాంకుల్లో ముద్ర లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్, ఎంఎస్‌ఎంఈలపై సమీక్షించారు. నగరంలో రైల్వేస్, ఎలక్ట్రిసిటీ, నేషనల్ హైవేస్, బ్రిడ్జిల నిర్మాణంతో పాటు తదితర విషయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలు, మహిళా సంఘాల ఉన్నతికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల ద్వారా ఎంత మొత్తాన్ని అందజేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి జీహెచ్ ఎంసీతో పాటు వివిధ శాఖల అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం కేంద్రమంత్రి

జి.కిషన్ రెడ్డి అధ్యక్షతన బేగంపేట్‌లో హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు అందించిన పలు వివరాలపై కేంద్రమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పెద్ద యెత్తున నిధులను, పథకాలను అమలు చేస్తుండగా లక్ష్యాన్ని చేరుకోవడంలో ఇబ్బందులు ఏమిటని నిలదీశారు. సెల్ఫ్, హెల్ప్ గ్రూపులు, సబ్సిడీ రుణాలు తదితరాలలో తలెత్తుతున్న ఇబ్బందులు ఏమిటని ప్రశ్నించారు. వచ్చే సమావేశంలో ఆయా విషయాలపై పూర్తి ప్రాజెక్టు నివేదికను రూపొందించాలన్నారు. సాంకేతిక సమస్యలే సాకులు చెప్పడమేంటని అన్నారంటూ అధికారులు, బ్యాంకర్లు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆయా సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల లబ్ధి టార్గెట్ ప్రకారం ప్రతీ ఒక్కరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, బ్యాంకర్ల మధ్య రుణాలు అందించే విషయంలో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే తనకు తెలియజేయాలన్నారు. నిధులు సమకూర్చే బాధ్యత తనకు వదిలివేయాలన్నారు. రుణాల కోసం అందిన దరఖాస్తులు ఎన్ని, ఎన్ని రుణాలు అందజేశారని ప్రశ్నించారు. ఆయా విభాగాల అధికారులు కొన్ని వివరాలను వెల్లడించగా, పూర్తి వివరాలందించడంలో స్పష్టత కరవైంది. దీంతో మంత్రి కలగజేసుకొని అన్ని శాఖలు, బ్యాంకర్లు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు మరో సమావేశంలో తనకు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని పూర్తి చేయడంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

లోపాలు లేకుండా సర్వే నిర్వహించాలి

అదనపు కలెక్టర్ రాధిక గుప్త

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను జాగ్రత్తగా ఎలాంటి లోపాలు జరుగకుండా నిర్వహించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం నిజాంపేట, దుండిగల్ మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న సర్వేను అదనపు కలెక్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు రాధిక గుప్తా మాట్లాడుతూ సర్వేను జాగ్రత్తగా ఎలాంటి లోపాలు జరుగకుండా నిర్వహించాలని సూచించారు. వివరాలను సేకరించేటప్పుడు కుటుంబయజమానులు వారి వారి ఆధార్, ఓటర్, అవసరమైన కార్డులను ఎన్యుమరేటర్లకు చూపించేలా ముందుగానే తెలయజేయాలన్నారు. ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను పరిశీలించి ఏ విధంగా నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని, మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఇళ్లు ఉండి, ఇతర జిల్లాలలో నివాసముంటున్న వారు స్వచ్ఛంధంగా ఎక్కడైన ఒక చోట మాత్రమే వారి వివరాలు నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను భద్రపరిచేందుకు అవసరమైన ఫైల్ ఫోల్డర్లను, బ్యాగులను ఎన్యుమరేటర్లకు అందించాలని సూచించారు. అనంతరం దూలపల్లి, బాచుపల్లిలలో గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను జిల్లా అదనపు కలెక్టరు రాధిక గుప్తా పంశీలించారు.

గౌతం మోడల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: కొండాపూర్ డివిజన్‌లోని కొత్తగూడ గ్రామంలో శ్రీ గౌతమ్ మోడల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, శేరిలింగంపల్లి మండలం విద్యాధికారికి ఐఐటీయుసి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ శేర్లింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి టి రామకృష్ణ, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కె.చందు యాదవ్ మాట్లాడుతూ, అధిక ఫీజులు, స్కూలు బుక్స్ ప్రైవేట్‌గా అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అలాగే ఒక విద్యార్థి టిసి విషయంపై ప్రధానోపాధ్యాయుని అడగగా అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి అధిక ఫీజు కడితేనే టీసీ ఇస్తానని అన్నారని వాపోయారు. ఈ స్కూల్‌కి ప్లే గ్రౌండ్ కూడా లేదు. అలాగే చాలా ఇరుకైన గదులతో ఎక్కువమంది విద్యార్థులను ఉంచి తరగతులను నిర్వహిస్తున్నారు. దీనిపై చర్య తీసుకోవాలని శేర్లింగంపల్లి ఉన్నత విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కూన కాసిం, ఎఐఎస్ఎఫ్ చక్రవర్తి, నితీష్, శ్రీరామ్, విద్యార్థి తండ్రి అజముల తదితరులు పాల్గొన్నారు.

సాదిక్ అలీ మరణంపై మంత్రి సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : పడిపోతున్న పఠన సంస్కృతి పునరుజ్జీవంలో విశేష కృషి చేసినవారు తోపుడి బండి సాధిక్ అలి అని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆధునిక గ్రంథాలయ ఉద్యమానికి, ఆదివాసీల విద్యా వికాసానికి సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ సాదిక్ అలీ గుండె పోటుతో అకాల మరణానికి సీతక్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బికరోనా కాలంలో ములుగు, ఖమ్మం ఏజెన్సీలో వైద్య సామాగ్రి పంపిణీ, విద్యా అవసరాలని తీర్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. విలువలతో కూడిన ప్రజా అనుకూల, ప్రజా పరిపాలన విశ్లేషణలతో ఆదర్శ పాత్రికేయ వృత్తిని కొనసాగించారని అన్నారు. వందలాది గ్రామాలలో తోపుడి బండి పేరుతో పాద యాత్ర గ్రంథాలయాలు స్థాపించి జ్ఞాన విప్లవానికి దోహదం చేశారన్నారు. వందలాది విద్యార్థుల ఉన్నత విద్యా ఆర్థిక అవసరాలను గొప్ప దాతృత్వం, ఆదివాసి బడులలో మధ్యాహ్న భోజనం ఏర్పాటును తెలంగాణ సమాజం ఎప్పటికీ గుర్తు ఉంచుకుంటుందని, ఆపదలో, అవసరాలలో ఉన్న వారికి అక్షయపాత్ర లాగా మానవీయతను అందించిన సాధిక్ జీవితం అనుసరణీయం అని అన్నారు. ఆ స్ఫూర్తిని వారసత్వాన్ని కొనసాగిస్తుందని సీతక్క ఘన నివాళులు అర్పించారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి నటరాజ్ రాజీనామా

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ 16వ వార్డ్ కౌన్సిలర్ పదవికి, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి నా సొంత కారణాలవల్ల శుక్ర వారం రాజీనామా సమర్పించినట్టు ఎమ్మెస్ నటరాజన్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. 1988 సంవత్సరం నుండి 'మానవసేవయే మాధవ సేవ' అని విశ్వసించి రాజకీయాన్ని ప్రవృత్తిగా భావించి పనిచేసిన నేను, 50 ఏళ్ల వయసులో నన్ను మొదటిసారిగా క్రిస్టియన్ కాలనీ ప్రజలు 16 వార్డు ప్రజలు అక్కున చేర్చుకొని కౌన్సిలర్‌గా గెలిపించినందుకు వారికి, క్రిస్టియన్ కాలనీ పెద్దలకు, నాకు సహకరించిన నాయకులకు, నాతో పని చేసిన యువకులకు, ధన్యవాదాలు తెలియజేసినట్లు తెలిపారు. నన్ను కౌన్సిలర్‌తో పాటు వైస్ చైర్మన్‌గా నియమించినందుకు అప్పటి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కి మరొక్కసారి నా సేవలను గుర్తించి వైస్ చైర్మన్గా చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుతం నేను నా సొంత కారణాల వల్ల ఈ రెండు పదవులకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. బాధ్యతగల బీఆర్ఎస్ కార్యకర్తగా పార్టీలో కొనసాగుతానని రాజీనామా ప్రతులను సీడీఎంఏ హైదరాబాద్, కలెక్టర్ రంగారెడ్డి జిల్లా, అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ రంగారెడ్డికు పంపించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. చిన్న వయసు నుండే రాజకీయాల్లో విలక్షణ నేతగా రేవంత్ ఎదిగారని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందజేశారు. అదేవిధంగా జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అనుకూల సభ్యుల పేరిట ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రా ప్రభుత్వాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తూ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు నడిపిస్తున్న నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పదేళ్లపాటు అటు రాష్ట్రాన్ని ఇటు నియోజకవర్గాన్ని అతలాకుతలం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో సాహసోపేతమైన నిర్ణయాలతో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ మౌలిక సదుపాయాల రూపకల్పనలో తనదైన ముద్ర వేసుకుంటున్నారని అన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ పాలనకు ఎదురొడ్డి పోరాడి ప్రజల చేత శభాష్ అనిపించుకుని ప్రజా పాలన చేపట్టారని అన్నారు. నియోజకవర్గ ప్రజల నుంచి ముందుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నయ్య, యాదయ్య యాదవ్, బాబర్‌అలీ ఖాన్, రఘు, విశ్వం, బస్వం, కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, బాలరాజు గౌడ్, మాజీ జెడ్పీటీసి వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, యాదగిరి యాదవ్, కొమ్ము కృష్ణ, చంద్రశేఖర్, దంగు శ్రీనివాస్ యాదవ్, తుపాకుల శేఖర్, అందే మోహన్, రాజేందర్ రెడ్డి, మాధవులు, నెహ్రూ నాయక్, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, మురళీమోహన్, హరినాథ్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, సీతారాం, అర్జున్ లక్ష్మణ్, జంగారి రవి, శ్రీధర్ రెడ్డి, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసిన మైనంపల్లి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆనంద్ బాగ్ క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి ఎంఎస్ఎస్ఓ ద్వారా పారిశుద్ధ్య కార్మికులకు, ఆశా వర్కర్లకు దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వై.ప్రేం కుమార్, జితేంద్రనాథ్, నాయకులు వెంకటేష్ యాదవ్, జి.ఎన్.వి. సతీష్ కుమార్, గుండ నిరంజన్, ఎస్.ఆర్.ప్రసాద్, సంపత్ గౌడ్, వినోద్ యాదవ్, వైనాల ప్రవీణ్, కొండ గౌడ్, సంతోష్ రాందాస్, పిట్టల నాగరాజు, సురేష్ సింగ్, బాబు, సత్యనారాయణ, నరేందర్ గౌడ్, నాగేష్ గౌడ్, ఫరీద్, యాదగిరి, కిషోర్, సంగీత, ప్రభ, రోజా రమణి, నిర్మల, లాస్య, లక్ష్మి, మహాలక్ష్మి, సిరిగిరి రాజు, శ్రీరామ్, చెన్నారెడ్డి, పరమేష్, సురేష్ సింగ్, సిరిగిరి రాజు, మోసిన్, వసంత, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కమిటీలు అంకితభావంతో పనిచేయాలి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం గొడుగు కింద కొనసాగే జర్నలిస్టుల ఆరోగ్య, ఇళ్ల స్థలాల, మహిళా సంక్షేమ, దాడుల వ్యతిరేక, సోషల్ అండ్ డిజిటల్ మీడియా, గ్రామీణ విలేకరుల సంక్షేమ, భావ స్వేచ్ఛ మేగజైన్ సబ్ కమిటీలు అంకితభావంతో చురుకుగా పనిచేయాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) జాతీయ అధ్యక్షులు, టీయూడబ్ల్యూజే సలహాదారు కె.శ్రీనివాస్ రెడ్డి సూచించారు. శుక్రవారం బషీర్ బాగ్‌లోని టీయూడబ్ల్యూజే కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సబ్ కమిటీ బాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయా కమిటీలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ, యూనియన్ పట్ల జర్నలిస్టుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గత ఐదేళ్లుగా ఆరోగ్య కమిటీ సంతృప్తికరమైన సేవలందిస్తుందని ఆయన కితాబు ఇచ్చారు. జర్నలిస్టులకు ఆరోగ్య పథకం రూపకల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, ఆ పథకం ప్రవేశపెట్టేంత వరకు నిమ్స్ ఆసుపత్రిలో జర్నలిస్టులు ఆరోగ్య సేవలు పొందాలని ఆయన తెలిపారు. అలాగే ఏ సొసైటీల్లో లేకుండా, ఇళ్ల స్థలాలకు నోచుకోని జర్నలిస్టుల సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు హౌసింగ్ కమిటీ కృషి చేయాలన్నారు. మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు జర్నలిస్టులకు ఇంటి స్థలాలను అందించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు దాడుల వ్యతిరేక కమిటీ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. వృత్తిలో మహిళలు అనుభవిస్తున్న ప్రత్యేక సమస్యలను వెలికి తీసేందుకు మహిళా కమిటీ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రాంనారాయణ, ఐజేయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, ఆరోగ్య కమిటీ సలహాదారు డాక్టర్ ధనుంజేయ, కన్వీనర్ ఏ.రాజేష్, హౌసింగ్ కమిటీ కన్వీనర్ వి.వి.రమణ, మహిళా కమిటీ కన్వీనర్ పి.స్వరూప, గ్రామీణ విలేకరుల కమిటీ కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్‌లతో పాటు ఆయా కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రిజిస్ట్రేషన్ల నిలిపివేత కోరుతూ వక్ఫ్ బోర్డు సి.ఈ.ఓ ప్రకటన నేపథ్యంలో పేద ప్రజలకు అన్యాయం జరగకుండా సవరణలు కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి పత్రం అందజేయడం జరిగింది. దాదాపు 750 ఎకరాల విస్తీర్ణంలో 70 కాలనీలు బస్తీలు ఏర్పడ్డాయని ఇందులో స్థిరనివాసం ఏర్పరచుకొని దశాబ్దాలుగా ప్రభుత్వాలకు పన్నులు కడుతున్నారని, అలాంటి పేద మధ్య తరగతి ప్రజలు ఇప్పుడు ఆడపిల్లల పెళ్ళిళ్ళకో, చదువులకో, అనారోగ్య భారిన పడ్డ సమయంలోనో వారి ఆస్తులను అమ్ముకోవడానికి వీలులేని విధంగా వక్ఫ్ బోర్డు సిఈ.ఓ ప్రకటనుందని, దశాబ్దాలుగా సదరు సర్వే నెంబర్లలో ప్రజలకు అన్ని వసతులు (సి.సి.రోడ్లు, కరెంట్ మీటర్లు, వీధిదీపాలు డ్రైనేజీ వ్యవస్థ వంటి సౌకర్యాలు) ప్రభుత్వాలు కల్పిస్తూ వస్తున్నాయి. 1954లో వక్ఫ్ చట్టం ఏర్పడినప్పటి నుండి ఎన్ని సర్వేలు నిర్వహించారో, ఎన్ని సర్వే నంబర్లు వక్ఫ్ భూములుగా నిర్ధారించారో, కబ్జాలు అవుతున్న సమయంలో వక్ఫ్ అధికారులు ఎంతమందికి నోటీసుకు జారీ చేశారో, ప్రకటించాలని కోరుతూ వక్ఫ్ భూముల సంరక్షణకు తాను వ్యతిరేకం కాదని అయితే అక్కడే ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్న పేద ప్రజలకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం వ్యవహరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం జరిగింది.

ప్రతి రైతుకూ ట్రాక్టర్ ఉండేలా చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : 'గత నెలవారీ రికార్డులన్నింటినీ అత్యుత్తమంగా 20,056 ట్రాక్టర్ అమ్మకాలతో అధిగమించినందుకు సంతోషిస్తున్నామని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ అన్నారు. ఇది మా వ్యవసాయ సంఘంతో పంచుకోవడం గర్వకారణంగా ఉందన్నారు. ప్రతి రైతుకు సరైన ట్రాక్టర్ అందుబాటులో ఉండేలా చేయడంలో మా గొప్ప ప్రేరణ ఉందని చెప్పారు. విశ్వసనీయమైనది, అనుకూలీకరించినది మరియు వారి అవసరాలకు ప్రత్యేకంగా సరిపోయేది-సుస్థిరమైన శ్రేయస్సు వైపు వారి ప్రయాణానికి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. మేము ఈ సంవత్సరపు ఈ మైలురాయి ప్రదర్శనను జరుపుకుంటున్నప్పుడు, ఈ సాఫల్యం రైతులను అడుగడుగునా శక్తివంతం చేసేలా రూపొందించబడిన తెలివైన, భారీ-డ్యూటీ ట్రాక్టర్‌ల తదుపరి తరాన్ని అభివృద్ధి చేయడానికి మా నిబద్ధతను పునరుద్ధరిస్తుందని తెలిపారు.

ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల

ఆన్‌లైన్ నమోదుపై ప్రిన్సిపల్స్‌కు అవగాహన

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాలతో 2024-25 విద్యా సంవత్సరానిక గాను ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాల ఆన్‌లైన్ నమోదుపై కాలేజీల ప్రిన్సిపల్స్‌కు అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ ఏర్పాటు చేశారు. శుక్రవారం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్సీ విద్యార్థులకు అందించే పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ కొరకు భారత ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలననుసరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానంపై ప్రిన్సిపల్స్‌కు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సిజిజి ప్రతినిధి వినయ్ కృష్ణ అవగాహన కల్పించారు. ఈ ఉపకార వేతనాలలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భాగస్వామ్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి వినోద్ కుమార్ మాట్లాడుతూ ఫీజు బకాయిలు ఉన్నాయని డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే ఫైనల్ ఇయర్ ఎస్సీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారిని ఇబ్బందులు కలిగించొద్దని, అందువల్ల వారి ప్లేస్ మెంట్ల విషయంలో చాలాసమస్యలు ఎదుర్కొవలసి వస్తుందని, వారి స్కాలర్ షిప్పులు కొంత ఆలస్యంగానైన మీ కాలేజీ అకౌంట్లలో జమ అవుతాయని కోరారు. ప్రతి కాలేజీలలో ఈ ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించేందుకు బాధ్యత గల సిబ్బందిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఏలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఏవైనా పొరపాట్లు జరిగితే నోడల్ ఆఫీసర్లదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో జిల్లాకు సంబంధించిన వివరాలను నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కొత్తగా నమోదు చేసుకునే విద్యార్థులు, రెన్యువల్ దరఖాస్తులు కూడాఈ సంవత్సరానిక ఆన్ లైన్ ద్వారానే పంపాలన్నారు. విద్యార్థుల ఆధార్ నంబర్లను బ్యాంక్ అకౌంట్‌తో సీడింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్లే కాకుండా, పోస్టల్ అకౌంట్లను కూడా సీడింగ్ చేయవచ్చని తెలిపారు. అనంతరం ప్రిన్సిపల్స్ సందేహాలను సిజిజి ప్రతినిధితో కలిసి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నివృత్తి చేశారు.

ఏకైక ప్రజా నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - అమనగల్లు : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను కడ్తాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి కేక్ కటింగ్ నిర్వహించి, పండ్లను పంపిణి చేశారు. అనంతరం పీసీసీ కార్యవర్గ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజా పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్న ఏకైక ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అనుక్షణం ప్రజా సంక్షేమం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతిక్షణం అలుపెరుగని పనిచేస్తున్న నాయకుడన్నారు. తెలంగాణ రాష్ట్రం రేవంత్ రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాలకు న్యాయం కలుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత అన్ని రంగాలలో దూసుకెళ్తుందని, తెలంగాణలో ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని, ప్రభుత్వ పథకాలతో పేద ప్రజల పక్షాన నిలుస్తుందన్నారు. టిపిసిసి సభ్యులు సుధీని రాంరెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బీక్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాట నరసింహ, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్ అలీ, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేష్, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షులు రామకృష్ణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు జాంగిర్ బాబా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్, బీసీ సెల్ అధ్యక్షుడు యాదయ్య, మాజీ సర్పంచ్ వేణు పంతులు, సీనియర్ నాయకులు బ్రహ్మచారి, బిక్షపతి, లక్ష్మణ్ నాయక్, మాలె మల్లేష్, బుచ్చయ్య, శ్రీరాములు, వెంకటయ్య, అజ్గర్ అలీ, శంకర్, మల్లయ్య, మంకీ శ్రీను, కృష్ణ, లక్పతి నాయక్, జవహర్ లాల్, మోత్యా నాయక్, శేఖర్, క్యామ రాజేష్, స్టాలిన్, ఎర్రోళ్ల శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు భాను కిరణ్, బోస్ రవి, విజయ్, రాజేందర్ గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి నాయకులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, అవిజె జేమ్స్, మాజీ కార్పొరేటర్ల బాల కృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బేకు శ్రీనివాస్, గడ్డం రాజేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు లాయక్, గణేష్, పెరికె శివ, పండరి, సోమన్న శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పద్మరావు, మైనారిటీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళ కాంగ్రెస్ నాయకులు, ఎస్సి, ఎస్టీ సెల్ నాయకులు, నాయకులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్ : నూతన వధూవరులను ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ఎమ్మెల్సీ సింగపూర్ రాజు ఆశీర్వదించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 17వ డివిజన్ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ బావమరిది రుషి బలరాం కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి, 16వ డివిజన్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ హాజరయ్యారు.

ప్రభుత్వాసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర - షాద్ నగర్,రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం షాద్ నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డిఓ ఎస్.ఆర్.సరిత, ఆస్పత్రి సూపింటెండెంట్ శ్రీనివాస రెడ్డి, తహసిల్దార్ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను, పార్కింగ్ స్థలాన్ని చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం సరిగ్గా లేదని పేర్కొన్నారు. పారిశుద్యం విషయంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్నతో మాట్లాడి వీలైనంతవరకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రిలోని రోగుల వార్డులను పరిశీలించారు. ఆస్పత్రి మంచాలపై బెడ్ షీట్లు పరిశుభ్రంగా లేకపోవడం ఆసుపత్రిలో పారిశుద్ధ్యం లోపించడం పట్ల సిబ్బందిని మందలించారు. ప్రభుత్వ వైద్యం కోసం నిరుపేదలు ఎంతో విశ్వాసంతో ఇక్కడికి వస్తారని వారి పట్ల మర్యాదగా వ్యవహరించి సేవల పట్ల పూర్తి నమ్మకాన్ని కలిగించాలని కలెక్టర్ నారాయణరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. నిధులకు కృత ఉంటే ఆలోచించకూడదని ప్రభుత్వం వాటిని సమకూర్చుతోందని అన్ని విధాల పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఆస్పత్రిలో నెలకు 300 ప్రసూతిలు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఒక గైనకాలజిస్ట్ వందల ప్రసూతిలు చేసినప్పుడు, ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉంటే ఎందుకు ఈ సంఖ్య పెరగడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వ వేళల్లో వైద్య సిబ్బంది తమ ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యం కోసం వచ్చే వారిని తమ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించినట్టు రుజువైతే ఉద్యోగాలు వదులుకోవాల్సిం దేనని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని వీలైతే వారానికి ఒకసారి ఆర్డీవో వచ్చి వైద్య సేవలను పరిశీలించాలని ఆదేశించారు. వచ్చే నెలలో కూడా ఈ ఆసుపత్రిని తాను స్వయంగా సందర్శిస్తానని అప్పటివరకు సేవలో మార్పు రావాలని కోరారు. అదేవిధంగా ఆసుపత్రి ప్రాంగణం కూడా మంచిగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరతను ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వెంటనే ఈ సమస్యను పరిష్కారం అయ్యేలా చూస్తానని చెప్పారు. అదేవిధంగా ఆరోగ్యశ్రీ ప్రక్రియ గురించి ఆసుపత్రిలో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యం కోసం వచ్చే వారిని బయట ఆసుపత్రులకు రెఫర్ చేయకూడదని ఆదేశించారు. అదేవిధంగా ఆస్పత్రిలో రిజిస్టర్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సరిత, ఎమ్మార్వో పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, స్పెషల్ ఆఫీసర్ వెంకట్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఆసుపత్రి వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్మెంటెడ్ రియాలిటీ సాంకేతికతతో మోకాలి మార్పిడి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో అత్యాధునిక అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్) సాంకేతికతను వినియోగిస్తున్నామని, తద్వారా అధునాతన ఆర్థోపెడిక్ కేర్‌లో అగ్రగామిగా నిలిచినట్లుగా అరెటే హాస్పిటల్స్ ప్రకటించింది. ఈ సాంకేతికతతో 50కి పైగా సర్జరీలను విజయవంతంగా పూర్తి చేసిన అరెటే హాస్పిటల్స్ ఈ ప్రాంతంలో మినిమల్లీ ఇన్వాసివ్ మోకాలి చికిత్సల ప్రమాణాన్ని పునర్నిర్వచిస్తోంది. సంప్రదాయ మోకాలి మార్పిడి పద్ధతులు, రోబోటిక్ సర్జరీ కంటే ఏఆర్ సాంకేతికత అనేక కీలక ప్రయోజనాలను అందిస్తుంది. మోకాలి కీలు రియల్ టైమ్, త్రీడీ విజువలైజేషన్‌లను అందించడం ద్వారా, ఇది ఎంతో కచ్చితమైన ఇంప్లాంట్ ప్లేస్మెంట్‌ను సాధించడానికి సర్జన్లకు వీలు కల్పిస్తుంది. ఫలితంగా మెరుగైన అమరిక, వేగంగా కోలుకోవడం, రోగులకు మెరుగైన పనితీరు ఫలితాలు ఉంటాయి. ప్రీ-ప్రోగ్రామింగ్‌పై ఆధారపడిన రోబోటిక్ సిస్టమ్‌ల మాదిరిగా కాకుండా ఏఆర్ సాంకేతికత శస్త్రచికిత్స సమయంలో ఎక్కువ సౌలభ్యం, అను కూలతకు వీలు కల్పిస్తుంది, మోకాలి పరిస్థితులపై ఆధారపడి ప్రణాళికను మార్చగల డైనమిక్ సర్దుబాటులను అనుమతిస్తుంది. తద్వారా ఇది శస్త్రచికిత్స కచ్చితత్వాన్ని పెంచుతుంది. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్థోపెడిక్స్, ఆర్థ్రోస్కోపీ, స్పోర్ట్స్ ఇంజూరీస్, రోబోటిక్ జాయింట్ రీప్లేస్ మెంట్ సర్జన్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాత్ రెడ్డి లక్కిరెడ్డి మాట్లాడుతూ, "అరెటే హాస్పిటల్స్‌లో మేం మోకాలి శస్త్రచికిత్స రోగులకు అసాధారణమైన సంరక్షణ అందించేందుకు గాను మా అనుభవజ్ఞులైన ఆర్థోపెడిక్ నిపుణుల బృందాన్ని సరికొత్త అగ్మెంటెడ్ రియాలిటీ సాంకేతికతతో కలిపి అందిస్తున్నాం. 50,000 మోకాళ్ల శస్త్రచికిత్సలు చేసిన తర్వాత, ఈ అత్యాధునిక సాంకేతికత సంక్లిష్టతలను తగ్గించడమే కాకుండా దీర్ఘకాలిక ఫలితాలను ఎలా మెరుగుపరుస్తుందో మేం ప్రత్యక్షంగా చూశాం. ఈ సాంకేతికతతో, సంక్లిష్టమైన విధానాలు కూడా మరింత అందుబాటులోకి వస్తాయి, కచ్చితమైనవిగా మారతాయి. ఇది అనుభవజ్ఞులైన సర్జన్లు, శిక్షణలో ఉన్నవారికి కూడా ప్రయోజనం చేకూరుస్తుంది" అని అన్నారు.

ఆర్‌వీ ఫౌండేషన్ మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుక్రవారం ఉదయం బోడుప్పల్, పీర్జాదిగూడ జంట కార్పొరేషన్ల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్.వి. ఫౌండేషన్ సౌజన్యంలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం అధిక సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, పీర్జాదిగూడ మేయర్ అమర్ సింగ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ తుంగతుర్తి రవి ఆర్.వి. ఫౌండేషన్ స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అందులో జంట కార్పొరేషన్ల కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయడం అభినందనీయమని అన్నారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి మాట్లాడుతూ రేవంతన్న జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరం చేయటం సంతోషకరమని, అలాగే తుంగతుర్తి రవి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సామజిక కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాలను పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

సుమారు 200 మందికి పైగా దాతలు రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన బోడుప్పల్, పీర్జాదిగూడ జంట కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, నాయకులకు మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ అధ్యక్షులు, అన్ని విభాగాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు, రక్త దాన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేషన్ ప్రజలకు, యువతకు తుంగతుర్తి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రజకులకు న్యాయం చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : మన మల్కాజిగిరిలో రజకుల పట్ల జరుగుతున్న అన్యాయాన్ని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేకర్ రెడ్డి జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్ళారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్‌లో దశాబ్దాలుగా రజకులు ధోభిఘాట్ ఏర్పాటు చేసుకుని అక్కడే తమ కులవృత్తి చేసుకుంటూ కొన్ని తరాల వారు జీవనోపాధి సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో దోభిఘాట్‌ను అధునాతన సౌకర్యాలతో నిర్మించి ఇస్తామని బల్దియా అధికారులు రజకులకు చెప్పి ఉన్న దోభిఘాట్‌ను కూల్చి వేశారు. దోభిఘాట్‌ను కూల్చివేసిన అనంతరం చుట్టూ ప్రహారి గోడను నిర్మించిన తర్వాత స్థానికులు కొందరు అడ్డంకులు ధోబిఘాట్ స్థలం కాలనీకి చెందినదని కొద్ది మంది స్వార్థపూరిత ఆలోచనలతో అడ్డంకులు సృష్టిస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. అంతేకాక దోభిఘాట్‌లో తెలంగాణ పోరాట స్ఫూర్తి చాకలి (చిట్యాల) ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే గుర్తు తెలియని దుండగులు తొలగించారని తెలిపారు. దీని పోలీసులు కానీ, అధికార పార్టీ నాయకులు గానీ స్పందించలేదంటే రజకుల పట్ల మల్కాజిగిరిలో జరుగుతున్న వివక్షను అర్థం చేసుకోవచ్చని ఆయన కలెక్టర్‌కు తెలియజేశారు. రజకులతో కలిసి స్థానిక అధికారుల నుండి మొదలుకొని జిల్లా కలెక్టర్ వరకు అందరికీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు విన్నవించారు. చట్ట బద్ధంగా పోరాటం చేసేందుకు రజకులకు అన్ని విధాలుగా హక్కులు ఉన్నాయని, అవసరమైతే హై కోర్టుకు వెళ్లి రజకులకు తిరిగి దోభిఘాట్‌ను అప్పగించే వరకు తన చట్ట బద్ధమైన పోరాటం సాగుతుందని అన్నారు. అలాగే రజకులు ఎదుర్కొంటున్న మరో సమస్య అన్నపూర్ణ సొసైటీలోని దోభిఘాట్‌ను వెస్లీ సొసైటీ తమదని అక్రమంగా నిర్మాణం చేపట్టిన విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తూ అధికారిక సర్వే నిర్వహించి రజకులకు స్థలాన్ని కబ్జాకోరుల చెరనుండి విడిపించి రజకులకు అప్పగించాలని కోరారు.

ఘనంగా విజ్ఞాన జ్యోతి స్కూల్లో స్పోర్ట్స్‌డే

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం మధుర నగర్‌లో ఉన్న విజ్ఞాన జ్యోతి పబ్లిక్ స్కూల్ వార్షిక స్పోర్ట్స్ డే నీ, శు క్రవారం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి స్కూల్ విద్యార్థులు తాము చదువులోనే కాక క్రీడల్లో కూడా ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని నిరూపించారు. అలాగే ఈ స్పోర్ట్స్ డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఐపీఎస్ రాజీవ్ త్రివేది, అధ్యక్షులు విజ్ఞాన జ్యోతి పాఠశాల అలాగే ఫిలిం ప్రొడ్యూసర్ డి. సురేష్ బాబు, మాజీ ఐపీఎస్ కే. దుర్గాప్రసాద్, జనరల్ సెక్రెటరీ విజ్ఞాన్ జ్యోతి స్కూల్ ఇంకా చైర్మన్ జి.కృష్ణ ప్రసాద్ మొదలైన వారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో చదువుతున్న 2363 విద్యార్థులతో పాటు 98 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొని స్పోర్ట్స్ డే ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఐపీఎస్ రాజీవ్ త్రివేది మాట్లాడుతూ నేడు సమాజంలో విద్యార్థుల పాత్ర ఎంతో ఉందని వారు రేపటి తరానికి భవిష్యత్ పునాదులు వారు క్రీడల్లో, చదువుల్లో నైపుణ్యం సాధించి తమ తమ తల్లిదండ్రుల పేర్లను, ఉపాధ్యాయుల పేర్లను నిలబెట్టాలని అలాగే దేశం కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. మిగతా ముఖ్య అతిథులు కూడా విద్యార్థులను సంబంధించి వారి ఉన్నత ఆశయాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జె. అరుణకుమారి మాట్లాడుతూ 2024 సీబీఎస్సీ పదవ తరగతిలో 135 విద్యార్థులు పాల్గొని అందులో 100శాతం పాస్ అవడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే విజ్ఞాన జ్యోతి స్కూల్‌కి స్వామి వివేకానంద నేషనల్ ప్రిన్సిపాల్ అవార్డు దక్కడం గర్వకారంగా భావిస్తున్నామని తన ఉపన్యాసంలో ప్రిన్సిపాల్ జే. అరుణ కుమారి తెలియజేశారు. అన్నిటికీ మించి అంబ్రెల్లా డాన్స్ అందర్నీ ఆకట్టుకుంది.

అంబర్‌పేట కబేలాకు వెంటనే టెండర్లు వేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంబర్‌పేట కబేలాను నిర్వహించే కాంట్రాక్ట్ సమయం ఏప్రిల్ 2024లో ముగిసినప్పటికీ టెండర్లు వేయకుండా లీజును పొడిగించడం అక్రమమని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ నుండి ఆరు నెలల పాటు పొడిగించిన జిహెచ్ఎంసి అధికారులు మరోసారి పొడిగించడానికి ప్రయత్నిస్తున్నారని, టెండర్లు వేయకుండా లీజ్ పొడిగించాల్సిన అవసరం ఏమొచ్చిందని, 2021 ఏప్రిల్‌లో అన్మోల్ ట్రేడింగ్ కంపెనీ అల్ ఆహాద్ కంపెనీలతో కూడిన కన్సార్టియంతో మూడేళ్ల కాలానికి ఒప్పందం కుదుర్చుకున్న జిహెచ్ఎంసి, 2024 ఏప్రిల్ కంటే ముందే టెండర్ ప్రక్రియ మొదలు పెట్టకుండా సమయం లేదంటూ లీజ్ పొడిగిస్తూ వెళ్తున్నారని ఆయన పేర్కొన్నారు. లీజ్ పొడిగింపులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని, గత కొన్నేళ్లుగా చెంగిచెర్ల కబేలాలో గత ప్రభుత్వం ఇదే రకమైన అక్రమాలకు పాల్పడిందని, ఈ ప్రభుత్వం కూడా అంబర్ పేటలో అదే పద్ధతి కొనసాగిస్తుందని ఆయన ఆరోపించారు. లీజ్ పొడిగింపు తక్షణమే ఆపాలని, టెండర్ ప్రక్రియని వెంటనే మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో సీఎం బర్త్‌డే వేడుకలు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను శుక్రవారం నల్గొండ పట్టణంలోని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణుల సమక్షంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్‌లు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలంతా గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండ నియోజకవర్గంతో పాటు జిల్లాలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. త్వరలోనే పేద ప్రజలందరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కనగల్ మాజీ జెడ్పిటిసి నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, పానగల్ పిఎసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామ్ రెడ్డి చికెన్ మార్ట్‌ను ప్రారంభించిన కార్పొరేటర్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రామ్ రెడ్డి చికెన్ మార్ట్‌ను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యతతో కూడిన పౌష్టిక ఆహారాన్ని వినియోగదారులకు అందించి మంచి పేరును గడించాలన్నారు. మార్కెట్‌లో ఉన్న పోటీని తట్టుకుని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో, యువత స్వయం ఉపాధి పొందే మార్గం వైపు రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విఠల్, రాజు నాయక్, శేఖర్, ప్రభాకర్, రంగస్వామి, కృష్ణ నాయక్, విజయ్ బసని, శివ, సురేష్, తిరుపతి, నరసింహా రాజు, పండు, తిరుపతి, రామ్ రెడ్డి చికెన్ షాప్ యాజమాన్యం సురేష్, స్థానిక నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు, వనపర్తి పరిసర ప్రాంతాల క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన క్రీడా ప్రాంగణాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కే శివసేనారెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ప్రతిపాదిత క్రీడా ప్రాంగణ నిర్మాణ పనుల పై ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో స్పోర్ట్స్ స్కూల్ ను ఏర్పాటు కోసం దాదాపు 30 ఎకరాల అనువైన భూమిని జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతిపాదిత క్రీడా ప్రాంగణంలో హాకీ మైదానం స్విమ్మింగ్ పూల్,జిమ్ హాల్ తోపాటు ఇతర క్రీడాంశాలకు శిక్షణ ఇచ్చే విధంగా స్టేడియాన్ని నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు ,స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి రవీందర్ ఇంజనీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందుముల పరమేశ్వర్ రెడ్డి విచ్చేసి పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేసారు. మహిళల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పాటుపడుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ సిలిండర్‌పై సబ్సిడీతోపాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వి.ఎస్ అహల్యా ప్రకాష్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, క్రిష్ణ రెడ్డి, సంతోష్ రెడ్డి, నర్సింగ్ రావు, మహిళా అధ్యక్షురాలు ఉమ, మెతుకు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, షెరీఫ్ ఉద్దీన్, నూతనగంటి రాజు, ఈసూఫ్, ఫిరోజ్, అజీమ్, క్రుపాకర్, రాజేష్, రేవంత్, క్రాంతి, శంకర్ గౌడ్, నరేష్, సహీమ్, ఎల్లో బాయ్, మమత, కమలమ్మ, జయమ్మ, రజియ పాల్గొన్నారు.

వరల్డ్ పీస్ కౌన్సిల్ మహాసభకు భారతదేశ ప్రతినిధిగా దిడ్డి సుధాకర్

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : నేపాల్ రాజధాని ఖాట్మండులో ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకు జరగనున్న ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న వరల్డ్ పీస్ కౌన్సిల్ మహాసభలకు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐపీసో) జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్ భారత దేశ ప్రతినిధిగా హాజరుకానున్నారని ఐప్సో తెలంగాణ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్ తెలిపారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ అమృత ఎస్టేట్స్ ఐపీసో రాష్ట్ర కార్యాలయంలో శుక్ర వారం ఐప్సో తెలంగాణ రాష్ట్ర కమిటీ డాక్టర్ దిడ్డి సుధాకర్‌ను ఘనంగా సత్కరించింది. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ వరల్డ్ పీస్ కౌన్సిల్ అనేది 100 కంటే ఎక్కువ దేశాలలో ఉన్న అతిపెద్ద అంతర్జాతీయ శాంతి నిర్మాణ సంస్థ అని, రష్యా ఉక్రెయిన్, మధ్యప్రాచ్యంలో జరుగుతున్న క్రూరమైన యుద్ధాలు, మారణహోమం నేడు జరుగుతున్న తరుణంలో ఈ మహాసభ నేపాల్‌లో జరుగుతుండటం ప్రాముఖ్యతను సంతరించుకున్నవన్నారు. దేశాల మధ్య యుద్ధాల నివారణ, ప్రపంచ శాంతి, నిరాయుధీకరణ, ప్రపంచ భద్రత, స్వాతంత్ర్యం, ఆర్థిక, సామాజిక న్యాయం, అభివృద్ధి, పర్యావరణం, మానవ హక్కులు, సాంస్కృతిక వారసత్వం పరిరక్షణ వంటి అంశాలపై ఈ మహాసభలలో చేర్చించి పలు తీర్మానాలు చేయడం జరుగుతుందని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐప్సో రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు ఎం ఆర్ జి వినోద్ రెడ్డి, డాక్టర్ తిప్పర్తి యాదయ్య, మెట్ల జగన్, హైదరాబాద్ నగరం ప్రధాన కార్యదర్శి రామరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. నగేష్, అంజన్ కుమార్, లింగమూర్తి, డాక్టర్ నరసింహ మూర్తి, కోశాధికారి జగన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృ శ్రీ నగర్ కాలనీకి చెందిన రవితేజకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడు తూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘా టించారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏండీ ఇబ్రహీం పాల్గొన్నారు.

ఎఫ్.సి.ఎన్ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో అన్నదానం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండల పరిధిలోని లింగారెడ్డి గూడ గ్రామం బైపాస్ రోడ్ ఎఫ్.సి.ఎన్ ఫౌండేషన్ వృద్ధ ఆశ్రమంలో కేశం పెట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుంధర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకట్ రాంరెడ్డి, విశ్వం, చెంది తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూర్, బాబర్ అలీ ఖాన్, రఘు నాయక్, శ్రీనివాస్, శ్రీను నాయక్, బచ్చలి నరేష్, కొప్పనూరి ప్రవణ్, దిలీప్ ముబారక్, పురుషోత్తం రెడ్డి,సీతారాం, అశోక్, శేఖర్, నవీన్, రమేష్, మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా గొట్టిముక్కల పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర-కూకట్పల్లి: సీనియర్ నాయకులు, సినీ నిర్మాత గొట్టిముక్కల పద్మారావు పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని శుక్రవారం కూకట్పల్లిలోని ఆయన నివాసంలో అభిమానులు, బంధు మిత్రలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు అభిమానులు పెద్ద ఎత్తున పద్మారావు నివాసానికి తరలివచ్చి భారీ కేక్ శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లికి చెందిన జిపిఆర్ యువసేన నాయకులు అంబటి రాంబాబు, బాణాల శంకర్, అఖిల్, మేకల రమేష్, జగన్, షహనూర్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ గొప్ప దేశం: పుతిన్

సోచి: భారత్‌ను గొప్ప దేశంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పొగిడారు. శక్తిమంతమైన దేశాల సరసన నిలిచేందుకు భారత్‌కు అర్హత ఉందన్నారు. ప్రపంచ దేశాలతో పోల్చితే భారత ఆర్థిక వృద్ధి వేగంగా సాగుతోందని ప్రశంసించారు. జనాభాలోనూ భారత్ ముందుందని, 1.5 బిలియన్ల (150 కోట్ల) జనాభా గల దేశంగా నిలిచిందని చెప్పారు. ఏటా పది మిలియన్ల (కోటి) మంది పెరుగుతున్నట్లు తెలిపారు. సోచిలోని వల్దాయి డిస్కషన్ క్లబ్‌లో జరిగిన ప్లీనరీ సమావేశం సందర్భంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో అన్ని రంగాల్లోనూ రష్యా సంబంధా లను అభివృద్ధి చేసుకుంటోందన్నారు. ద్వైపాక్షిక బంధం కూడా నమ్మకమైనదిగా ఉందని పుతిన్ చెప్పారు. సూపర్ పవర్ జాబితాలో భారతదేశం పేరు చేర్చాలన్నారు. భవిష్యత్ వృద్ధి ప్రణాళికలు, పురాతన సంప్రదా యాలు భారత్ ప్రతిష్టను పెంచుతున్నాయ న్నారు. నేటి వాస్తవికతల ఆధారంగా తమ దేశాల మధ్య బంధాల గతిని, దృక్పథాన్ని నిర్ణయిస్తున్నట్లు పుతిన్ వెల్లడించారు. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం తమ మధ్య సహకారం బలోపేతం అవుతోందని చెప్పారు. రక్షణ, భద్రతా రంగాల్లో సయోధ్య పెంచుకుం టున్నట్లు తెలిపారు. 'భారత సాయుధ దళాల సేవలోని వివిధ రకాల రష్యా సైనిక పరికరాలను చూస్తే రెండు దేశాల మధ్య ఏ స్థాయి నమ్మకం ఉందో అర్థమవుతుంది' అని అన్నారు. భారత్‌కు ఆయుధాలను తాము విక్రయించమని, వాటిని కలిసి తయారు చేస్తామని పుతిన్ చెప్పారు. ఉదాహరణగా బ్రహ్మోస్ క్రూయిజ్ క్షిపణి ప్రాజెక్టును ఆయన ప్రస్తావించారు.

ఇళ్ల సమస్యపై 18న గ్రామ-వార్డు

సచివాలయాలకు వినతులు

జయప్రదానికి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇళ్ల స్థలాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18న రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో తలపెట్టిన వినతుల సమర్పణను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి రూ.4లక్షలకు బదులు రూ.5లక్షలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వామపక్షాలకు మంచి ఆయుధం ఇచ్చిందని, దీన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ శ్రేణులకు సూచించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశం (జూమ్ మీటింగ్)లో రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వం సెంటు, సెంటున్నర భూమి ఇచ్చింది కానీ నిర్మాణానికి కేవలం రూ.లక్షా80వేలు మాత్రమే ఇవ్వడం నిర్మాణాలు సాధ్యం కాలేదని చెప్పారు. ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు పెరగడంతో నిర్మాణ వ్యయం భరించలేక చాలా ఇళ్ల నిర్మాణం ఎక్కడికక్కడ నిలిచిపోయిందని రామకృష్ణ గుర్తుచేశారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన, నిరసనలపై జిల్లా కార్యదర్శులు, నేతలకు దిశనిర్దేశం చేశారు. ఈనెల 18న అన్ని గ్రామ సచివాలయాల్లో సంబంధిత అర్జీలు అందజేయాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఇప్పటికే కరపత్రాలు, దరఖాస్తులను శాఖలకు పంపామని చెప్పారు. పట్టణ కార్యదర్శులతో ఇళ్ల పట్టాల సమస్యలపై ఆదివారం జూమ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ చార్జీల బాదుడుపై 19న విజయవాడలో నిరసన చేస్తామని చెప్పారు. ట్రూఅప్ చార్జీల భారం ప్రజలపై మోపకుండా ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకూ జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్, సదస్సులు, ర్యాలీలు, నిరసనలకు ఇప్పటికే పిలుపునిచ్చినట్లు రామకృష్ణ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా డిసెంబరులోనూ ఆందోళనలు చేస్తామన్నారు. పార్టీ సభ్యత్వ పునరుద్దరణ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సీపీఐ శ్రేణులకు రామకృష్ణ సూచించారు. బలోపేతం కావాలన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణాలకు అక్కడి అధికారులతో మాట్లాడి భూసేకరణ చేయాలని సూచించారు. దాతల సహకారంతో పార్టీ భవన నిర్మాణాలకు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈనెల 26న జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, కేంద్ర కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, కార్యవర్గ సభ్యులు ఎస్.లెనిన్‌బాబు, పి.మనోహర్ నాయుడు, సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, జంగాల అజయ్ కుమార్, డేగా ప్రభాకర్ మిగిలిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తెలుగు కథకుల్లో అరుదైన వ్యక్తి 'కాళీపట్నం'

జయంతి సభలో ప్రముఖుల నివాళి

విశాలాంధ్ర-విశాఖ: తెలుగు అగ్రశ్రేణి కథకుల్లో కాళీపట్నం రామారావు ఒకరని ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ నరసింహారావు అన్నారు. "కళా ప్రపూర్ణ" కాళీపట్నం రామారావు శత జయంతి వేడుకలను ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో కాళీపట్నం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు శాఖ గౌరవాచార్యులు వెలమల సిమ్మన్న రాసిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 2008లో లోకనాయక్ ఫౌండేషన్ అవార్డు ప్రముఖ నటుడు ఎన్టీ రామారావు జాతీయ పురస్కారం అందుకున్న మహానుభావుడు కాళీపట్నం అన్నారు. ఆయన తన కథల్లో సామాజిక వాస్తవికతను చిత్రీకరించారన్నారు. అప్పారావు మాట్లాడుతూ తెలుగు శాఖలో నూరు సంవత్సరాల పండగ చేసుకోవడం ఆనదంగా ఉందని అన్నారు. కాళీపట్నం ఆదర్శమూర్తి అన్నారు. సమాజంలో చాలా అరుదుగా ఉంటారన్నారు. 1996లో శ్రీకాకుళంలో కథానిలయం ఏర్పాటు చేశారన్నారు. గురజాడ దిద్దుబాటు కథ వెలువడిన ఫిబ్రవరి 22న కథానిలయం ప్రారంభమైందన్నారు. గ్రంథకర్త ఆచార్య వెలమల సిమ్మన్న మాట్లడుతూ యజ్ఞం, ఆర్తీ చావు, మొదలైన కథల్లో దళిత జీవితాన్ని... శ్రామిక జీవిత చరిత్ర చిత్రీకరిస్తూ కుట్ర ,తీర్పు, శాంతి కథలు రాశారన్నారు. హింస, జీవదార తదితర కథల్లో మానవ జీవితాన్ని లోతుగా చిత్రీకరించారన్నారు. కాళీపట్నం సుబ్బారావు, డాక్టర్ ఈశ్వరమ్మ , లావణ్య, వెంకటస్వామి, రత్న శేఖర్, వెంకటేశ్వర్లు, సీతారత్నం, గిరీష్ కుమార్ , ఎం. దాసు, ఎం .ప్రతాప్, సూర్యనారాయణ, కృష్ణవేణి, పరిశోధకులు పాల్గొన్నారు.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మళ్లీ రభస

- రాష్ట్ర హోదా తీర్మానంపై బీజేపీ ఎమ్మెల్యేల రగడ
- వెల్‌లోకి దూసుకెళ్లే యత్నం-బయటకు పంపిన మార్షల్స్
- అసెంబ్లీ బయట ధర్నా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై ప్రతిపక్ష బీజేపీ అగ్గి రాజేసింది. విపక్ష సభ్యుల నినాదాలు, ఆందోళన నడుమ సభ మళ్లీ రసాభాస అయింది. ప్రత్యేక హోదాపై అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని చట్ట వ్యతిరేకమంటూ బీజేపీ ఎమ్మెల్యేలు నిరసనకు దిగారు. దాని రద్దునకు డిమాండ్ చేశారు. వరుసగా మూడో రోజు గొడవ చేశారు. దీంతో గందరగోళం నెలకొంది. పరిస్థితిని అదుపు చేసేందుకు స్పీకర్ ప్రయత్నించారు కానీ బీజేపీ సభ్యులు రెచ్చిపోవడంతో మార్షల్స్ రాక తప్పలేదు. సభ మొదలైన వెంటనే బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. పాకిస్థాన్ అజెండా సాగనివ్వమంటూ నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో గొడవ చేసే సభ్యులను బయటకు పంపండని మార్షల్స్‌కు స్పీకర్ సూచించారు. 12 మంది బీజేపీ ఎమ్మెల్యేలతో పాటు శాసన సభ్యుడు షేక్ ఖుర్షీద్‌ను బయటకు తీసుకెళ్లమన్నారు. స్పీకర్ తీరుకు నిరసనగా మిగతా 11 మంది బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అంతకుముందు అధికరణ 370కు మద్దతుగా బ్యానర్‌ను ప్రదర్శిం చేందుకు పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) ఎమ్మెల్యే వహీద్ పర్రా ప్రయత్నించారు. అందుకు పీపుల్స్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే సజాద్ లోనె, ఏఐపీ సభ్యుడు షేక్ ఖుర్షీద్ మద్దతిచ్చారు. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగంపై మాట్లాడేందుకు నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే జావిద్ బేగ్ లేచి నలబడగానే బీజేపీ ఎమ్మెల్యేలు నినాదాలు మొదలుపెట్టారు. ప్రత్యేక రాష్ట్ర హోదా పునరుద్ధరణ తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 'భారత్ మాతాకి జై, 'పాకిస్థాన్ అజెండా అమలు కానివ్వం', 'వేర్పాటు వాద అజెండాను అంగీకరించం' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లిన సభ్యులను స్పీకర్ ఆదేశాలతో మార్షల్స్ బయటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత సభ కార్యకలాపాలు సజావుగా సాగాయి. లెఫ్టినెంట్ గవర్నర్ ప్రసంగంపై ముజఫర్ ఇక్బాల్ ఖాన్ (స్వతంత్ర ఎమ్మెల్యే), నిజాం భట్ (కాంగ్రెస్), రఫీక్ నాయక్ (పీడీపీ), ఎంవై తరిగామి (సీపీఎం) మాట్లాడారు. అయితే అసెంబ్లీ బయట బీజేపీ సభ్యులు ధర్నా చేశారు. సమస్యలపై మాట్లాడ నివ్వకుండా తమకు బయటకు గెంటివేశారని స్పీకర్‌పై మండిపడ్డారు. కాగా, రాష్ట్రహోదాపై తీర్మానానికి వ్యతిరేకంగా బీజేపీ ఎమ్మెల్యేల దుమారంతో అసెంబ్లీ రణరంగమైంది. సభ ఆమోదించిన తీర్మానాన్ని ఉపసంహరించే అధికారం స్పీకర్‌కు లేదంటూ బీజేపీ సభ్యుల డిమాండ్‌ను అబ్దుల్ రహీం తోసిపుచ్చారు.

ఇక వాయిదాలుండవు

రఘురామ కేసుపై సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

25కి విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మాజీ ఎంపీ, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు కస్టోడియల్ టార్చర్ కేసులో విచారణ మరోసారి వాయిదా పడింది. ఈ నెల 25న తదుపరి విచారణ చేపడతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సీఐడీ అదనపు ఎస్పీ విజయ్‌పాల్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ తమకు గురువారమే అందిందని, రిజాయిండర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని విజయ్‌పాల్ న్యాయవాదులు కోరారు. ఈక్రమంలో రెండు వారాలు గడువు ఇస్తున్నట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ మహదేవన్ ధర్మాసనం తెలిపింది. ఈ నెల 25న తుది విచారణ చేపడతామని పేర్కొంది. ఆ తర్వాత వాయిదాలు ఉండవని... ఆరోజే అన్ని విషయాలపై నిర్ణయం ఉంటుందని స్పష్టం చేసింది.

రవీందర్‌రెడ్డి కోసం గాలింపు

వైసీపీ సామాజిక మాధ్యమ కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డి కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. నాలుగు ప్రత్యేక బృందాలు అతడ్ని పట్టుకునేందుకు యత్నిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరుతో పాటు కమలాపురం, పులివెందుల ప్రాంతాలకు పోలీసు బృందాలు వెళ్లాయి. వర్రా రవీందర్‌రెడ్డి వాడే రెండు ఫోన్లూ స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయని, అన్ని రకాలుగా నిఘా పెట్టామని పోలీసు అధికారులు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే బీసీలకు మేలు

ఓబీసీ ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: బీసీలపై అసలైన ప్రేమ కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు బీసీలకు ఎనలేని గౌరవం దక్కిందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. ఓబీసీ అధ్యక్షుడుగా శొంటి నాగరాజు ప్రమాణ స్వీకారం స్థానిక జీ కన్వెన్షన్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన షర్మిల మాట్లాడుతూ దేశానికి బీసీ ప్రధానిగా ఉన్నాడని చెప్పుకునే నరేంద్ర మోదీ ... వారికి ఏం చేశారని ప్రశ్నించారు. మోదీకి తోడుదొంగలుగా ఉన్న జగన్, చంద్రబాబు నాయుడు బీసీలపై కపట ప్రేమ చూపుతున్నారని ఆరోపించారు. 93 కులాలుగా ఉన్న బీసీలను 150 కులాలకు పెంచిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్‌తోనే బీసీలకు మేలు జరుగుతుందని అన్నారు. బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ ప్రతిపాదన చేసింది రాజశేఖరెడ్డి అన్నారు. బీసీలకు న్యాయం చేయడంలో మోదీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. 2019 ఎన్నికల ముందే బీసీ కులగణన చేస్తామని చెప్పిన బీజేపీ ఆ మాటకు కట్టుబడలేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితమని చెబుతున్న సీఎం రాష్ట్ర ప్రజలపై రూ.వేలకోట్లు కరెంటు చార్జీల భారం మోపారన్నారు. భారతదేశ సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని రాహుల్ గాంధీ ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణాలో కులగణన జరగడం ఇందుకు నిలువెత్తు నిదర్శనమన్నారు. మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, ఏఐసీసీ ఇంఛార్జి పాలకవర్మ, డీసీసీ అధ్యక్షుడు గొల్లు కృష్ణ, ఇంఛార్జి మార్నీడు బాబ్జీ, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, పీసీసీ జనరల్ సెక్రటరీ మొవ్వ మోహనరావు, విజయవాడ నగర ఇంఛార్జి నరహరిశెట్టి నరసింహారావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్, మచిలీపట్నం నియోజకవర్గ ఇంఛార్జి మతిన్, అవనిగడ్డ నియోజకవర్గ ఇంఛార్జి అందే శ్రీరామ మూర్తి, ఓబీసీ రాష్ట్ర పరిశీలకుడు వెంకట్రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

సత్వరమే రహదారులకు మరమ్మతులు: జనార్దన్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సంక్రాంతి నాటికి గుంతల రహిత రాష్ట్రమే లక్ష్యంగా రహదారులకు సత్వరమే మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో శుక్రవారం ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రోడ్ల మరమ్మతులు సకాలంలో పూర్తి చేయడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. రోజువారి ప్రగతిని నివేదించాలని, పనుల నాణ్యతలో రాజీ వద్దని సూచించారు. మరమ్మతులు చేయడానికి ముందుకు రాని కాంట్రాక్టర్లపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పుడు పూడ్చిన గుంతలు వర్షాకాలం వచ్చే వరకు పాడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఈఎన్‌సీ నయిముల్లా, ఎస్‌హెచ్‌చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అఖిలేశ్‌పై సీఎం యోగి విసుర్లు

మొరాదాబాద్: తమ పాలనలో రాష్ట్రంలో కర్ఫ్యూలు లేవు, అల్లర్లు లేవని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చెప్పుకొచ్చారు. ఉత్తరపద్రేశ్‌లోని మొరాదాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ అఖిలేశ్ యాదవ్ సారథ్యంలోని సమాజవాదీ పార్టీపై విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం సమాజ హితం కోసం ఏ మంచి పని చేసినా... సమాజ్‌వాదీ పార్టీకి సమస్యగా ఉంటుందని ఆయన అన్నారు. సమాజవాదీ పార్టీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగలేదన్నారు. పైగా అక్రమాలు, అవినీతిని ఆ పార్టీ పెంచి పోషించిందని ఆరోపించారు. ఎస్పీ జెండా ఉన్న వాహనం పెద్ద గూండాకు పర్యాయపదంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అయోధ్యలో ఆ పార్టీ నాయకుడు ఒక యువతితో అసభ్యంగా ప్రవర్తించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ తరహా ఘటనలు సమాజవాదీ పార్టీ హయాంలో చాలా చోటుచేసుకున్నాయని వివరించారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు.

అమెరికాలో నల్లజాతీయులకు బెదిరింపులు

వాషింగ్టన్: అమెరికా వ్యాప్తంగా నల్లజాతీయులకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయి. కాలిఫోర్నియా, పెన్సిల్వేనియా, న్యూజెర్సీ, మిచిగాన్, నార్త్ కరోలినా, వర్జీనియా, అలబామా సహా కొన్ని రాష్ట్రాల్లో ఈ తరహా సందేశాలు ఎక్కువగా వస్తున్నట్లు గుర్తించారు. వీటిపై విచారణ చేపడుతున్నట్లు అమెరికా అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి ట్రంప్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అనంతరమే బెదిరింపు సందేశాలు వచ్చాయని, అవి ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా ఉన్నట్లు గుర్తించించామని స్థానిక వార్తా నివేదికలు, సోషల్ మీడియా పోస్టులు పేర్కొన్నాయి. ఈ సందేశాలు ట్రంప్ మద్దతుదారు, ఎంఏజీఏ హ్యాష్‌ట్యాగ్‌తో వచ్చినట్లు తెలిపాయి. తన 15 ఏళ్ల మేనకోడలికి ఈ తరహా మెసేజ్ వచ్చిందని మిచిగాన్‌లోని గ్రాండ్ రాపిడ్స్‌కి చెందిన అమెరికన్ మహిళ పేర్కొన్నారు. కొన్ని రోజుల తర్వాత ఈ తరహా మెసేజ్‌లు వస్తాయని ఊహించామని, అయితే ఎన్నికల మరుసటి రోజు నుండే ఈ సందేశాలు వస్తున్నాయని, పరిస్థితి భయానకంగా ఉందని అన్నారు.

నేడు వలంటీర్ల సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని 2.60 లక్షల మంది వలంటీర్ల భవిష్యత్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకి నివేదించేందుకు శనివారం విజయవాడ హనుమాన్‌పేట మారుతీ కల్యాణమండపంలో వలంటీర్ల సదస్సు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సదస్సు జరగకుండా ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి నియంతృత్వంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎక్కడిక్కడ వలంటీర్లు, యువజన సమాఖ్య నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చి ముందస్తు అరెస్టులు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికలకు ముందు వలంటీర్లకు గౌరవ వేతనం నెలకు రూ.5వేలు సరిపోవు రూ.10వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారని, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ సారీ...కామ్రేడ్స్ అంటూ ట్వీట్ చేశారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సర్పంచ్‌ల సమావేశంలో వలంటీర్లు సాంకేతికంగా ప్రభుత్వంతో లేరని చెప్పారన్నారు. ఈ ముగ్గురు ముఖ్య నేతలు మూడు రకాలుగా మాట్లాడటంతో గందరగోళం నెలకొందని చెప్పారు. వలంటీర్ల భవిష్యత్తుపై సరైన నిర్ణయం తీసుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం: ఈశ్వరయ్య

ప్రతిపక్షంలో ఉండగా అప్పటి వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తోందని విమర్శించిన వారు ఇప్పుడు అదే తీరుగా వ్యవహరించటం ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తున్నట్లు కాదా? అని నిలదీశారు. వలంటీర్ల గురించి వైసీపీ ప్రభుత్వం జీవో ఇవ్వలేదని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ వైసీపీ నాయకులు ట్విట్టర్ వేదికగా జీవోలను పోస్ట్ చేశారని... ఈ అంశంపై పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసుల నిర్బంధాలను ఎదిరించి వలంటీర్లు సదస్సుకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వలంటీర్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, కార్యానిర్వాహక కార్యదర్శి లంకా గోవిందరాజులు పాల్గొన్నారు.

బాల్యం ఛిద్రం

- ప్రపంచవ్యాప్తంగా హింసకు గురైన 100 కోట్ల మంది పిల్లలు
- బాధితులంతా 2-17 ఏళ్ల వారే
- ప్రతి 10 మందిలో తొమ్మిది మందికి వేధింపులు
- 13 నిమిషాలకో హత్య: ప్రపంచ ఆరోగ్య సంస్థ

న్యూదిల్లీ: బాల్యం ఛిద్రమవుతోంది. పసితనం మరుగున పడిపోతోంది. ఊహాలోకం నరకమవుతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్ల మంది చిన్నారుల దుస్థితి. ప్రతి 10 మందిలో తొమ్మిది మంది పిల్లలు వేధింపులకు గురవుతున్నారు. ప్రతి 13 నిమిషాలకో ఒక చిన్నారి హత్య జరగుతోంది. అంతర్జాతీయంగా బాలలపై హింస పేట్రేగిపోతుండటంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆందోళన వ్యక్తంచేసింది. ప్రతి నిమిషం ఎక్కడో ఒక చోట పిల్లలపై ఏదో ఒక రూపంలో హింస జరుగుతోందని, అంతర్జాతీయ స్థాయిలో 100 కోట్ల మంది పిల్లలు హింసకు గురైనట్లు తాజా నివేదికలో తెలిపింది. బాధితులంతా 2-17ఏళ్ల మధ్య వయస్సులని పేర్కొంది. వీరంతా భౌతికంగా, మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురైనవారని తెలిపింది. ప్రతి 13 నిమిషాలకు ఒక చిన్నారి లేక కౌమరదశలోని పిల్లల హత్య నమోదవుతున్నట్లు నివేదించింది. నివారించదగ్గ మరణాలు ఏటా 40వేలు జరుగుతున్నాయని పేర్కొంది. భయానక అనుభవాలతో పసిహృదయాలు తల్లడిల్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేసింది. తాము ఎదుర్కొన్న వేధింపుల గురించి బాధితుల్లో సగం మంది మాత్రమే చెప్పగలరని, 10శాతం మందికి మాత్రమే సాయం అందుతోందని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది. చిన్నతనంలో హింసకు గురైన కారణంగా ఆందోళన, మనోవ్యధతో వారు బాధడతారని, మత్తుకు, సెక్స్‌కు బానిసలు కావడం, పొగ తాగడం వంటివి అలవాటై చదువుల్లో రాణించలేరని వెల్లడించింది.

పిల్లలపై పెరుగుతున్న హింసను కట్టడి చేసేందుకు 100 దేశాలు ముందుకొచ్చాయి. కొలంబియాలోని బొగోటాలో జరిగిన గురువారం జరిగిన సదస్సులో చారిత్రక నిర్ణయాలు తీసుకున్నాయి. పిల్లలపై చేయిచేసుకోవడానికి వీల్లేకుండా దెబ్బలు కొట్టే శిక్షణను నిషేధించాలని తొమ్మిది దేశాలు నిర్ణయించాయి. 'ప్రతి ఐదుగురులో కనీసం ముగ్గురు పిల్లలు ఇళ్లల్లో దెబ్బలు తింటున్నారు. ఐదుగురు బాలికల్లో ఒకరు... ఏడుగురు అబ్బాయిల్లో ఒకరు చొప్పున లైంగిక వేధింపులకు గురవుతున్నారు. 25-50శాతం మంది పిల్లలు ర్యాగింగ్/వేధింపులకు గురవుతున్నారు. దీంతో వారి మనస్సులకయ్యే గాయాలు తరాలు మారినా మానడంలేదు. ఇళ్లతో పాటు పాఠశాలలను సురక్షితమైనవిగా మార్చడం, ఆన్‌లైన్ వేధింపులను కట్టడి చేయడం వంటి చర్యలతో పిల్లలకు ప్రాథమిక రక్షణ లభిస్తుంది' అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధానోమ్ ఘెబ్రియేసెస్ అన్నారు.

కౌమారదశలోని బాలురు తుపాకులు ఇతర ఆయుధాల కారణంగా చనిపోతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో కఠినంగా, హింసాత్మకంగా వ్యవహరించడం మానేసి, వారిలో సానుకూల సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలి. తమ పిల్లలను ఎవరైనా ఏడిపిస్తున్నారా, వేధిస్తున్నారా అని ఆరా తీయాలి. వారితో స్నేహంగా ఉండాలి. అంతర్జాల వినియోగంపై నిఘా పెట్టాలి. ఇలాంటి జాగ్రత్తలతో పిల్లలకు హింస నుంచి రక్షణ కల్పించే వీలు ఉంటుంది. ప్రభుత్వాలు కూడా ఇటువంటి వ్యూహాలను అమలు చేస్తే పిల్లలపై హింసను 20-50శాతం వరకు తగ్గించవచ్చని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ విషయంలో పురోగతి నత్తనడకన సాగడం గమనార్హం.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.